అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 19-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 318
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00

అఫిడవిట్లపై ఫిర్యాదుల వెల్లువ

నిన్న శ్రీనివాస్ గౌడ్, నేడు మల్లారెడ్డి

- ఎన్నికల అధికారుల తీరుపై విమర్శలు
- పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు
- కోర్టు మెట్లెక్కుతున్న ఫిర్యాదు దారులు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు సమర్పించిన అఫిడవిట్లపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. నామినేషన్ల దాఖలు సందర్భంగా అఫిడవిట్ల పరిశీలనలో రిటర్నింగ్ అధికారులు పక్షపాతంగా వ్యవహరించారని పలువురు ఆరోపిస్తున్నారు. అఫిడవిట్లో తప్పుడు సమాచారం ఇస్తున్నారని పరిశీలన సమయంలోనే స్థానిక అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని బాధితులు అంటున్నారు. అధికారం, డబ్బు ఉన్నవారి పట్ల నిబంధనలకు వ్యతిరేకంగా సానుకూలంగా వ్యవహరిస్తున్నారనే విమర్శల నేపథ్యంలో పలువురు కోర్టు మెట్లెక్కుతున్నారు. ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల అభ్యర్థులపై కూడా గతంలో అనేక ఫిర్యాదులు వెల్లువెత్తాయి. కోర్టు మెట్లెక్కలేక చాలా మంది ఫిర్యాదుతోనే వదిలిపెట్టిన సందర్భాలు ఉన్నాయి. కొంత మంది మాత్రం ఏండ్లుగా సుదీర్ఘ పోరాటం సాగిస్తున్నారు. వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ బాబు జర్మన్ పౌరసత్వం వివాదం పదేళ్లుగా ఓ కొలిక్కి రాలేదు. కింది కోర్టు నుంచి సుప్రీంకోర్టు వరకు అయనకు వ్యతిరేకంగా తీర్పు వచ్చినా ఇంకా అమలు కాలేదు. 2018 ఎన్నికల్లో పోటీ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఎన్నిక చెల్లదంటూ మహబూబ్ నగర్‌కు చెందిన రాఘవేంద్రరాజు అనే వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల అఫిడవిట్‌ను ఒకసారి రిటర్నింగ్ అధికారికి సమర్పించి, మళ్లీ వెనక్కి తీసుకుని సవరించి అందజేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఎన్నికను రద్దు చేయాలని న్యాయస్థానాన్ని కోరారు. అయితే తాజాగా ఆ కేసును కోర్టు కొట్టి వేసింది. పౌర సరఫరాల మంత్రి గంగుల కమలాకర్ ఎన్నికల అఫిడవిట్లో తప్పుడు సమాచారం ఇచ్చారని అతని ఎన్నికను రద్దు చేయాలని బీజేపీకి చెందిన బండి సంజయ్ 2019లో కోర్టులో కేసు దాఖలు చేశారు. అయితే ఆ కేసు ఇంకా పెండింగ్‌లోనే ఉంది. తాజాగా మంత్రి మల్లారెడ్డి ఎన్నికల అఫిడవిట్లో తప్పుడు సమాచారం ఇచ్చారని అంజి రెడ్డి అనే వ్యక్తి కోర్టు మెట్లెక్కారు. అభ్యర్థుల నామినేషన్ పరిశీలన సమయంలోనే సంబంధిత రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపణ. అయితే ఈ పిటీషన్ ప్రాథమిక దశలోనే కోర్టు కొట్టేసింది. ఎన్నికల్లో తప్పుడు అఫిడవిట్ సమర్పించారని మరో మంత్రి పువ్వాడ అజయ్‌పై ప్రత్యర్థి కాంగ్రెస్ పార్టీకి చెందిన తుమ్మల నాగేశ్వర రావు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసారు. తుమ్మల ఫిర్యాదుపై ఎన్నికల సంఘం ఎలాంటి చర్య తీసుకోక పోవడంతో ఆయన న్యాయ పోరాటానికి సిద్దమయ్యారు. ప్రస్తుత ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా ప్రధాన పార్టీలకు చెందిన అనేక మంది అభ్యర్థుల అపిడవిట్లపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఎన్నికల అఫిడవిట్ల పరిశీలన సందర్భంగా రిటర్నింగ్ అధికారుల వ్యవహార శైలే వివాదాలకు కారణమని తెలుస్తోంది.

రేవంత్‌రెడ్డి హెలికాప్టర్‌లో సాంకేతిక లోపం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కామారెడ్డి నియోజకవర్గంలో ప్రచారానికి వెళ్లేందుకు సిద్ధమైన టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి హెలిక్యాప్టర్‌లో సాంకేతిక లోపం ఏర్పడింది. ఆయన రోడ్ మార్గంలో కామారెడ్డికి వెళ్లారు. దీంతో సభలకు ఆలస్యమైంది. రాత్రి 7 గంటలకు సభలు ప్రారంభమయ్యాయి. ఏడు గంటలకు బిక్కనూరు, ఎనిమిది గంటలకు రాజంపేట, తొమ్మిది గంటలకు చిన్న మల్లారెడ్డి సభల్లో ఆయన ప్రసంగించారు.

నేడు ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ ప్రచారం

ఏఐసీసీ అగ్రనేత ప్రియాంక గాంధీ ఆదివారం ఖానాపూర్, అసిఫాబాద్ నియోజక వర్గాల్లో ఎన్నికల ప్రచారం చేయనున్నారు. నాందేడ్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉదయం 10.30కు చేరుకోనున్నారు. అక్కడ గంట సేపు ప్రచార కార్యక్రమంలో పాల్గొంటారు. అక్కడ నుంచి 12 గంటలకు అసిఫాబాద్‌కు రానున్నారు. నాగోబా దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేయనున్నారు.

అనంతరం లంబాడ తండాలో మహిళలతో కలిసి ఆరు గ్యారెంటీలపై ప్రచారం చేయనున్నారు. అక్కడి మహిళలతో కలిసి గిరిజనుల ప్రత్యేక వంటకాలు చేయనున్నారు. మహిళలతో కలిసి ఆర్టీసీ బస్‌లో ప్రయాణం చేయనున్నారు. తిరిగి మధ్యాహ్నం 1 గంటకు అసిఫాబాద్ నుంచి నాందేడ్ వెళ్లనున్నారు.

వ్యక్తి స్వేచ్ఛకు భంగం

- కక్షిదారుల హక్కులకు ప్రమాదం
- క్రిమినల్ లా-చట్టసవరణపై
- 'ఐలు' రౌండ్ టేబుల్‌లో పలువురు వ్యక్తలు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన 'కిమినల్ లా ' చట్టసవరణను అఖిల భారత లాయర్స్ యూనియన్(ఐలు) రౌండు టేబుల్ సమావేశం వ్యతిరేకించింది. ఈ చట్టాల సవరణ మూలంగా రాజ్యాంగం ప్రసాదించిన వ్యక్తిస్వేచ్ఛకు భంగం కలుగుతుందని అభిప్రాయపడింది. సామాన్యులను ఇబ్బందుల పాల్జేస్తుందని వ్యాఖ్యానించింది. కక్షిదారుల హక్కులకు ప్రమాదమేర్పడుందని గుర్తుచేసింది. సీఆర్‌పీసీ, సీపీసీ, ఎవిడెన్స్ చట్టాలను సవరించరాదని డిమాండ్ చేసింది. వర్చువల్ పద్దతిలో సాక్షుల విచారణ మూలంగా కక్షిదారులకు అన్యాయం జరుగుతుందని పేర్కొంది. ఐలు తెలంగాణ గౌరవాధ్యక్షులు జి విద్యాసాగర్ అధ్యక్షతన హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రౌండ్‌టేబుల్ కాన్ఫరెన్స్ జరిగింది.

దీనికి ప్రముఖ న్యాయవాదులు హాజరై మాట్లాడారు. సీనియర్ న్యాయవాది, బార్‌కౌన్సిల్ సభ్యులు జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన క్రిమనల్ లా చట్ట సవరణలో అర్థరహితంగా ఉందని విమర్శించారు. రాజ్యాంగస్ఫూర్తికి విరుద్ధంగా చట్టసవరణ చేపట్టడం సిగ్గుచేటని వ్యాఖ్యానించారు. ప్రత్యేకంగా కొన్ని నిబంధనలు చట్టాలపై అవగాహన లేని వ్యక్తులు, అర్థరహితంగా నిర్వచించారని తప్పుబట్టారు. సీనియర్ న్యాయవాది రఘునాద్ మాట్లాడుతూ ప్రశ్నించే గొంతులను నిలువరించేందుకే కరోనా కాలంలో కొత్త చట్టాలను తెచ్చే ప్రయత్నాలు కేంద్రం చేపట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గుట్టుచప్పుడు కాకుండా ఆమోదం పొందేందుకు కుట్రచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కొత్త చట్టాలను పూర్తిగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని వివరించారు. రాజ్యాంగం ప్రసాదించిన ఆర్టికల్ 19 ప్రకారం భావ ప్రకటనా స్వేచ్ఛ ప్రశ్నార్థకమవుతుందన్నారు. క్రిమినల్ అడ్వకేట్ లంకాల హరీశ్ మాట్లాడుతూ కొత్త చట్టాల్లో చాలా లోపాలు ఉన్నాయని చెప్పారు.

ప్రజాబాహుళ్యంలో చర్చపెట్టకుండా కొత్త చట్టాలను ఆమోదించుకునేందుకు మోడీ సర్కారు కుట్ర చేస్తున్నదన్నారు. ఆయా నేరాలు, శిక్షలను సంపూర్ణంగా వివరించకుండా ఆమోదిస్తే అనేక సమస్యలు వస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు రాష్ట్ర ప్రధానకార్యదర్శి కె.పార్థసారధి, ఆఫీసు బేరర్లు రామచంద్రారెడ్డి, న్యాయవాదులు డి ప్రవీణ్, వెంకటేశ్, శైలజ, సందీప్, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ కులగణనకు మద్దతు ఇవ్వడం వల్లే...

- తిరిగి కాంగ్రెస్‌లో చేరాను :

దాక్టర్ వినయ్ కుమార్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీసీ కులగణనకు పార్టీ మద్దతు ఇవ్వడంతో తాను తిరిగి కాంగ్రెస్‌లోకి వచ్చినట్టు కేంద్ర మాజీ మంత్రి పి శివశంకర్ కుమారుడు డాక్టర్ పి వినయ్‌కుమార్ చెప్పారు. 2021 వరకు కాంగ్రెస్‌లోనే ఉన్నా... 2021లో తెలంగాణ సామాజిక కాంగ్రెస్‌ని స్థాపించానన్నారు. బలహీన వర్గాల జీవితాల్లో మార్పులు చేయాలని పార్టీ స్థాపించానన్నారు. రాష్ట్రం వచ్చిన తర్వాత మార్పులు జరగలేదన్నారు. ఇప్పటికే బీహార్‌లో కుల గణన చేశారనీ, దాని ఆధారంగానే వారికి సీట్లు ఇవ్వనున్నారని తెలిపారు. బీసీల అభ్యున్నతిపై రాహుల్ గాంధీ మాట్లాడడంతో తెలంగాణ సామాజిక కాంగ్రెస్ పార్టీ అవసరం లేదని భావించినట్టు తెలిపారు.

కొత్త రేషన్‌కార్డు ఇవ్వకుండా బంధులు ఎలా ఇస్తారు?: ప్రీతమ్

గత పదేండ్లుగా బీఆర్ఎస్ ప్రభుత్వం కొత్త రేషన్‌కార్డులు ఇవ్వలేదని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర చైర్మెన్ ప్రీతమ్ విమర్శించారు. రేషన్‌కార్డులు లేకుండా దళిత, బీసీ, మైనార్టీ బంధులు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ రేషన్‌కార్డుతోపాటు 14 రకాల సరుకులు ఇచ్చిందన్నారు. 2014 నుంచి కేవలం బియ్యం ఇస్తూ బిచ్చగాళ్ళని చూసినట్టు చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు దరఖాస్తులు చేసినా రేషన్‌కార్డులు రాలేదన్నారు. కాంగ్రెస్ 70-75 సీట్లతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలిపారు. కొత్త రేషన్ కార్డులు ఇచ్చి అన్ని పథకాలకు అర్హులను చేస్తామన్నారు.

కాంగ్రెస్‌పై దూషణాలా?

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తాం : నిరంజన్

బీఆర్ఎస్ బహిరంగ సభల్లో సీఎం కేసీఆర్, మంత్రి తన్నీరు హరీశ్‌రావు కాంగ్రెస్ పార్టీపై దూషణలకు పాల్పడుతున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దూషణలపై ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. పరకాలలో కాంగ్రెస్‌నుద్దేశించి సీఎం దొకేబాజి పార్టీ అనీ, కాంగ్రెస్ మ్యానిఫెస్టోను 420 అంటూ అడ్డగోలుగా హరీశ్‌రావు మాట్లాడటం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు.

'విజయ సంకల్ప యాత్ర'

వాహనాన్ని ప్రారంభించిన ఉత్తమ్, విజయశాంతి

కాంగ్రెస్ వికలాంగుల చైర్మెన్ ముత్తినేని వీరయ్య చేపట్టబోయే విజయ సంకల్ప యాత్ర వాహనాన్ని ఎంపీ ఎన్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, విజయశాంతి గాంధీభవన్‌లో శనివారం ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు రూ 6వేలు పెన్షన్‌తోపాటు మరికొన్ని సంక్షేమ హామీలను మ్యానిఫెస్టోలో పొందుపరిచిందని చెప్పారు. ఆ విషయాలను ప్రచారం చేసేందుకు ఈ యాత్ర కొనసాగుతున్నదన్నారు. ఈ సందర్భంగా ఖర్గే, రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి, ఉత్తమ్, శ్రీధర్‌బాబు ఫోటోలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సతీష్‌గౌడ్, అవుల వెంకటేష్, అర్జున్, హేమలత, పెరిక కుల కార్పొరేషన్ సాధన సమితి అధ్యక్షులు కోట మల్లిఖార్జునరావు తదితరులు పాల్గొన్నారు.

భారీగా పెరగనున్న విద్యుత్ డిమాండ్

దేశ వ్యాప్తంగా 250 గిగావాట్లకు చేరొచ్చని అంచనా

- బొగ్గు నిల్వలు పెంచుకోవాలని కేంద్రం ఆదేశం

న్యూఢిల్లీ : రానున్న వేసవిలో దేశవ్యాప్తంగా విద్యుత్ డిమాండ్ భారీగా పెరగనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుండే సిద్ధం కావాలని అన్ని రాష్ట్రాలను కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. దేశ వ్యాప్తంగా 250 గిగావాట్ల గ్రిడ్ డిమాండ్ ఉంటుందని కేంద్రం అంచనా వేసింది. గత ఏడాది వేసవిలో జరిగిన వినియోగానికి సమానంగా ఈ ఏడాది సెప్టెంబర్ నెలలోనే దేశ వ్యాప్తంగా వినియోగించారు. చలి కాలం కావడంతో ఆ తరువాత వినియోగం కొంత తగ్గినా, ఫిబ్రవరి నెలాఖరు నుండి పెరిగి వేసవిలో పతాక స్థాయికి చేరుకుంటుందని భావిస్తున్నారు. ప్రస్తుతం గ్రిడ్ డిమాండ్ 220 గిగావాట్ల వరకు ఉంది. ప్రతి ఏటా విద్యుత్ డిమాండ్ మూడుశాతం నుండి ఐదుశాతం వరకూ పెరుగుతోంది. అయితే ఈ సారి వర్షాభావం వల్ల డిమాండ్ భారీగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

జల విద్యుత్ ఉత్పత్తి ఈ ఏడాది గణనీయంగా తగ్గింది. ఇప్పటి వరకూ ఒక మిలియన్ యూనిట్ల విద్యుత్ కూడా ఉత్పత్తి చేయలేని పరిస్థితి ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టుల ద్వారా గతేడాది సరిపోయినంత రెండువేల మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరిగింది. ప్రస్తుతం పవన, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కూడా అనుకున్నంత స్థాయిలో జరగడం లేదు. వర్షాలు లేక రిజర్వాయర్లలో నీరు లేక పోవడంతో ఖరీఫ్‌లో బోర్ల మీదే వ్యవసాయం చేయాల్సిన పరిస్థితి చాలా ప్రాంతాల్లో ఏర్పడింది. రబీ సాగు కూడా బోర్లపైనే ఆధారపడి జరగాల్సి ఉంటుందని అంచనా వేస్తున్నారు. దీంతో ఈసారి డిమాండ్ తారాస్థాయికి చేరుతుందని నిపుణులు భావిస్తున్నారు. దీనిలో భాగంగానే బొగ్గు నిల్వలు పెంచుకునేందుకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని కేంద్రం రాష్ట్రాలకు సూచించింది.

ధాన్యపు రాశుల తెలంగాణ

- ఎక్స్‌లో వీడియో పోస్ట్ చేసిన కవిత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎక్స్ లో ఆసక్తికర వీడియోను ఎంఎల్‌సీ కల్వకుంట్ల కవిత శనివారం పోస్ట్ చేశారు. ధాన్యపు రాశుల తెలంగాణను ప్రతిబింబించేలా స్వయంగా వీడియోను చిత్రీకరించారు. ఎన్నికల ప్రచారానికి గాను నిజామాబాద్ నుంచి జగిత్యాలకు వెళ్తున్న క్రమంలో ఆర్మూర్ లోని సిద్దులగుట్ట వద్ద రోడ్డుకు ఇరువైపులా రైతులు వడ్లను ఆరబెట్టిన సన్నివేశాలను వీడియోలో చిత్రీకరించారు."ధాన్యపు రాశుల తెలంగాణ... అప్పుడు ఎట్లుంది తెలంగాణ..!! ఇప్పుడు ఎట్లైంది తెలంగాణ !!" అని ట్యాగ్ లైన్ పెట్టి పోస్ట్ చేశారు. నెట్టింట్లో ఈ పోస్ట్ తెగ వైరల్ అవుతోంది.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
ఆదివారం 19-11-2023
సంపుటి : 9 సంచిక : 318
సమగ్ర తెలుగు దినపత్రిక
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు + సోపతి (వెబ్‌లో) వెల : 8.00



వదలొద్దు ఈ కప్పు

వివరాలు ఆటలులో..

- ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్ నేడు
- మూడో టైటిల్‌పై ఆతిథ్య భారత్ గురి
- ఆరో ట్రోఫీ రేసులో ఆస్ట్రేలియా

మధ్యాహ్నం 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



బీజేపీయేతర రాష్ట్రాల్లో గవర్నర్లతో కక్ష సాధింపు

కేంద్రంపై తమిళనాడు సీఎం స్టాలిన్ విమర్శలు

- గవర్నర్ వెనక్కి పంపిన పది బిల్లులను మళ్లీ ఆమోదించిన అసెంబ్లీ

న్యూఢిల్లీ : బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను అడ్డంపెట్టుకొని కేంద్ర ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నదని తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ విమర్శించారు. తమిళనాడు ప్రభుత్వం అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశ పరిచి గతంలో తీర్మానించిన 10 బిల్లులను ఏకగ్రీవంగా మరోసారి శనివారం ఆమోదించింది. ఎలాంటి కారణాలు చెప్పకుండా గవర్నర్ ఆర్ఎన్ రవి వెనక్కి పంపిన బిల్లులను ఆమోదించి గవర్నర్‌కు తిరిగి పంపాలని ముఖ్యమంత్రి స్టాలిన్ నిర్ణయించడంతో అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచారు. తాజాగా ఆమోదం పొందిన బిల్లుల్లో 2020, 2023లో అసెంబ్లీ తీర్మానించిన రెండేసి బిల్లులు ఉండగా.. మరో ఆరు బిల్లులు 2022లోనే ఆమోదించినవి ఉన్నాయి. ఇందులో వైస్ ఛాన్సెలర్ల నియామకంలో గవర్నర్ అధికారాలను తొలగించేలా తీసుకొచ్చిన తీర్మానం కూడా ఉంది. వర్సిటీల వీసీలను రాష్ట్ర ప్రభుత్వమే నియమించేలా తమిళనాడు విశ్వవిద్యాలయాల చట్టంలో సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లు ...9లో

దేశానికి బీజేపీ ప్రమాదకరం

CPIM

డబ్బులతో వచ్చే పార్టీలను ఓడించాలి

- ప్రజా చైతన్యంతోనే అది సాధ్యం
- సెక్యులరిజం కాపాడటమే సీపీఐ(ఎం) లక్ష్యం



- మిర్యాలగూడ సీపీఐ(ఎం) అభ్యర్థి జూలకంటి ప్రచార సభలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు విజయ రాఘవన్

నవతెలంగాణ-మిర్యాలగూడ

బీజేపీ దేశానికి ప్రమాదకరంగా మారిందని, ఈ ప్రమాదాన్ని నివారించాలంటే కమ్యూనిస్టులను గెలిపించాలని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు, మాజీ ఎంపీ విజయ రాఘవన్ పిలుపునిచ్చారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో సీపీఐ(ఎం) అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి గెలుపును కోరుతూ శనివారం పట్టణంలోని హౌసింగ్ బోర్డు, మండలంలోని గూడూరు, లక్ష్మీపురం గ్రామాల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. మతోన్మాద బీజేపీ దేశంలో ప్రజల మధ్య విద్వేషాలు సృష్టించి రాజకీయంగా లబ్దిపొందాలని చూస్తోందని విమర్శించారు. మోడీ అధికారంలోకి వచ్చాకే నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయని, పేదల కొనుగోలు శక్తి తగ్గిపోయిందన్నారు. రాజ్యాంగాన్ని మారుస్తూ ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేసేందుకు కుట్రలు పన్నారని విమర్శించారు. ఇప్పటికైనా ప్రజలు మేలుకోకపోతే దేశానికి ప్రమాదం ఏర్పడుతుందని చెప్పారు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల పట్ల ప్రజలు చైతన్యవంతులు కావాలని, జూలకంటి రంగారెడ్డిని గెలిపించి అసెంబ్లీకి పంపించినట్టయితే అన్ని వర్గాల ప్రజల సమస్యలపై చట్టసభలో ప్రస్తావించి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారని చెప్పారు. డబ్బు బలంతో వచ్చే బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించి బుద్ధి చెప్పాలన్నారు. సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులు డబ్బుందన్న అహంకారంతో వాటిని పంచి గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగర్, తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీ రామ్‌నాయక్, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు నారి ఐలయ్య, రమ, ఎంపీ రమణ, డబ్బికార్ మల్లేష్, ఐద్వా జిల్లా అధ్యక్షులు వరలక్ష్మి, జిల్లా నాయకులు రవినాయక్, డా.మల్లు గౌతమ్‌రెడ్డి, రాగిరెడ్డి మంగారెడ్డి, పరుశరాములు, భావండ్ల పాండు, తిరుపతి రామ్మూర్తి, ఎండి అంజాద్, వదూద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటే వజ్రాయుధం...

చరిత్ర చూసి ఓటేయండి



- బీజేపీ, కాంగ్రెస్ పద్ధతి లేని పార్టీలు..
- 24 గంటల ఉచిత విద్యుత్ వద్దంటున్నారు
- బీఆర్ఎస్ పుట్టిందే తెలంగాణ కోసం
- సంక్షేమ పథకాల అమలులో మనమే టాప్
- మరో పదేండ్లలో రైతే రాజు అవుతాడు
- చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తా : సీఎం కేసీఆర్

వివరాలు 9లో



గజ్వేల్‌లో ఓటమి భయంతోనే..

కామారెడ్డిలో కేసీఆర్ పోటీ

ఎన్నికల ప్రచారంలో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

నవతెలంగాణ-భిక్కనూర్, రాజంపేట

రాష్ట్రంలో మార్పు రావాలంటే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని టీపీసీసీ రాష్ట్ర అధ్యక్షులు రేవంత్ రెడ్డి అన్నారు. నియంత, అవినీతి, కుటుంబ పాలనను బొంద పెడితేనే రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉంటారని అన్నారు. శనివారం కామారెడ్డి జిల్లాలోని రాజంపేట్, భిక్కనూర్ మండల కేంద్రాల్లో రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను తాగుబోతుల రాష్ట్రంగా మార్చిందని, గ్రామగ్రామాల్లో బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి ప్రభుత్వం అందజేస్తున్న పింఛన్ రూ.2016ను మద్యం దుకాణాల ద్వారా తీసుకుంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రైతు భరోసా పథకం ద్వారా ప్రతి రైతుకు, కౌలు రైతుకు ఎకరానికి రూ.15000 అందజేస్తుందని, భూమిలేని రైతులకు, ఉపాధి ...9లో

బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటే

కేసీఆర్ అవినీతికి కేంద్రం వత్తాసు

- అందుకే కమలానికి గుడ్‌బై
- టీపీసీసీ ప్రచార, ప్లానింగ్ కమిటీ కో ఆర్డినేటర్ విజయశాంతి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సీఎం కేసీఆర్ అవినీతిపరుడు ఆయనపై చర్యలు తీసుకుంటామని చెప్పిన బీజేపీ...ఆ తర్వాత పట్టించుకోలేదని టీపీసీసీ ప్రచార ప్లానింగ్ కమిటీ కో ఆర్డినేటర్ విజయశాంతి విమర్శించారు. ఇప్పుడేమో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటై పోయాయని ఎద్దేవా చేశారు. కేసీఆర్ అవినీతి కేంద్ర ప్రభుత్వం వత్తాసు పలుకుతున్నదని ఆరోపించారు. కేసీఆర్‌ను గద్దెదించాలనే నా లక్ష్యం నెరవేరకపోవడంతో నేను కమలానికి గుడ్ బై చెప్పినట్టు వివరించారు. శుక్రవారం కాంగ్రెస్‌లోని ...9లో

క్వింటా వరికి రూ.3,100 ఇస్తాం

పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ తగ్గిస్తాం

- మతపర రిజర్వేషన్లు ఎత్తేస్తాం...ఎస్సీ,ఎస్టీ, బీసీలకు పంచుతాం
- ఉజ్వల పథకం కింద ఏటా నాలుగు ఉచిత సిలిండర్లు
- కేసీఆర్ అవినీతిపై సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ
- ఆగస్టు 27న రజాకార్ల దురృత్యాల సంస్మరణ దినంగా పాటిస్తాం
- కేసీఆర్ లోక్‌తంత్రను వదిలి లూటీతంత్రంలో పడ్డాడు
- ఓడియేపోయేవాళ్లు ఒప్పుకోరు..గెలుస్తామనే చెబుతారు
- బీజేపీ మ్యానిఫెస్టో ఆవిష్కరణలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో తాము అధికారంలోకి వస్తే వరి ధాన్యం క్వింటాకు రూ.3,100 మద్దతు ధర ఇస్తామనీ, రైతులకు విత్తనాలు కొనుగోలు చేసేందుకు రూ.2500 ఇన్‌పుట్ అసిస్టెన్స్ అందజేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో మాదిరిగానే పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్‌ను ఎత్తేస్తామని చెప్పారు. శనివారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో బీజేపీ ...9లో

గాజాలో పొంచివున్న ఆకలిచావులు !



హెచ్చరించిన ఐక్యరాజ్య సమితి

స్కూలుపై దాడి : 50మంది మృతి

- సురక్షిత ప్రాంతమంటూ లేకుండాపోయింది : ఐరాస కమిషనర్
- ఆల్‌షిఫా ఆస్పత్రి నుంచి వెళ్లేవారిపై అమానుష సోదాలు
- కాల్పుల విరమణ జరిగితే గాజాను పునర్ నిర్మిస్తాం : టర్కీ

గాజా : ఇంధన కొరత కారణంగా ఏర్పడిన దయనీయమైన, నిస్సహాయ పరిస్థితులతో ఇప్పటికే ఇబ్బందుల పాలవుతున్న గాజా ప్రజలు ఆకలిచావులను ఎదుర్కొనే అవకాశాలు కూడా పొంచి వున్నాయని ఐక్యరాజ్య సమితి హెచ్చరించింది. శీతాకాలం సమీపిస్తున్నందున పరిస్థితులు మరింత అధ్వాన్నంగా మారతాయని పేర్కొంది. గత ఐదు వారాల కాలంలో గాజాకు కేవలం 10శాతం ఆహారం మాత్రమే వచ్చిందని ఐక్యరాజ్య సమితి ఆహార కార్యక్రమం (డబ్ల్యుఎఫ్‌పి) మధ్య ప్రాచ్య ప్రాంతీయ ప్రతినిధి అబీర్ ఇటెఫా చెప్పారు. దీంతో ప్రజల్లో డీ హైడ్రేషన్, పోషకాహార లోపం బాగా పెరుగుతోందన్నారు. దాదాపు గాజాలో వున్న ప్రతి వ్యక్తీ ఆహార అవసరాన్ని తీవ్రంగా ఎదుర్కొంటున్నాడని తెలిపారు. ఆహార ఉత్పత్తి దాదాపు నిలిచిపోయింది. మార్కెట్లు కుప్పకూలాయి. జాలర్లు సముద్రంలోకి వెళ్లలేకపోతున్నారు, రైతులు తమ పొలాలవద్దకు వెళ్లలేకపోతున్నారు. దీనికి తోడు శీతాకాలం కూడా సమీపిస్తోంది. ఇప్పుడున్న షెల్టర్లు ఏవీ సురక్షితంగా లేవు, కిక్కిరిసిపోయి వున్నాయి. శుభ్రమైన నీరు లేదు, ఇటువంటి పరిస్థితుల్లో ఆకలి చావులు అనివార్యంగా కనిపిస్తున్నాయని హెచ్చరించారు.

స్కూలుపై దాడిలో 50మంది మృతి

గతకొద్ది రోజులుగా అల్‌షిఫా ఆస్పత్రిని లక్ష్యంగా చేసుకుంటూ దాడులు జరిపిన ఇజ్రాయిల్ బలగాలు ...9లో

మానవతా దృక్పథం లేని మేధావి, మూర్ఖుని కంటే అధముడు
- రస్సెల్



సంపాదకీయం

అరుణమయ చరిత అమరం

తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏర్పాటు చేసిన 'తగైసాల్ తమిజార్' అవార్డును మొదట కా. శంకరయ్యకు అందించారు. అవార్డు స్వీకరించినా, దానితో పాటు ఇచ్చే పది లక్షల రూపాయలను కోవిడ్ బాధితుల కోసం సి.ఎం. సహాయ నిధికి అందించిన సహృదయుడు ఆయన. అంతేకాదు, 1972లో స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్ తీసుకోవటానికి కూడా ఆయన నిరాకరించారు. 'మేము స్వాతంత్ర్యం కోసం పోరాడాము. పెన్షన్ కోసం కాదు' అని ప్రకటించారు. అందుకనే ఆయనను, పార్టీలకతీతంగా గౌరవిస్తారు. ప్రజలందరూ ప్రేమిస్తారు.

'లేదు... నీ ప్రాభవం మమ్మల్ని వదలలేదు! నిరుత్సాహాన్ని జయించడం నీ వల్లనే నేర్చుకుంటున్నాము! ప్రతికూల శక్తుల బలం మాకు తెలుసు! భయం లేదులే అయినప్పటికీ! నీ సాహసం ఒక ఉదాహరణ! నీ జీవితమే ఒరవడి' కమ్యూనిస్టు యోధుడు శంకరయ్య గారి నిష్క్రమణం తర్వాత పై శ్రీశ్రీ వాక్యాలే గుర్తుకొచ్చాయి.నిజంగా ఎంత ప్రేరణాత్మక చైతన్యపూరిత జీవితం ఆయనది. పరిపూర్ణ జీవిత సాఫల్యతకు నిలువెత్తు ఉదాహరణ కామ్రేడ్ ఎస్.శంకరయ్య. స్వాతంత్ర్య సమరయోధునిగా, కమ్యూనిస్టు నాయకునిగా, మార్క్సిస్టు పార్టీ వ్యవస్థాపక నాయకులలో ఒకనిగా, ప్రజా నాయకునిగా ఎనిమిది దశాబ్దాలు కృషి చేయటం సామాన్యమైన విషయం కాదు. చరిత్రకు ఘనమైన జీవితాన్ని అందించిన అమరుడు ఆయన. ఉత్తమమైన, ఉన్నతమైన మానవ జీవితాన్ని ఎలా జీవించాలో ఆ కామ్రేడ్ చరిత్రను చూసి తెలుసుకోవచ్చు. సీటు కోసమో, ఓటు కోసమో, పదవి కోసమో, పైస కోసమో మాటను, బాటనూ మార్చుకునే నేటి రాజకీయ విన్యాసాల వేళలో అంకిత భావం, నిబద్ధమైన ఆశయ ప్రస్థానంగల ఎస్.శంకరయ్య గారి స్మరణ కారు చీకట్లో కాంతి రేఖలా కనపడుతుంది. ఎందుకంటే, అతడనేక ప్రజా పోరాటాల స్ఫూర్తి రూపం. శతాధిక జీవితాన్ని ఆశయ సిద్ధికోసం వెచ్చించిన చరితం కనుక.

ఎవరికి సాధ్యమవుతుంది! జీవితాన్ని తన కోసం, తన కుటుంబంకోసం కాక, సమాజం కోసం, అణగారిన ప్రజల కోసం, ఎన్ని ఇక్కట్లు, నిర్బంధాలు, సవాళ్లు ఎదురైనా నిబద్ధంగా నిలబడటం! అది కమ్యూనిస్టు ఆశయ పథగామికి మాత్రమే సాధ్యమయ్యే ఆచరణ. చరిత్రను ఒకసారి తిరగేయండి. పరుల కోసం, ప్రజల కోసం, వారి హక్కుల కోసం, సౌఖ్యం కోసం నిస్వార్థంగా జీవితాలను త్యాగం చేసిన వారిని కమ్యూనిస్టు ఉద్యమంలో ఎంతో మందిని మనం చూడగలుగుతాము. కేవలం చరిత్రలోనే కాదు, నేటి వర్తమానంలో కూడా, ప్రపంచీకరణ, వస్తువ్యామోహ, వినియోగ దారీ ద్రవ్య భ్రమల ప్రపంచంలోనూ కమ్యూనిస్టుగా నిలబడటం మరింత కష్టమైన సమయంలోనూ నిబద్ధంగా త్యాగాలతో పని చేస్తున్న కార్యకర్తలు, నాయకులు ఆదర్శనీయంగా వున్నారు. కమ్యూనిస్టు ఉద్యమ ఒరవడి అలాంటిది. అలాంటి వారందరికీ శంకరయ్య జీవితం మహోన్నత ప్రేరణ.

భగత్సింగు ప్రాణత్యాగం కామ్రేడ్ శంకరయ్యలో స్వాతంత్ర్య కాంక్షను పురికొల్పింది. తొమ్మిదేండ్ల వయసు నాటి ఆ ప్రేరణ చివరికంటా అంతే ఉత్తేజంతో ఆయనలో కొనసాగటం అబ్బురపరుస్తుంది. 1937తో మధురైలోని అమెరికన్ కాలేజీలో చరిత్రను అభ్యసిస్తున్న కాలంలోనే మద్రాసు స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ ఏర్పాటులో పాల్గొన్నారు. కళాశాల విద్యార్థి నాయకుడుగా ఎదిగారు. కళాశాలలో వామపక్ష భావాలు గల స్నేహితుల ప్రభావంతో 17 ఏండ్ల వయసులోనే కమ్యూనిస్టు పార్టీ సభ్యుడిగా చేరారు. ఆ సమయంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉంది. డిగ్రీ పరీక్షలకు కొన్ని రోజుల ముందు 1941లో బ్రిటీష్ ప్రభుత్వం అరెస్టు చేసింది. ఇక అప్పటి నుండి జైళ్ల పర్యటనలు కొనసాగాయి. మధురై కుట్ర కేసులో అరెస్టు అయ్యారు. మళ్లీ స్వాతంత్ర్య దినోత్సవానికి ముందు రోజు జైలు నుండి విడుదల య్యారు. కమ్యూనిస్టు నాయకునిగా ప్రజాదరణ పొందిన వారు తమిళనాడులో కార్మిక కర్షక ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. కమ్యూనిస్టు పార్టీ చీలిక సందర్భంలో సీపీఐ(ఎం) వైపు నిలబడి చివరి వరకూ ఉన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడిగా, తమిళనాడు రాష్ట్ర కార్యదర్శిగా పని చేశారు. కిసాన్ సభ నాయకుడిగానూ పని చేశారు. శాసన సభ సభ్యునిగా కూడా ఎన్నికయ్యారు. గొప్ప వాగ్ధాటి గల వక్తగా, సాహిత్య కళారంగాల పట్ల లోతైన అవగాహన కలిగిన శంకరయ్య గారు తమిళనాడులో సామాజిక సమస్యలపై, వివక్షతలపై పోరాడిన వ్యక్తి. నిబద్ధతతో పాటు నిరాడంబర జీవితాన్ని గడిపిన ఉన్నత విలువలు గల కమ్యూనిస్టు ఆయన. అందుకనే కమ్యూనిస్టు ఉద్యమం ఘనమైన చరిత్ర కలిగిన నేతను కోల్పోయిందని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో నివాళులర్పించింది.

తమిళనాడులో స్టాలిన్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే ఏర్పాటు చేసిన 'తగైసాల్ తమిజార్' అవార్డును మొదట కా. శంకరయ్యకు అందించారు. అవార్డు స్వీకరించినా, దానితో పాటు ఇచ్చే పది లక్షల రూపాయలను కోవిడ్ బాధితుల కోసం సి.ఎం. సహాయ నిధికి అందించిన సహృదయుడు ఆయన. అంతేకాదు, 1972లో స్వాతంత్ర్య సమర యోధుల పెన్షన్ తీసుకోవటానికి కూడా ఆయన నిరాకరించారు. 'మేము స్వాతంత్ర్యం కోసం పోరాడాము. పెన్షన్ కోసం కాదు' అని ప్రకటించారు. అందుకనే ఆయనను, పార్టీలకతీతంగా గౌరవిస్తారు. ప్రజలందరూ ప్రేమిస్తారు. కానీ అమెరికన్ క్రిస్టియన్ కాలేజీ వారు, పూర్వ విద్యార్థిగా ఉన్న శంకరయ్య గారికి గౌరవ డాక్టరేట్ ఇవ్వటానికి ప్రయత్నిస్తే, బీజేపీ గవర్నర్ దానిని తొక్కిపట్టారని చెబుతున్నారు. ఇది వారి అల్పత్వానికి నిదర్శనమే కాని ఆయనకున్న విలువను ఏ మాత్రమూ తగ్గించలేదు. ఏదిఏమైనా అశేష ప్రజల ఆదరాభిమానాలను పొందిన నిస్వార్థ జీవితాన్ని గడిపిన శంకరయ్య అమరుడు. కమ్యూనిస్టు ఉద్యమం తీర్చిన ఆయన జీవితం ఎందరికో ఆదర్శనీయం.

బడాపార్టీల నిధుల గుట్టు కార్పొరేట్లకెరుక!



తెలకపల్లి రవి


దేశంలో ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాలలో ఎక్కడికక్కడ సోదాలు చేస్తుంటారు. వాహనాలను నిలబెట్టి గంటల తరబడి గాలించడంతో ఆలస్యమే గాక రాకపోకలకు అంతరాయం కూడా ఏర్పడుతుంటుంది. పత్రికలు చూస్తే పట్టుబడిన లెక్కలు గొప్పగా ఇస్తుంటారు. ఇదంతా చూడ్డానికి చాలా ఆసక్తిగా వుంటుంది. పోలీసులు ఎంత శ్రద్ధగా అక్రమ నగదును పట్టుకుంటున్నారు కదా అనిపిస్తుంది. అయితే కథలో అసలు ట్విస్టు ఇక్కడే వుంటుంది. రోడ్డు మీద కొన్ని రూ.కోట్లు పట్టుకోవడానికి ఇంత హంగామా చేసే మన వ్యవస్థ రాజమార్గంలో వేల కోట్లు పాలక పార్టీలకు కట్టబెట్టే కార్పొరేట్ కుబేరులను లాబీయిస్టులను మాత్రం అసలు ముట్టుకోదు! పైగా అందుకోసం వివరాలు చెప్పనవసరం లేని ఎన్నికల బాండ్ల వ్యవస్థ (ఎలక్ట్రోరల్ బాండ్స్ సిస్టం- ఇబిఎస్) ప్రవేశపెట్టింది. దీనిపై ఇటీవల సుప్రీంకోర్టు విచారణ జరిపిన సందర్భంలో కేంద్రం అభిప్రాయం అడిగింది. ఓటర్లకు అన్ని వివరాలు తెలుసుకోవలసిన అవసరమేమీ లేదని మోడీ ప్రభుత్వం తాను దాఖలు చేసిన అఫిడవిట్‌లో సెలవిచ్చిందంటే ఆశ్చర్యం కలగొచ్చు గాని పచ్చి నిజం. ఎందుకంటే తెలుసుకుంటే తెలిసేవి ముందు తమ పార్టీ వివరాలే గనక, అంత ఆశ్చర్యపోవలసిన అవసరం వుండదు. 2018-2023 మధ్య కాలంలో దేశంలో 27దఫాలుగా రూ.13,791 కోట్ల విలువైన 24,012 ఎన్నికల బాండ్లు అమ్ముడుపోయాయి. 31 రాజకీయ పార్టీలకు మొత్తం రూ.9188 కోట్ల విరాళాలు అందాయి. ఇందులో బీజేపీ ఒక్క దానికే 5,272 కోట్ల విలువైన బాండ్లు లభించాయి. బీజేపీకి 74 శాతం వస్తే కాంగ్రెస్‌కు 11శాతం మాత్రమే దక్కాయి. తర్వాతి స్థానంలో బిజూ జనతాదళ్, వైఎస్‌ఆర్ కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ వున్నాయి. నిజానికి ఈ మాత్రం నిధులతోనే ఆ పార్టీలు ఎన్నికలు ఇతర వ్యవహారాలు నడుపుతున్నాయనుకుంటే పొరబాటే. 2019 ఎన్నికలకు దేశ వ్యాపితంగా మొత్తం రూ.55 వేల కోట్ల నుంచి 60వేల కోట్ల వరకూ ఖర్చయి వుంటుందని ప్రజాస్వామ్య సంస్కరణల వేదిక (అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఎడిఆర్)) అంచనా వేసింది. ఇందులో చాలా భాగం లెక్కకు రాని నగదులోనే జరుగుతాయి. తప్పనిసరిగా అధికారికంగా చేయాల్సిన ఖర్చులకే ఈ నిధులు ఉపయోగిస్తాయవి. అంటే మౌలిక సదుపాయాలు, ప్రచార సామగ్రి, వివిధ రకాల మీడియాలో ప్రచార ఖర్చు వంటి వాటి కోసం ఈ బాండ్ల నుంచి వచ్చే మొత్తాన్ని చూపిస్తాయి. బీజేపీ ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీని ముందుకు తెచ్చిన నాటి నుంచి ప్రచార సరళి ఎలా మారిపోయిందో వేల స్క్రీన్లు ధగధగలు ఇంటర్వ్యూలు డిజిటల్ మీడియా మాయలు ఏ స్థాయిలో జరుగుతున్నాయో చూస్తున్నాం. తెలంగాణ ఎన్నికలలో బీఆర్‌ఎస్ కూడా భారీ ఎత్తునే ప్రచారం సాగిస్తున్నది, మంత్రి కేటీఆర్ ఈ కొత్త తరహా చిట్కాలను విస్తారంగా ఉపయోగిస్తున్నారు.

ఎన్నికల బాండ్ల రహస్యం

ఎన్నికల బాండ్లలో వుండే సౌలభ్యం ఏమంటే వాటిని ఎవరు ఎవరికి ఇచ్చారో లెక్క చూపనవసరం లేదు. వివరాలు ఇవ్వక్కర్లేదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) బేరర్ బాండ్ల రూపంలో అమ్మే వాటిని ఎవరైనా కొని ఎవరికైనా ఇవ్వచ్చు. 2018 జనవరిలో ఎలక్టోరల్ బాండ్ల పద్ధతిని ప్రవేశపెట్టారు. అది కూడా రాజ్యాంగ సవరణ లేదా వివరణ లేకుండా ద్రవ్యబిల్లుగా దొడ్డిదోవలో తీసుకొచ్చారు. నిజానికి 2013లో యుపిఎ పాలన చివరి ఘట్టంలో పార్టీలకు విరాళాలిచ్చే కార్పొరేట్ కుబేరుల వివరాలు బయట పడకుండా ఏదో ఏర్పాటు తీసుకొచ్చింది. అది సరిగ్గా లేదు కనక పారదర్శకత అవసరమన్న వాదనతో మోడీ సర్కారు మొదటికే మోసం తెచ్చింది. దేశ విదేశాలకు చెందిన బడా కంపెనీలు రాజకీయ పార్టీలకు విరాళాల రూపంలో పెట్టుబడులు పెట్టి చెప్పు చేతల్లో పెట్టుకోవడానికి ద్వారాలు తీసింది. ఇందుకోసం ఫైనాన్స్ చట్టంలో విదేశీ విరాళాల క్రమబద్ధీకరణ చట్టాన్ని 2016 నుంచి వర్తించేలా సవరణ చేసింది. తద్వారా విదేశాల నుంచి నిధులు తీసుకున్నా తప్పు కిందకు రాకుండా కాపాడింది. దీని వెంటనంటి మరిన్ని సవరణలు. ప్రజాప్రాతినిధ్య చట్టం, కంపెనీల చట్టం, ఆదాయపు పన్ను చట్టం, రిజర్వు బ్యాంకు చట్టం, వీటన్నిటినీ 2017 ఫైనాన్స్ చట్ట సవరణతో మార్చి వేసింది. ఆర్‌బిఐ, ఎన్నికల సంఘం, ప్రతిపక్షాలు విమర్శకులు ఎంతగా ఆక్షేపించినా బేఖాతరు చేసి ఫైనాన్స్ బిల్లుగానే ఆమోదించేసింది. రాజ్యసభ బెడద లేకుండా చేసుకుంది. ఈ తతంగమంతా ఎంత పకడ్బందీగా జరిగిందో చూస్తే మోడీ ప్రభుత్వ ప్రచ్ఛన్న ఎజెండాల అమలు లోతుపాతులు తెలుస్తాయి. ఈ పథకం సరైంది కాదని సీపీఐ(ఎం) వంటి పార్టీలు ఆదిలోనే విమర్శించాయి. తాము కార్పొరేట్ నిధులు తీసుకోవడానికి నిరాకరించాయి కూడా.

తలకిందులు తర్కాలు

సుప్రీం కోర్టులోనూ దీనిపై ప్రజాప్రయోజన వ్యాజ్యాలు నడిచాయి. రాజ్యాంగ ధర్మాసనం విచారించింది. 2018 నుంచి నడుస్తున్నా కేంద్రం తన వైఖరి చెప్పకపోవడంతో కేసు ముందుకు నడవలేదు. సుప్రీం కోర్టు కూడా దాన్ని తేల్చకపోవడం విమర్శకు గురైంది. ఎట్టకేలకు ఈ మధ్యనే విచారణ జరిగింది. ఆ సమయంలో అఫిడవిట్ దాఖలు చేయాలని కోరితే కేంద్రం ఏకపక్షంగా సమర్థించుకుంది. పార్టీలకు ఎవరు విరాళాలు ఇచ్చారో చెబితే వారిని వేధింపులకు గురిచేసే అవకాశం వుంది గనక బయటపెట్టడం మంచిది కాదన్నట్టు వాదించింది. అసలు ఆ వివరాలు తెలుసుకోవడం సామాన్య ప్రజల ప్రాథమిక హక్కు కాదని కూడా వాదించింది. విరాళాలు ఇవ్వడంలో గోప్యత కార్పొరేట్ల హక్కు గనక దాన్ని భంగపరిస్తే వాటి ప్రాథమిక హక్కుకు హాని అని వితండవాదన చేసింది. ఇదో తలకిందులు తర్కం. ఎందుకంటే కార్పొరేట్లు ఎప్పుడూ పాలక పార్టీలకే పెట్టుబడులు పెడతాయి. అందులోనూ ఆ సమయంలో అధికారంలో వున్న పార్టీని తమ విరాళాలతో లోబర్చుకుని ప్రయోజనాలు నెరవేర్చుకుంటాయనేది అందరికీ తెలిసిన విషయమే. దాన్ని దాచి పెట్టడమంటే నిధులు ఇచ్చే వారికి ప్రత్యేకంగా లాభం చేకూర్చే నిర్ణయాలు చేశాయేమో తెలుసుకోకుండా చేయడమే జరిగేది. అంతకుముందు రోజుల్లో నగదు విరాళాల వల్ల నల్ల డబ్బు విచ్చలవిడిగా చలామణిలోకి వచ్చిందని బాండ్లు తెచ్చామన్నారు. కానీ అప్పట్లో రూ.20 వేల పైన విరాళమిస్తే దాతల పేర్లు తప్పక చెప్పాల్సి వచ్చేది. ఇదే సూట్‌కేస్ సంస్కృతి అని, దీన్ని అంతమొందిస్తామని చెప్పిన మోడీ సర్కార్ వాస్తవంగా చేసింది వేల కోట్లు గుమ్మరించిన వారిని కూడా బయటపెట్టకుండా చేయడమే. కాంగ్రెస్ హయాంలో అంబానీలు, మోడీ వచ్చాక అదానీ చక్రం తిప్పుతున్న తీరుకు మూలం ఇదే. ఎన్నికల బాండ్లు కొన్న కంపెనీల వెనక ఎవరున్నారో కూడా ఎప్పటికీ తెలియదు. పాశ్చాత్య దేశాల్లోనైతే అధ్యక్షులుగా పోటీ చేసేవారు ఇంత విరాళం సమకూర్చాలని ముందే షరతులుంటాయి. ఉదాహరణకు బుష్ హయాంలో ఇంధన కంపెనీల



కోసం ఎలా పని చేసిందీ అనేక రకాలుగా బహిర్గతమైంది. అలా బయటపడకుండానే కేంద్రం ఇప్పుడు బాహాటంగా అదానీ అక్రమాలను దాచి పెట్టడం ఆరోపణలకు గురవుతున్నది. క్విడ్‌ప్రోకో తరహాలో కార్పొరేట్లు లోపాయికారిగా నిధులు వెదజల్లి పాలకులను లోబర్చుకుని ఇష్టానుసారం ఆడిస్తూనే వుండొచ్చు. ఎన్నికల వ్యవస్థ ఖరీదైపోయిందని సన్నాయి నొక్కులు నొక్కే హైక్లాస్ మేధావులు, వ్యాఖ్యాతలు తెర వెనక కార్పొరేట్ల చెలగాటం గురించి వారితో బడా పార్టీల బ్రహ్మముడి గురించి ఎప్పుడూ చెప్పరు. ఎన్నికలను ఖరీదైన వ్యవహారంగా మార్చి సామాన్య ప్రజలకూ, శ్రమజీవుల కోసం పని చేసే కమ్యూనిస్టులు సామాజిక కార్యకర్తలకూ దూరం చేసిన పాలక వర్గాల కుట్రల గురించి చెప్పవు. ఇలాంటి నేపథ్యంలోనూ టాటాలు విరాళం పంపితే తిరస్కరించిన, కోర్టులో ఈ బాండ్లకు వ్యతిరేకంగా వాదించిన సీపీఐ(ఎం) గురించి చెప్పరు. నిన్నగాక మొన్న పుట్టిన ప్రాంతీయ పార్టీలే విచ్చలవిడిగా రూ.వందల కోట్లు కుమ్మరిస్తుంటే 35 ఏండ్లు బెంగాల్‌ను, త్రిపురనూ, మరెన్నోసార్లు కేరళను పాలించిన సీపీఐ(ఎం) ఎలాంటి విలువలు పాటించిందో ప్రస్తావించరు. ఎన్నికల పోరాటం రాజకీయ విధానాల సవాలుగా గాక కోట్ల బేరంగా మార్చిన పాలకవర్గాల కుట్రలను వదలిపెట్టి కమ్యూనిస్టులు దెబ్బతిన్నారని అపహాస్యం చేస్తుంటారు. ధనాఢ్య శక్తుల విలయవిహారం మధ్యలోనూ విలువల గురించి విధానాల గురించి పోరాడుతూ సమాంతర వాణిని వినిపిస్తున్నది ప్రజల ఎజెండాను బతికిస్తున్నది వారేనన్న వాస్తవాన్ని మరుగుపరుస్తుంటారు. అలాటి నిబద్ధ రాజకీయాలను ప్రజాస్వామిక వాదులు, జనసామాన్యం ఆదరిస్తున్నారు గనకే కమ్యూనిస్టులు సమరశీల సైద్ధాంతిక పథంలో కొనసాగగలుగుతున్నారు. తెలుగు రాష్ట్రాలలో విలక్షణ విధానంతో సీపీఐ(ఎం) ముందుకు సాగుతున్న తీరును గతవారం ఈ శీర్షికలో చెప్పుకున్నాం. అననుకూలతల మధ్య కూడా పోరాటం సాగుతూ వుండాల్సిందే.

నిన్నగాక మొన్న పుట్టిన ప్రాంతీయ పార్టీలే విచ్చలవిడిగా రూ.వందలకోట్లు కుమ్మరిస్తుంటే 35 ఏండ్లు బెంగాల్‌ను, త్రిపురనూ, మరెన్నోసార్లు కేరళను పాలించిన సీపీఐ(ఎం) ఎలాంటి విలువలు పాటించిందో ప్రస్తావించరు. ఎన్నికల పోరాటం రాజకీయ విధానాల సవాలుగా గాక కోట్ల బేరంగా మార్చిన పాలకవర్గాల కుట్రలను వదలిపెట్టి కమ్యూనిస్టులు దెబ్బతిన్నారని అపహాస్యం చేస్తుంటారు. ధనాఢ్యశక్తుల విలయ విహారం మధ్యలోనూ విలువల గురించి విధానాల గురించి పోరాడుతూ సమాంతర వాణిని వినిపిస్తున్నది ప్రజల ఎజెండాను బతికిస్తున్నది వారేనన్న వాస్తవాన్ని మరుగుపరుస్తుంటారు. అలాటి నిబద్ధ రాజకీయాలను ప్రజాస్వామిక వాదులు, జనసామాన్యం ఆదరిస్తు న్నారు గనకే కమ్యూనిస్టులు సమరశీల సైద్ధాంతిక పథంలో కొనసాగగలుగుతున్నారు.

తీర్పు ఎలా వున్నా...

డబ్బు సంచుల గుమ్మరింపుతో రాజకీయ సమానతను దెబ్బతీయడమే ఈ వ్యవస్థ సారాంశం. రాజ్యాంగంలో సోషలిజం అనే పదం ఇంకా కొనసా గుతేనే వుండగా రాజకీయ సమానత్వానికి కూడా ఎసరు పెట్టే పరిస్థితి ఇదని కాళేశ్వరం రాజ్ అనే ప్రముఖ న్యాయవాది ఇటీవలే రాశారు. మోడీ రాజ్యాంగం నాల్గవ భాగంలోని ఆదేశికసూత్రాలు, మూడవ భాగంలోని సమానతా సూత్రాలు కూడా అధికారికంగా దెబ్బతీసే పరిస్థితి. ఎన్నికలలో కుబేర వర్గాలు రాజకీయ సమానతకు తెచ్చే ప్రమాదం గురించి అంబేద్కర్ ఆనాడే హెచ్చరించారు. రాత్రికి రాత్రి ప్రభుత్వాలు కూలిపోవడానికి ఎవరికి ఎక్కువ సీట్లు వచ్చినా మేమే ప్రభుత్వం ఏర్పాటు చేస్తామని బిజెపి నేతలు ప్రకటించడానికి వెనకవున్న ధీమా ఇదే. సుప్రీంకోర్టులో ఎన్నికల బాండ్లకేసు ఆరేళ్లుగా ఎడతెగని నిరీక్షణలో వుండగా ఒకసారి లోక్‌సభ ఎన్నికలు, 30 సార్లు శాసనసభల ఎన్నికలు జరిగిపోయాయి. చట్టం వ్యవస్థపై ఆధారపడి వుంది గాని వ్యవస్థ చట్టంపై ఆధారపడి వుండదు. కనక వచ్చే తీర్పుతోనే మొత్తం మారిపోతుందని ఆశించడానికి కూడా లేదు. ఆ తీర్పులో చేసిన విమర్శలను సాంకేతికంగా దాటవేస్తూ మరో చట్టం చేయొచ్చు.. ఓటర్లను, పార్టీలనూ, మీడియాను కూడా కొనుగోలు చేయగల కార్పొరేట్ శక్తులే రాజ్యలీలకు ఎన్నికలు మొదటి మెట్టవుతాయి. పాక్షిక దామాషా పద్ధతి ఓటింగు, ఎన్నికల ఖర్చును పరిమితం చేసి అది కూడా వస్తురూపంలో ప్రభుత్వమే భరించడం జరిగితే కొంతవరకైనా నిజమైన సమాన పోటీ సాధ్యమవు తుంది. మన ప్రజాస్వామ్యం పటిష్టం కావాలంటే ముందు ఎన్నికల సంస్కరణలు మొదటి అడుగు. లోక్‌సభ ఎన్నికలలోగా వాటిమీద మరోసారి సమగ్ర మైన చర్చ జరపాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్‌పై వుంది. అయితే కేంద్రం ఒత్తిడి మధ్య అదెంతవరకు సాధ్యమో సందేహమే. ఈలోగా సుప్రీంకోర్టు తీర్పు ఏం చెబుతుందో చూద్దాం. ■

'హెచ్‌సీయూ' ఎన్నికల్లో మతోన్మాదులపై ఎస్ఎఫ్ఐ కూటమి విజయం



టి.నాగరాజు
9490098292

దేశంలోని ప్రతిష్ఠాత్మక హైదరాబాద్ సెంట్రల్ యూనివర్శిటీ (హెచ్‌సీయూ) 2023-2024కు జరిగిన గుర్తింపు విద్యార్థి సంఘం ఎన్నికల్లో వామపక్ష, సామాజిక శక్తులు విజయ దుందుభి మోగించింది. ఈ ఎన్నికలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో వామపక్ష, సామాజిక శక్తుల కూటమి ప్రధాన ఆఫీస్ బేరర్స్ పోస్టులను భారీ మెజారిటీతో కైవసం చేసుకొని ఘన విజయం సాధించింది. ప్రస్తుతం దేశంలో నయా ఉదారవాద, ఫాసిస్టు పాలనలో ప్రజాస్వామ్య వ్యవస్థను బీజేపీ కూల్చుతున్న సమయంలో హెచ్‌సీయూలో ఎస్ఎఫ్ఐ నేతృత్వంలోని కూటమి విజయం సమాజంలో ప్రగతిశీల శక్తులకు ఆశాజ్యోతిని అందించింది. ఈ కూటమికి హెచ్‌సీయూలో అన్ని వర్గాల విద్యార్థులు మనస్ఫూర్తిగా మద్దతునిచ్చారు. ఈ ఎన్నికల్లో అంబేద్కర్ స్టూ డెంట్స్ అసోసియేషన్(ఎఎస్ఎ), ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్)తో కలిపి ఎస్ఎఫ్ఐ క్యాంపస్ ప్రజాస్వామ్యం కాపాడడానికి, ఫాసిస్టు ఆర్ఎస్ఎస్ విద్యార్థి విభాగం ఏబీవీపీని ఓడించాలని నిర్ణయించింది. ఈ మేరకు కూటమిలో అత్యంత ప్రగతిశీలంగా అభ్యర్థులు సామాజికంగా అట్టడుగున ఉన్న ఓబిసి, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నుంచి ప్రాతినిధ్యం లభించింది. ఈ ఎన్నికల్లో మొత్తం నాలుగు ప్యానెల్స్ పోటీలో ఉన్నా ప్రధాన పోటీ ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ కూటమిల మధ్యనే జరిగింది. ప్రధానంగా ఎన్నికల బరిలో ఎస్ఎఫ్ఐ- ఎఎస్ఎ, టిఎస్ఎఫ్ ఒక కూటమిగా, ఏబీవీపీ-సేవాలాల్ విద్యార్థిదళ్ (ఎస్ఎల్‌విడి) ఒక కూటమిగా, బిఎస్ఎఫ్, డీఎస్‌యూ, ఫెటర్నిటీ, ఎఐఎస్ఎ కలిపి అలయెన్స్ ఫర్ సోషల్ డెమోక్రటిక్ (ఎఎస్డీ) ఒక కూటమిగా, ఎన్ఎస్‌యుఐ మరో కూటమిగా పోటీలో నిలిచాయి. యూనివర్శిటీలో మొత్తం 5,300 ఓట్లకు గాను 4,140 ఓట్లు పోలయ్యాయి. 80 శాతం ఓటింగ్ జరిగింది. ఎస్ఎఫ్ఐ కూటమి అధ్యక్షుడిగా పోటీలో ఉన్న ఎం.డి.అతిక్ అహ్మద్‌కు(1880), ఏబీవీపీ అభ్యర్థి షేక్ ఆయేషాకు (1409) ఎఎస్‌డి అభ్యర్థి ఉమేష్ అంబేద్కర్‌కు (424), ఎన్ఎస్‌యుఐ అభ్యర్థి అరుల్ జోష్‌కు(345) ఓట్లు రాగా 471 ఓట్ల మెజారిటీతో ఎస్ఎఫ్ఐ కూటమి అభ్యర్థి అతిక్ అహ్మద్ విజయం సాధించాడు.

ఎస్ఎఫ్ఐ పోరాటాలే విజయానికి నాంది

విద్యను లాభదాయక వస్తువుగా మార్చి, విద్య వాణిజ్యకరణ చేయడాన్ని వ్యతిరేకిస్తూ అనేక పోరాటాలు నడిపింది. ప్రధానంగా మతోన్మాద ఎజెండాను, యూనివర్శిటీల స్వంతంత్రను ధ్వంసం చేసే నూతన విద్యావిధానం వెనక్కి తీసుకోవాలని బలమైన ఉద్యమాలు నిర్వహించింది. పీహెచ్‌డీ ప్రవేశాలలో విద్యార్థుల పేర్ల పక్కన కులాన్ని పెట్టి ప్రవేశాలు కల్పించే విధానానికి బలంగా వ్యతిరేకించింది. ఎస్ఎఫ్ఐ పోరాట ఫలితంగా కులం పేరు లేకుండా అడ్మిషన్లు ఇప్పించగలిగింది. ఇంకా అనేక రూపాల్లో యూనివర్శిటీలో నిధుల కోతపై ఉద్యమాలను విద్యార్థుల్లోకి తీసుకెళ్ళింది. ఆరెస్సెస్, ఏబీవీపీకి అనుకూలంగా ఉన్న అడ్మినిస్ట్రేషన్, అనేక ఆటంకాలు కల్పించినప్పటికీ విద్యార్థుల సమస్యలపై గత విద్యార్థి సంఘం చేసిన అవిశ్రాంత పోరాటాల వల్లనే ఈ సారి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు నిర్వహణ సాధ్యమైంది. సియుఈటి ఫీజు పేరుతో అప్లికేషన్ ఫీజు కట్టినా మళ్లీ రూ.600 యూనివర్శిటీలో చెల్లించాలని నిర్ణయంపై నాలుగు రోజులు పరిపాలన భవనం ఎదురుగా నిరవధిక దీక్ష చేసి ఫీజు మాఫీ చేయించింది. ఖాళీగా ఉన్న పోస్టులు భర్తీ చేయాలని పోరాడింది. 24 గంటలు అందుబాటులో లైబ్రరీ ఉండేలా ఫలితాన్ని సాధించింది. కరోనా కార ణంగా రెండేండ్లు పీహెచ్‌డీ థీసిస్ సబ్మిట్ కానందున సమయం ఇవ్వాలని ఉద్యమించగా ఫలితం దక్కింది. ఇవేగాకుండా కాకుండా విద్యార్థులకు హెల్త్ ప్రీమియం పెంచాలని, మౌలిక



సదుపాయాలు కల్పించాలని దశల వారీగా పోరాటాలు నిర్వహించి విద్యార్థులకు ఎస్ఎఫ్ఐ బాసటగా నిలిచింది. అందుకే యూనివర్శిటీ గుర్తింపు ఎన్నికలు మెజార్టీ స్థానాల్లో వామపక్ష, సామాజిక శక్తుల కూటమి కైవసం చేసుకుంది.

ఏబీవీపీ అరాచకం-అడ్మినిస్ట్రేషన్ ఆటంకాలు

గత విద్యార్థి సంఘం నిర్వహించిన కార్యకలాపాల నివేదికను యూనివర్శిటీ జనరల్ బాడీ మీటింగ్ (యుజీబిఎం) ద్వారా విద్యార్థులకు వివరించాలి. అత్యంత ముఖ్యమైన ఈ సమావేశాన్ని గత యూనియన్ అధ్యక్షుడు ప్రజ్వల్ రిపోర్ట్ ప్రవేశ పెట్టకుండా ఏబీవీపీ ఎస్ఎఫ్ఐ నాయకత్వంపై, గత స్టూడెంట్స్ యూనియన్‌పై భౌతిక దాడులు చేయాలని కుట్రతో అరాచకం సృష్టించాలనుకుంది. యుజీబిఎం జరగకుండా అడ్డుకుంది. అయినా విద్యార్థులే ఏబీవీపీకి వ్యతిరేకంగా నిలబడి యుజీబిఎం నిర్వహించారు. అడ్డుకోవాల్సిన అడ్మినిస్ట్రేషన్ కూడా ఏబీవీపీ చెప్పినట్లు నడుచుకుంది. ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత రెండు రోజుల ముందు ఎన్నికలు నిలిపివేయాలని నిర్ణయించింది, విద్యార్థుల ఆందోళనతో మళ్ళీ నిర్ణయం మార్చుకుంది. ఏబీవీపీ క్యాంపెయిన్‌కు విద్యార్థులు హాజరుకావాలని మెయిల్స్ పంపింది. ఏబీవీపీ కావాలనే ఎస్ఎఫ్ఐ పోస్టర్లు చించివేసి ఘర్షణకు దిగే ప్రయత్నం చేసింది. ప్రెసి డెన్సియల్ డిబెట్ ఆన్‌లైన్‌లో జరిగితే ఎస్ఎఫ్ఐ అధ్యక్ష అభ్యర్థి హిందీలో మాట్లాడుతుంటే ఇంగ్లీషులోనే మాట్లడాలని అడ్డు తగిలింది. ఎస్ఎఫ్ఐపై, ఇతర కూటములు, ఏబీవీపీ ఎన్ని దాడులు చేసినా బలంగా నిలబడి ప్రజాస్వామ్య పద్ధతిలో రాజకీయ పోరాటానికి దిగింది. విద్యార్థుల మద్దతుతో అసమాన విజయాన్ని సాధించింది. నూతన విద్యావిధానం ద్వారా విద్యను సరుకుగా మార్చే, విద్యలో మతోన్మాద భావాలను తీసుకువచ్చే మతోన్మాదులకు తెలంగాణలో స్థానం లేదని నిరూపించిన విద్యార్థిలోకానికి విప్లవ జేజేలు. ■

రోజుకెన్ని గంటలు యాద్‌గిరీ!!

క్రికెట్ ప్రపంచ కప్పు ఫైనల్ మ్యాచు. మొదటి వికెట్ తొందరగా పడింది. బ్యాట్స్‌మన్ అదే బల్లేబాజ్.... క్రీజు వదిలి పెవిలియనుకు పోకుండా అలాగే ఉన్నాడు.

అంపైర్ అతని దగ్గరకొచ్చి "నీవు అవుటయ్యావు కదా ఇంకా ఇక్కడ నీకేం పని" అన్నాడు.

"నేను రోజూ పద్నాలుగు గంటలు పనిచేయాలంట సారూ, ఇప్పుడిప్పుడే పోను" అనేశాడు. చట్టసభల్లో ఐతే మార్షల్సు ఉంటారు ఎత్తుకొని పోవడానికి ఇక్కడ ఏమిచేయాలబ్బా అని అంపైర్ తలపట్టుకున్నాడు.

*****

"ఒరే సురేష్, ఎనిమిది గంటల్లో యాభై కేజీల అన్నం వండితే, పద్నాలుగు గంటల్లో ఎన్ని కేజీలు వండవచ్చు? చెప్పు చూద్దాం" లెక్కల సారు ప్రశ్న.

సురేష్ లెక్కలు వేస్తున్నాడు మనసులో.

ఇంతలో గాయత్రి లేచి "యాభై కేజీల గంజి తయారవుతుంది సార్" అనేసింది. క్లాసు రూమంతా చప్పట్లు

*****

"ఏమండీ శ్రీమతి గారూ, నాష్టా అయ్యిందా? ఎనిమిది కొట్టేటప్పటికి కడుపులో ఎలుకలు పరిగెడతాయి" భర్త అడిగాడు

"ఆ అవుతోంది.. అవుతోంది ఇంకో గంట" భార్య

"ఎందుకండీ రోజూ ఎనిమిదికే కద పెట్టేది" ఖాళీ ప్లేటు రెడీగా పెట్టుకొని అడిగాడు

"అది రోజుకు ఎనిమిది గంటల డ్యూటీ ఉన్నోళ్ళకు, దాన్ని పద్నాలుగు గంటలు చేస్తే టిఫిను తొమ్మిది గంటలకి వస్తుంది"

"దానికీ, దీనికి సంబంధమేముంది" భర్త అమాయక డైలాగు

"అదేమో మీ బాసునే అడగండి, ఓ నాలుగు గంటలు లేటుగా పంపుతాడుగా ఈరోజునుండీ? మా వాళ్ల ఇంట్లో కూడా అదే రూలు పెట్టినారని చెప్పండి" భార్య నికార్సుగా చెప్పింది

*****

"ఈసారి నా పేరూ అందరికీ తెలియాలయ్యా, ఆ నారాయణమూర్తి పేరుకంటే నా పేరు మారుమోగిపోవాలి" బాసు నర్సింగ్ అన్నాడు

"దానికి ఏం చేద్దామని సార్ మీ ప్లాను" యాద్‌గిరి తన తెలివిని ఉపయోగించి అడిగాడు. అయితే తన తెలివిని అమాయకత్వమని బాసు అనుకుంటాడని ఎక్కడో లోపల అనుమానం యాద్‌గిరికి

"రోజుకెన్ని గంటలు పనిచేయాలని కదా టాపిక్కు, ఆయనేమో వారానికి డెబ్బై గంటలన్నాడు, దాన్ని మించి నేను ఏదో ఒకటి మాట్లాడాలని కోరిక"

"ఇదంతా సమయాన్ని వృధా చేయడమే కద సార్"



"ఇదేదో బాగుంది, సమయాన్ని వధా చేయడమెలా అని ఇంకొకటి చెబుతాను తరువాత, ఇప్పుడు విను అసలు స్పీచు, రోజుకు అందరూ డెబ్బై గంటలు పనిచేయాలి ఎలాగుంది ఆయన వారమంటే నేను రోజు అన్నాను, కొద్దిగా మార్చానంతే"

"ఏమీ అనుకోనంటే ఒకటి చెబుతాను సార్"

"చెప్పవయ్యా, నీవు నా శ్రేయోభిలాషివి" నర్సింగ్

"రోజుకు ఇరవైనాలగు గంటల కద సార్ ఉండేది" యాద్‌గిరి



జంధ్యాల రఘుబాబు
9849753298

"అవునయ్యో... ఆ విషయమే మరిచిపోయానే? అయినా రోజుకు ఇరవైనాలుగ్గంటలు అని నిర్ణయించడానికి ఎవరికీ ఎలాంటి హక్కూ లేదు. నిముషానికి అరవై సెకండ్లు ఉండాలని, గంటకు అరవై నిముషాలుండాలని ఎవరు డిసైడ్ చేశారు? తీస్తాను మన పాత గ్రంధాలు తీస్తాను. తీసి మనం ఫలానా మార్పులు చేయాలని కొత్తగా కాలాన్ని నిర్వచిస్తాను. నిముషానికి ఇరవై సెకండ్లో ఇంకా వీలైతే పదహైదు సెకండ్లో పెడతాను. రోజులో తొంభై గంటలు వచ్చే విధంగా కాలాన్ని దాని కొలతల్ని మారుస్తాను. ఇప్పుడు చెప్పు రోజుకు డెబ్బై గంటలు పని చేయలేమా?"

" వీరబ్రహ్మం గారి కాల జ్ఞానం గురించి విన్నాం కాని కాలం పై ఇంత జ్ఞానం ఉండడం నిజంగా విశేషం సార్"

" అప్పుడే ఏమైంది బ్రో, ఇది ఇంకా మొదలు మాత్రమే! చూస్తూ ఉండు ఒక్కో సీను క్లైమాక్సులా ఉండేలా మండే సూర్యుడు నెల్సన్ మండేలాలా రెచ్చిపోతా"

"మధ్యలో మండేలా అస్సలు అతకలేదు సార్"

"ఆ మాటకొస్తే ఏదీ అతక దయ్యా మనమే అతికించాలి. ఒకే మాట పదులు, ఇరవైల సార్లు చెబితే జనాలకు అదే అలవాటై పోతుంది. మన నాయకుల్ని చూడడం లేదూ?"

"ఏమో సార్! తరువాత చెప్పలేదంటనకపోయ్యేరూ అని ముందే చెబుతున్నాను, నాకైతే ఇది నచ్చడం లేదు"

"మొదట్లో ఎవ్వరికీ ఏదీ నచ్చదయ్యా, మనమే నచ్చేలా చేయాలి. ఒక్కోదాన్నీ పట్టు కుని సాగదీయాలి, అదే మన టెక్నిక్కు"

"ఈరోజు నాకు జ్ఞానోదయమయ్యింది సార్, ఇక ఇక్కడినుండి తప్పుకోవాలని" యాద్‌గిరి

*****

సురుకు

అలా ఆ బాసూ, అసిస్టెంట్ల సంభాషణ సా..గిపోతూనే ఉంటుంది, కొన సా...గిపోతూనే ఉంటుంది. ఊరంతా ఒకదారి... ఉలిపిరి కట్టె ఇంకోదారి అన్న సూత్రం వదిలేసి కుటుంబంలో పెద్దోళ్ళు ఏదైతే చెబుతుంటారో దాన్నే కొత్తగా వారానికి డెబ్బై గంటల పనిలా చెబుతూ ఉంటే సరి. మీడియా లో మన పేరు కనిపిస్తూనే వినిపిస్తూనే ఉంటుంది.

ఒప్పుకున్నోళ్ళు ఒప్పుకుంటారు, ఒప్పుకోనివారు ఎప్పటికీ ఒప్పుకోరు అన్న డైలాగులు వదులుతూ ఉంటే సరి. ఐతే ఇక్కడొచ్చిన బాధంతా ఒకటే. ఎందరో యువత తమ మారదర్శులుగా తీసుకున్న ఈ మేధావులు, ఐ.ఎ.ఎస్ ఆఫీసర్లు, శాస్త్రజ్ఞులు ఉన్నట్టుండి ఇలాంటి డెబ్బై గంటల పని అంటూ మాట్లాడితేనే కొద్దిగా కోపమొస్తుంది. వాళ్ళకన్నీ తెలుసు అని మనం అనుకొంటాము కాని కొన్ని విషయాల్ని పట్టించుకోకుండా ఠకీమని మాటలనేస్తుంటే ఆశ్చర్యం అనిపిస్తుంది. ఏయే దేశాల్లో ఎన్నిగంటలు పని చేస్తున్నారు, ఎవరి ఎంతగా అభివృద్ధి చెందారు మొదలైన సమాచారం సరిగ్గా చూడకుండా, చూసినా దాని గురించి చెప్పకుండా మాట్లాడితేనే కోపమొచ్చేది. డిగ్రీలు లేకున్నా అంతకంటే తెలివి ఉన్నోళ్ళు వెంటనే సరైన విషయాలు సేకరించి మరీ చెబుతారనీ వీళ్ళకి తెలుసు. ఐనా ఎంతో కొంత డ్యామే జీ జరిగిపోతే చాలు అని వీళ్ళు అనుకుంటారేమో, తాము చెప్పేది ఆపరు. ఏయే దేశాల్లో ఎన్ని గంటలు పనిచేస్తారు, వాళ్ళ జాతీయాదాయం, ఉత్పత్తి ఎంత అని గణాంకాలు రెడీగా దొరుకుతాయి గూగుల్లో. మొదట అవి తెలుసుకొండని సలహా.

రోజుకు ఎనిమిది గంటల పని, పనికి సరిపోయిన జీతం అన్నది ఎంత పెద్ద భావననో, సూత్రమో ఈ సో కాల్డ్ మేధావులకు అర్థం కాదు. రోజుకు ఎనిమిది గంటలు పనిచేసేటోళ్ళకి రేపటినుండి నువ్వు పన్నెండు గంటలు పనిచేయాలి అని హుకుం జారీ చేస్తే పాలల్లో, మజ్జిగలో నీళ్ళు కలిపినట్లు తయారవుతుంది పరిస్థితి. క్షీణోపాంత అని లేదా తగ్గుతున్న క్రమాన్ని తెలిపే ఉత్పత్తి, వినియోగ విలువల గురించి కొన్ని సిద్ధాంతాలున్నాయి ఆర్థిక శాస్త్రంలో. అవేవీ తెలియనట్టు, చదవనట్టు నటిస్తూ కొందరు చేసే సూచనలు చూస్తే నవ్వొస్తుంది. పదో పన్నెండో గంటలో పనిచేసే అమాత్యులు ఏకంగా పద్నాలుగు, పదహారు గంటలు పనిచేస్తే ఇప్పుడు అమ్మేస్తున్న ప్రజల ఆస్తులు, ప్రభుత్వ సంస్థలు ఇంకెన్ని అమ్ముడుపోతాయో? ప్రజల మధ్య తగాదాలు పెట్టే వారివల్ల ఇంకెన్ని గొడవలు మొదలవుతాయో? అమ్మో ఈ పెంచిన పని గంటల సూత్రం వల్ల మంచి జరిగేదెవరికి అన్న అనుమానం సామాన్యులకు రావడం సహజం. ■





230 మంది సభ్యులున్న మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఓటింగ్ ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య గట్టి పోటీ నెలకొంది. ఓటింగ్ యంత్రాలు స్ట్రాంగ్ రూమ్‌లకు చేరాయి. అయితే మధ్యప్రదేశ్ సీఎంను డిసైడ్ చేసేది. అధికార పీఠంపై కూర్చొపెట్టే కీలక శక్తి మాత్రం మహిళా ఓటర్లే..

మహిళా ఓటర్ల చేతుల్లోనే పీఠం డిసైడ్...

మధ్యప్రదేశ్ లో ఎన్నికల్లో గద్దెనెక్కించే కీలక శక్తి



జైపూర్ : 2018 అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు చూస్తుంటే.. జనాలు ఎందుకు చెబుతున్నారో అర్థం చేసుకోవచ్చు.గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ (41.02శాతం), కాంగ్రెస్ (40.89శాతం) ఓట్ల శాతం దాదాపుగా సమానంగా ఉండగా, సీట్ల తేడా ఐదు మాత్రమే. మొత్తం 230 స్థానాలకు గాను బీజేపీ 109, కాంగ్రెస్ 114 స్థానాలు గెలుచుకున్నాయి.

2020లో రాష్ట్రం చూసిన రాజకీయ గందరగోళం ఉన్నప్పటికీ, ఈసారి ఎన్నికల్లో ఎలాంటి అండర్ కరెంట్ కనిపించలేదు. భారత ప్రజాస్వామ్యానికి శుభసూచకమైన ఓటింగ్ శాతం 76.15శాతం కావడం ప్రస్తుత ప్రభుత్వానికి ప్రమాద ఘంటికగా చెప్పబడుతోంది. ఈ భారీ ఓటింగ్ రాష్ట్రంలో మార్పునకు సంకేతంగా పలువురు అభిప్రాయ పడుతున్నారు. ఎన్నికల్లో గెలవ డానికి బీజేపీ, కాంగ్రెస్‌లు ఏ అవకాశాన్ని వదిలి పెట్ట లేదు. ఇరువర్గాలు అనేక ప్రజాకర్షక వాగ్దానాలు చేశారు.

ఒకప్పుడు రాజకీయంగా మేధావులు కాదని భావించిన మహిళా ఓటర్లు ఇప్పుడు ఎన్నికలకు కేంద్ర బిందువుగా మారినట్టు తెలుస్తోంది. ఈ ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకునే విషయానికి వస్తే, ప్రతి పార్టీ మరొకరిని అధిగమించేందుకు ప్రయత్నిస్తుంది. దామోహ్ నుంచి లోక్‌సభ సిట్టింగ్ ఎంపీగా ఉన్న ప్రహ్లాద్ సింగ్ పటేల్ హోషంగాబాద్ పార్లమెంట్ స్థానం పరిధిలోని నర్సింగపూర్ నుంచి పోటీ చేస్తున్నారు. నర్సింగపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ప్రస్తుతం ప్రహ్లాద్ పటేల్ తమ్ముడు జలం సింగ్ పటేల్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

అధికారాన్ని శాసించేది మహిళలే...

ఈ నియోజకవర్గంలో మహిళా ఓటర్లు తమ గుర్తింపు కార్డులతో పెద్ద సంఖ్యలో పోలింగ్ బూత్‌కు చేరుకున్నారు. ఈ మహిళలకు, ఓటు హక్కు మాత్రమే కాదు, ఇది వారికి గర్వకారణం, ఇది వారి సాధికారతకు చిహ్నం. వారి కోసం ప్రత్యేకంగా రూపొందించిన పథకాలతో, వారు తమ శక్తి గురించి తెలుసుకుంటారు. మహిళా ఓటర్లు డబ్బు తమకు ఇచ్చే శక్తి గురించి, వివిధ పథకాల వల్ల ఇప్పుడు తమకు లభిస్తున్న గౌరవం గురించి మాట్లాడారు. ఈ ఎన్నికల్లో ఓటర్లు అనేక పథకాలను ఎంపిక చేసుకున్నారు. సబ్సిడీతో కూడిన ఎల్‌పీజీ సిలిండర్‌ల నుంచి, దళితులు , గిరిజనులకు ద్రవ్య సహాయం, కొన్ని సందర్భాల్లో నగదు పంపిణీ వంటి వాగ్దానాలు రెండు పార్టీలు తమ అధికార టిక్కెట్‌గా భావిస్తున్నాయి.

రెండు పార్టీలు హిందువుల ఓట్లపై గురి

ఈసారి బీజేపీ రాష్ట్ర ఎన్నికల నుంచి కేంద్ర మంత్రులతో సహా 7 మంది ఎంపీలను రంగంలోకి దించింది. పార్టీ ముఖ్యమంత్రిగా ఎవరినీ ప్రకటించలేదు. సామూహిక నాయకత్వం ఎన్నికల అంశం. ఈసారి పీఎం, పార్టీ, సింబల్ ప్రధాన మంత్రంగా మిగిలాయి. కాంగ్రెస్ మతాన్ని తన స్లీవ్‌పై ధరించే రాష్ట్రం మధ్యప్రదేశ్. రెండు పార్టీలు హిందువుల ఓట్లపై తమ వాదనను చాటుకున్నాయి. ఇది రోల్ రివర్సల్ మాత్రమే కాదు. బీజేపీ అనూహ్యంగా శ్రీరాముడి పేరుతో రాష్ట్రంలోని ఓటర్లను ప్రలోభపెట్టింది.

ఈసారి కూడా రాముడి పేరు చెప్పుకోవడంలో కాంగ్రెస్ వెనుకంజ వేయలేదు. అయోధ్య వివాదాస్పద భూమి తాళాలు తెరిచిన ఘనత రాజీవ్ గాంధీకే దక్కుతుందని కమల్ నాథ్ అన్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల ఫలి తాలు డిసెంబర్ 3న వెలువడనున్నాయి. ఒక విషయం చాలా స్పష్టంగా ఉంది, ఈ ప్రజలకు ప్రతిదీ తెలుసు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా ఆ పథకాలకు ఎర వేస్తారని ఆయనకు తెలుసు. 2024 ఎన్నికలలోపు ఈ పథకాల పరంపర అమలవుతుందా? చాలా మంది నమ్ముతారు.

హిందుత్వ వర్సెస్ బీజేపీ హిందుత్వ

హిందూ ఓట్ల కోసం బీజేపీ, కాంగ్రెస్‌లు తీవ్రంగా పోటీ పడ్డాయి. రాముడిని మన సొంతం చేసుకునేందుకు రాష్ట్రంలో పోటీ నెలకొంది. అయోధ్యలోని వివాదాస్పద స్థలం తాళాలను తెరిచినందుకు కమల్‌నాథ్ కాంగ్రెస్ పార్టీకి, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి క్రెడిట్ ఇచ్చారు. ఒకప్పుడు సన్నిహిత మిత్రులైన ప్రియాంక గాంధీ, జ్యోతిరాదిత్య సింధియా ఒకరినొకరు దూషించుకోవడం కనిపించింది. ప్రధాని మోడీ మధ్యప్రదేశ్‌లో బీజేపీ తరపున 16 ర్యాలీలు, ఒక రోడ్‌షో నిర్వహించారు. అమిత్ షా 18 ర్యాలీలు, రెండు రోడ్ షోలు నిర్వహించారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ 17 ర్యాలీలు నిర్వహించారు.

బీజేపీ నుంచి అధికారాన్ని చేజిక్కించుకునేందుకు రాహుల్, ప్రియాంక రాష్ట్రంలో ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేశారు. రాహుల్ గాంధీ 11 ర్యాలీలు, మూడు రోడ్ షోలు నిర్వహించారు. ప్రియాంక గాంధీ 10 ర్యాలీలు, ఒక రోడ్ షో చేశారు. బీజేపీ, కాంగ్రెస్‌ల మధ్య హెూరాహెూరీ పోరు సాగుతున్నప్పటికీ, ఈసారి రెండు ప్రధాన జాతీయ పార్టీల ప్రచారాల్లోనూ పోలికలు కనిపిస్తున్నాయి. ఇద్దరి ప్రచార రంగులు ఒకేలా ఉన్నాయి, అందుకే ఎన్నికల పోరులో కచ్చితమైన విజేతను ఎంచుకోవడం అంత సులభం కాదు. రెండు పార్టీలకు చాలా ప్రమాదం ఉంది.

'లాడ్లీ బెహనా యోజన' గేమ్ ఛేంజర్ అవుతుందా?

శివరాజ్ సింగ్ చౌహాన్ తన 'లాడ్లీ బ్రాహ్మణ యోజన'తో ఎన్నికలను బీజేపీకి అనుకూలంగా మార్చాలని ఆశిస్తున్నారు. ఈ పథకం కింద రాష్ట్ర ప్రభుత్వం దాదాపు 1 కోటి 30 లక్షల మంది పేద కుటుంబాలకు చెందిన మహిళలకు నెలకు రూ.1250 ఆర్థిక సహాయం అందిస్తుంది. అదే సమయంలో కాంగ్రెస్ కూడా ఈసారి వాగ్దానాల విషయంలో వెనక్కి తగ్గలేదు. 'లాడ్లీ బ్రాహ్మణ యోజన' మొత్తాన్ని నెలకు 1500 రూపాయలకు పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది.

కోటాలో విద్యార్థుల బలవన్మరణాలపై రాజకీయ పార్టీల స్పందనేది?

- కొనసాగుతున్న ఆత్మహత్యలు
- అయినా.. ఎన్నికల ప్రచారాల్లో లేవనెత్తని వైనం



జైపూర్ : రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం వేడెక్కుతున్నది. పార్టీలు ప్రచారాల్లో నిమగ్నమయ్యాయి. ప్రజలను ఆకర్శించే ప్రయత్నాలను చేస్తున్నాయి. అయితే, ఇలాంటి తరుణంలో ఇటీవల విద్యార్థుల వరుస ఆత్మహత్యలకు పేరుగాంచిన కోచింగ్ హబ్ కోటా సమస్యలను రాజకీయ పార్టీలు పట్టించుకోవటం లేవు. అన్ని రాజకీయ పార్టీల అజెండాలో ఈ అంశం అంతగా ప్రాధాన్యంగా కనిపించటం లేదు.

భారతదేశంలో అతిపెద్ద కోచింగ్ హబ్‌లలో ఒకటైన కోటాలో విద్యార్థుల ఆత్మహత్యలు, సమస్యలపై చెక్ పెట్టటానికి ఇప్పటికే బిల్లులు ప్రతిపాదించబడ్డాయి. పలు సూచనలు సైతం వచ్చాయి. కానీ అవేమీ ఇక్కడ విద్యార్థుల బలవన్మరణాలను ఆపలేకపోయాయి. కోటా 2015 నుంచి అత్యధికంగా ఈ ఏడాది ఆత్మహత్యలను చవిచూడటం గమనార్హం. మొత్తం 25 మంది విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడ్డారు.

చాలా చిన్న వయస్సులోనే వేలాది మంది విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవటానికి కోటకు వస్తారు. రైల్వే స్టేషన్ నుంచి నగరం వెనుక మూల వరకు అంతా విద్యార్థుల సందడే ఉంటుంది. జాతీయ స్థాయిలో ర్యాంకులు సాధించిన కొంతమంది విద్యార్థులు హెూర్డింగ్‌లపై తమ చిత్రాలతో కనిస్తుంటారు. అయితే, లక్ష్యాన్ని సాధించే క్రమంలో కొందరు విద్యార్థులు ఆత్మన్యూనతా భావానికి లోనై బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. వారి తల్లిదండ్రులకు తీరని శోకాన్ని మిగిలిస్తున్నారని మానసిక నిపుణులు అంటున్నారు. కోటాలో ఈ ఏడాది నివేదికలు సూచించిన దానికంటే ఆత్మహత్యల సంఖ్య ఎక్కువగానే ఉంటాయనీ, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు తమ పరువు కాపాడుకునేందుకు ఉద్దేశపూర్వకంగానే ఈ గణాంకాలను దాచిపెడుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

రాజకీయ పార్టీల మాత్రం ఈ విషయంలో సాధారణానికి భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. స్పందించాల్సిన పార్టీలు నిష్క్రియాత్మకంగా ఉంటున్నాయి. రాష్ట్రంలో జరుగుతున్న ఎన్నికల ప్రచారంలో కోచింగ్ పరిశ్రమను వేధిస్తున్న ఈ సమస్యపై రాజకీయ పార్టీలలో ఎలాంటి కదలికా లేకపోవటం ఆందోళనకరమని మేధావులు, సామాజికవేత్తలు అంటున్నారు. "ఇక్కడికి వచ్చే చాలా మంది విద్యార్థులు అస్సలు ప్రిపేర్ అవ్వరు. వారు 15-17 సంవత్సరాల వయస్సులో వస్తారు. ఇది నగరం అందించే జీవనశైలికి లొంగిపోవడానికి, ఇంటికి తిరిగి వెళ్లడానికి దారి తీస్తుంది. తల్లిదండ్రులు తమ పిల్లలను కనీసం 18 ఏండ్లు వచ్చే వరకు బయటకు పంపకూడదని మేము భావిస్తున్నాము"అని ఒక కంపెనీలో పనిచేస్తున్న ఆనంద్ చెప్పారు.

ఈనెల 25న రాజస్థాన్ ఓటింగ్‌కు సిద్ధమవుతున్న తరుణంలో కోచింగ్ హబ్‌లోని కోటాలో పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యల భయంకరమైన పరిస్థితి కీలక అంశంగా మారుతుందని విశ్లేషకులు తెలిపారు. డబ్బు సంపాదించే ఈ కోచింగ్ ఫ్యాక్టరీలకు చెక్ పెట్టే తక్షణ చట్టం అవసరమని వారు నొక్కి చెప్పారు.

అసోంలో బీజేపీ సర్కారుపై ఛార్జీషీట్

- 1 నుంచి లోక్‌సభ ఎన్నికల ప్రచారం
- యునైటెడ్ అపోజిషన్ ఫోరమ్ వెల్లడి



న్యూఢిల్లీ: అసోంలో కాంగ్రెస్ నేతృత్వంలోని 15 పార్టీల యునైటెడ్ అపోజిషన్ ఫోరమ్ (యూఓఎఫ్) లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నది. డిసెంబర్ 1న వచ్చే లోక్‌సభ ఎన్నికల ప్రచారాన్ని అధికారికంగా ప్రారంభించనున్నట్టు ఆ కూటమి ప్రకటించింది. ఆ రాష్ట్ర రాజధాని గువహతిలో జరిగిన సమావేశం తరువాత పార్టీ నేతలు ఈ విషయాన్ని వెల్లడించారు. .

యూఓఎఫ్ ప్రధాన కార్యదర్శి, అస్సాం జాతీయ పరిషత్(ఏజేపీ) అధ్యక్షుడు లూరింజ్యోతి గొగోయ్.. ప్రతిపక్షాల ప్రచారంలో ప్రాథమికంగా ముఖ్యమంత్రి కుటుంబంలోని అవినీతిపైనే ఉంటుందని హైలైట్ చేశారు. "మేము అసోంలో బీజేపీ నేతృత్వంలోని ప్రభుత్వం, ముఖ్యమంత్రిపై ఛార్జిషీట్‌ను సిద్ధం చేస్తున్నాం.అస్సాం కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (ఏసీఎల్పీ) ఉప నాయకుడు రకీబుల్ హుస్సేన్ ప్రతిపక్షాల బలంపై విశ్వాసం వ్యక్తం చేస్తూ.. "రాబోయే ఎన్నికల్లో ఉమ్మడి ప్రతిపక్షాన్ని ఎదుర్కోవడానికి ముఖ్యమంత్రి భయపడుతున్నారు. ఎగువ అసోంలో వారి పార్టీ పరిస్థితి అధ్వాన్నంగా ఉన్నది" అని అన్నారు. ఫోరమ్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (ఏపీసీసీ) అధ్యక్షుడు భూపేన్ క్ర బోరా, సీఎల్పీ నేత దేబబ్రత సైకియా, రాజ్యసభ ఎంపీ అజిత్ కుమార్ భుయాన్, రైజోర్ దాల్ అధ్యక్షుడు, ఎమ్మెల్యే అఖిల్ గొగోయ్, ఏజేపీ అధ్యక్షుడు లూరింజ్యోతి గొగోయ్, అస్సాం తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) అధ్యక్షుడు రిపున్ బోరా, సీపీఐ(ఎం) నాయకులు సుప్రకాశ్ తాలుక్దార్, సీపీఐ నాయకుడు కనక్ గొగోయ్, సీపీఐ(ఎంఎల్) నాయకులు పంకజ్ కుమార్ దాస్, ఆప్ రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ భాబెన్ చౌదరి, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎన్సీపీ) నాయకుడు జతీంద్ర నాథ్ బోర్డోలోయ్, ఏఐఎఫ్‌బీ నాయకుడు మిహిర్ నంది, శివసేన(యూబీటీ) నాయకుడు రాంనారాయణ్ సింగ్‌లు పాల్గొన్నారు. అవినీతి ఆరోపణలను తెరపైకి తెచ్చేందుకు ప్రతిపక్షాల ఎత్తుగడ అసోంలో వాడివేడి ఎన్నికల పోరుకు వేదికైందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు.

కాంగ్రెస్ చీఫ్ కో-ఆర్డినేటర్ గా విజయశాంతి

- 15 మంది కన్వీనర్ల నియమకం

న్యూఢిల్లీ : తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు గాను కాంగ్రెస్ క్యాంపెయిన్ అండ్ ప్లానింగ్ కమిటీ చీఫ్ కో-ఆర్డినేటర్‌గా మాజీ ఎంపీ విజయశాంతిని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నియమించారు. అలాగే ఆమెతో పాటు 15 మంది కన్వీనర్లను నియమించారు. ఈ మేరకు శనివారం ఏఐసీసీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. కన్వీనర్లుగా మాజీ మంత్రులు డీకే సమరసింహారెడ్డి, పుష్పలీల, మాజీ ఎంపీ మల్లు రవి, మాజీ ఎమ్మెల్యేలు ఎం. కోదండరెడ్డి, వేం నరేందర్‌రెడ్డి, ఈరవత్రి అనిల్, మాజీ ఎమ్మెల్సీలు రాములు నాయక్, పోట్ల నాగేశ్వరరావు, సీనియర్ నాయకులు ఒబేదుల్లా కోత్వాల్, రమేష్ ముదిరాజ్, పారిజాత రెడ్డి, సిద్దేశ్వర్, రామ్మూర్తి నాయక్, అలీ బిన్ ఇబ్రహీం మస్కతి, దీపక్ జైన్లను నియమించారు. ఈ ఉత్తర్వులు తక్షణమే అమలులోకి వస్తాయని కేసీ వేణుగోపాల్ స్పష్టం చేశారు.



ఎర్రజెండా నీడలో ఇండ్ల స్థలాల పోరాటం

- అణచివేసేందుకు అధికార పార్టీ ఎమ్మెల్యేల యత్నం
- పలు చోట్ల గుడిసెల ధ్వంసం, పేదలపై దాడులు

కష్టజీవులపై కక్షపూరిత వైఖరి
ఉద్యమంతో మమేకమైన సీపీఐ(ఎం) నాయకులు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రజా సమస్యలపై పోరాటం అంటేనే గుర్తుకొచ్చేది కమ్యూనిస్టులు. అది చట్టసభల్లో అయినా, వీధుల్లో పోరాటమైనా ప్రజల గొంతును వినిపించేది కమ్యూనిస్టులు. సమస్య తీవ్రతను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేసేదీ కమ్యూనిస్టులే. పేదలకు, గుడిసెవాసులకు అండగా నిలిచేది ఎర్రజెండా. రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం సీపీఐ(ఎం), ప్రజాసంఘాల పోరాట వేదిక నాయకత్వంలో పెద్దఎత్తున పోరాటం సాగింది. సమస్య పరిష్కారం కోసం అవిశ్రాంతంగా ఎర్రజెండా పోరాడుతున్నది. 18 నెలలుగా 19 జిల్లాల్లో 69 కేంద్రాల్లో లక్షకుపైగా కుటుంబాలు ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్నారు. పట్టాల కోసం, ఇంటి నిర్మాణానికి సహాయం కోసం, డబుల్ బెడ్రూం ఇండ్ల కోసం పోరాటం ఉవ్వెత్తున సాగుతున్నది.

ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకోవడం జీర్ణించుకోలేని కొందరు అధికార పార్టీ ఎమ్మెల్యేలు దాడులకు పాల్పడ్డారు. గూండాలను పంపించి గుడిసెలను ధ్వంసం చేయించారు. పోలీసులను ఉపయోగించి అక్రమ కేసులను బనాయించారు. బీఆర్ఎస్ మహబూబాబాద్ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్ఎస్ వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నరేందర్ గుడిసె వాసులపై కక్షపూరితంగా వ్యవహరించారు. ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు ప్రయత్నించారు. గుడిసెలను తొలగించారు. అయినా పేదలు బెదరకుండా మళ్లీ గుడిసెలు వేసుకుని ఉద్యమస్ఫూర్తిని ప్రదర్శించారు. ఆ ఉద్యమానికి సీపీఐ(ఎం) నాయకులు అండగా నిలిచారు. గుడిసె వాసులతో మమేకమయ్యారు. ఎర్రజెండా తోడుగా ఉంటుందని భరోసానిచ్చారు.

జక్కలొద్దిలో దాడులు

వరంగల్ జిల్లా జక్కలొద్దిలో గుడిసెలు వేసుకుని కనీస సౌకర్యాలను ఏర్పరచుకుని ప్రశాంత జీవనం గడుపుతున్నారు. అయితే పేదలపై అధికార పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు కక్షగట్టారు. జక్కలొద్ది ప్రాంతం ప్రగతినగర్ పేరుతో ఏర్పడింది. ఈ గుడిసెల ప్రాంతాన్ని చూసి అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఓర్వలేకపోయారు. రౌడీమూకలను ఎగదోసి దాడి చేయించారు. అయినా పేదలు భయపడలేదు. అక్కడే స్థిరనివాసం ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారు.

ఇలా అనేక కేంద్రాల్లో పోరాటం కొనసాగుతున్నది. మహబూబాబాద్‌లో పది మంది బడుగు బలహీనవర్గాలకు చెందిన మహిళలను అక్రమంగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేశారు. ఎల్బీనగర్ వద్ద 17 మంది మహిళలతో సహా అర్థరాత్రి అరెస్టు చేసి కొట్టారు. జక్కలొద్దిలో గర్భిణీ అని చూడకుండా దాడి చేశారు. సీపీఐ(ఎం) కార్యకర్తలకు తలలు పగిలాయి. మహబూబాబాద్‌లో అటవీ అధికారులు, జక్కలొద్దిలో మహిళల పట్ల పోలీసులు అసభ్యంగా ప్రవర్తించారు. కోరుట్లలో సీపీఐ(ఎం) నాయకుని మీద బీఆర్ఎస్ కౌన్సిలర్ భౌతికదాడి చేశారు. అయినా బెదరకుండా పోరాటం సాగుతున్నది.

పోరాడితే విజయాలు సాధ్యమే

ప్రజలు ఐక్యంగా పోరాడితే విజయాలు సాధ్యమేనని పలు చోట్ల నిరూపణ అయ్యింది. ఆ పోరాటం ఫలితంగానే సిరిసిల్లలో 960 పేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇండ్లు రావడే అందుకు నిదర్శనం. రంగారెడ్డి జిల్లా కందుకూరులో 320 కుటుంబాలు పట్టాలు సాధించుకున్నారు. కొన్ని గుడిసెల కేంద్రాల్లో సామూహిక గృహప్రవేశాలు చేశారు.గుడిసెవాసుల పోరాటంలో సీపీఐ(ఎం) నాయకులు మమేకమయ్యారు. అక్కడే బస చేస్తూ అక్కడే తింటూ పోరాటంలో భాగస్వాములయ్యారు. వారి నాయకత్వంలో లక్షలాది పేదలు అక్కడ పాములు, తేళ్ల మధ్య గుడిసెలేసుకుని పేదలు నివాసముంటున్నారు.

పోరాట విజయాలు



రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వేలో 30 లక్షల మందికి సొంత ఇండ్లు లేవని తేల్చింది. ఇండ్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టించి ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం వాగ్దానం చేసింది. కానీ అది పూర్తిస్థాయిలో ఆచరణకు నోచుకోలేదు. ప్రతి ఎన్నికల సమయంలో ఆశ చూపించే పథకంగా మారింది. 2022, డిసెంబర్ 31 నాటికి దేశంలో సొంత ఇండ్లులేని పేదలు ఉండబోరనీ, అందరికీ ఇండ్లు కట్టించి ఇస్తామని కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వాగ్దానం చేసింది. కేంద్ర,


పేదలకు ఇండ్లు ఇవ్వని ప్రభుత్వాలు

రాష్ట్ర ప్రభుత్వాలు ఇండ్లు, ఇండ్ల స్థలాలు ఇవ్వడంలో మాట తప్పాయి. కేరళలో సొంత ఇండ్లులేని కుటుంబాలను గుర్తించి ఇండ్లు నిర్మించి సీపీఐ(ఎం) నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం లబ్దిదారులకు అప్పగించింది. అధికారంలో ఉన్నచోట కమ్యూనిస్టులు చేసి చూపిస్తున్నారు. తెలంగాణలోనూ అనేక సార్లు ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సీపీఐ(ఎం) ప్రయత్నించింది. ఈ ప్రభుత్వం కదలడం లేదని తేలిన తర్వాతే పోరాడి సాధించుకోవాలనే నిర్ణయానికి వచ్చారు. అందుకే గతేడాది మే నుంచి ఇండ్లు, ఇండ్ల స్థలాల పోరాటం ప్రారంభమైంది. ప్రజాసంఘాల పోరాట వేదిక, సీపీఐ(ఎం) నాయకత్వంలో ఈ పోరాటం రాష్ట్రవ్యాప్తంగా వేగంగా విస్తరించింది.

చారిత్రాత్మక పోరాటం : ఎస్ వీరయ్య



రాష్ట్రంలో ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం చారిత్రాత్మకమైన పోరాటం సాగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య చెప్పారు. సీపీఐ(ఎం) నాయకత్వంలో ఎర్రజెండా నీడన సాగిన ఈ పోరాటం లక్ష కుటుంబాలకు అండగా నిలిచిందని అన్నారు. రాష్ట్రంలో పేదలు ఎక్కడ పోరాడినా కమ్యూనిస్టులు అక్కడ ఉన్నారని వివరించారు. కార్మికులు, వ్యవసాయ కూలీలు, రైతులు, మహిళలు ఆర్థిక సమస్యల కోసమే కాకుండా సామాజిక సమస్యల మీద జరుగుతున్న పోరాటాలన్నింటికీ కమ్యూనిస్టులు అండగా నిలిచారని చెప్పారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	61,690	-	---
22 క్యారెట్లు	56,550	-	---
కిలో వెండి	79,000	▼	500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 97
రిటైల్ (లైవ్)	రూ. 119
స్కిన్‌తో	రూ. 173
స్కిన్‌లెస్	రూ. 196

ఎలా ఉన్నారో...?



టన్నెల్‌లో చిక్కుకున్న కార్మికుల యోగక్షేమాలపై బంధువుల ఆందోళన

- సహాయ చర్యలకు పలు ఆటంకాలు

డెహ్రాడూన్ : ఉత్తరాఖండ్‌లోని ఉత్తరకాశీ జిల్లాలో ఈ నెల 12వ తేదీ ఉదయం సిల్క్యారా టన్నెల్‌లో జరిగిన ప్రమాదంలో చిక్కుబడిపోయిన 41 మంది కార్మికులు ఎలా ఉన్నారు? ఇప్పుడు అందరికీ వేధిస్తున్న ప్రశ్న ఇదే. టన్నెల్‌లో ఉన్న తమ వారి కోసం బంధువులు, స్నేహితులు రాత్రింబవళ్లూ ఎదురు చూస్తూనే ఉన్నారు. నాలుగున్నర కిలోమీటర్ల పొడవైన టన్నెల్‌లో కార్మికులు శిథిలాల కింద చిక్కుబడిపోయిన విషయం తెలిసిందే. లోపల ఉన్న వారికి అధికారులు అవసరమైన ఆక్సిజన్, ఆహారాన్ని పైపుల ద్వారా అందిస్తున్నారు. వారందరూ సురక్షితంగానే ఉన్నారని వార్తలు అందుతున్నాయి. అయితే చీకటి గుహలో 150 గంటలకు పైగా గడిపిన కార్మికులు స్వచ్ఛమైన గాలి, వెలుతురు లేక అల్లాడిపోతున్నారు. తీవ్ర భయాందోళనలతో ఉన్న కార్మికులు ఒకరితో ఒకరు నెమ్మదిగా మాట్లాడుకుంటూ పరస్పరం ధైర్యం చెప్పుకుంటున్నారు. కార్మికులను సురక్షితంగా బయటకు తీసుకొచ్చేందుకు ఇప్పటి వరకూ చేపట్టిన సహాయ చర్యలేవీ సఫలం కాలేదు. టన్నెల్‌లోకి వెళ్లేందుకు అడ్డుగా ఉన్న రాయిని పగలగొట్టేందుకు అధికారులు మూడు ప్రయత్నాలు చేశారు. అయితే వేర్వేరు కారణాలతో అవి ఫలించలేదు.

'దీపావళి రోజున ఉదయం టన్నెల్ కూలిపోయింది. సంఘటనా స్థలంలో కేవలం ఒకే ఒక జేసీబీ ఉంది. దానివల్ల పెద్దగా ఉపయోగం కలగలేదు. రాష్ట్ర విపత్తు సహాయ బృందం (ఎస్‌డీఆర్‌ఎఫ్), భారత్-టిబెట్ సరిహద్దు పోలీసులు (ఐటీబీపీ), సరిహద్దు రోడ్ల సంస్థ (బీఆర్‌ఓ) సిబ్బంది కొన్ని గంటల వ్యవధిలోనే అక్కడికి చేరుకున్నారు. హరిద్వార్ నుండి డ్రిల్లింగ్ యంత్రాన్ని తెప్పించారు. 13వ తేదీ శిథిలాల తొలగింపు పనులు మొదలయ్యాయి. అయితే ఘటనా స్థలంలో రాళ్లు, కంకర పడడం మొదలైంది. దీంతో పనులు ముందుకు సాగడం కష్టమైంది' అని సహాయ కార్యక్రమాల్లో ఉన్న శాస్త్రవేత్త భీమ్ సింగ్ రావత్ తెలిపారు. తమ ప్రయత్నాలు ఫలించకపోవడంతో అధికారులు అమెరికాకు చెందిన ఆగర్ డ్రిల్లింగ్ యంత్రాన్ని ఉపయోగించారు. దీని కోసం ఓ ప్లాట్‌ఫారంను కూడా ఏర్పాటు చేశారు. ఆ యంత్రం గురువారం మధ్యాహ్నం పని ప్రారంభించింది. అయితే శిథిలాల తొలగింపు ప్రక్రియలో రాళ్లు, కంకర పడుతుండడంతో శుక్రవారం ఉదయం ఈ ఆపరేషన్ ఆగిపోయింది. టన్నెల్‌లో 41 మంది ఉన్నారని ఉత్తరకాశీ జిల్లా అధికారులు తెలిపారు. దీపావళి రోజున కార్మికులు తక్కువ సంఖ్యలో విధులకు హాజరయ్యారని, అదే సాధారణ రోజుల్లో అయితే 150-200 మంది కార్మికులు పనిలో ఉండేవారని, పెను విపత్తు సంభవించి ఉండేదని ఓ అధికారి చెప్పారు. కొందరు కార్మికులు సెలవులో ఉండగా, మరికొందరు విధులకు రాలేదని అన్నారు. సరైన సర్వే చేయకుండా టన్నెల్ నిర్మాణాన్ని ఎలా అనుమతించారని నిపుణులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే అత్యవసరంగా తప్పించుకునే మార్గాన్ని సైతం నిర్మించలేదని చెప్పారు. ఏదేమైనా టన్నెల్‌లో చిక్కుబడిన కార్మికుల పరిస్థితిపై బంధువులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఇరవై రెండు సంవత్సరాల కుమారుడు మంజిత్ లాల్ టన్నెల్‌లో చిక్కుబడడంతో అతని తండ్రి చౌదరి లాల్ అక్కడే పడిగాపులు కాస్తున్నారు. మంజిత్ రెండు నెలల క్రితమే పనిలో చేరాడు. చౌదరి మరో కుమారుడు ఇటీవలే ముంబయిలో విద్యుత్ షాక్‌కు గురై చనిపోయాడు.

బీహార్‌లోని చంపావత్ జిల్లాకు చెందిన విక్రమ్ సింగ్ కూడా టన్నెల్‌లోనే ఉన్నారు. ఆయన శుక్రవారం తన సోదరుడు పుష్కర్‌తో మాట్లాడారు. తాను ప్రమాదంలో ఉన్న విషయాన్ని తల్లికి చెప్పవద్దని కోరారు. టన్నెల్‌లో చిక్కుకున్న వారితో తోటి కార్మికులు తరచూ మాట్లాడుతూ ధైర్యం చెబుతున్నారు. అయితే వారికి ఒకే ప్రశ్న ఎదురవుతోంది. 'మీరు మమ్మల్ని ఎప్పుడు బయటికి తెస్తారు?' అంటూ బాధితులు దీనంగా అడుగుతున్నారు. ఈ టన్నెల్‌లో కొంత భాగం 2019లో కూలిపోయింది. అయితే ఆ సమయంలో కార్మికులెవ్వరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది.

బీజేపీ వస్తే బీసీని ముఖ్యమంత్రి చేస్తాం

- తెలంగాణలో పాలనంత అవినీతిమయం : కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా
- జనాన్ని రప్పించడం కోసం నల్లగొండ నేతల తంటాలు



నవతెలంగాణ -నల్లగొండ కలెక్టరేట్/వరంగల్

కేసీఆర్ కారును, కమీషన్ల ప్రభుత్వాన్ని మోడీ గ్యారేజ్‌కు పంపించాల్సిన సమయం ఆసన్నమైందని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా అన్నారు. తెలంగాణ సమగ్ర అభివృద్ధి కోసం డబుల్ ఇంజన్ సర్కారు రావాల్సిన అవసరం ఉందని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే బీసీ నాయకుడిని ముఖ్యమంత్రి చేస్తామని చెప్పారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని అవుట్‌డోర్ స్టేడియంలో జరిగిన సకల జనుల విజయ సంకల్ప సభలో ఆయన మాట్లాడారు. నల్లగొండ పట్టణాభివృద్ధి కోసం రూ.400 కోట్లు కేటాయిస్తే వాటిని బీఆర్‌ఎస్ దోచుకుందన్నారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్న మతపరమైన రిజర్వేషన్లను తొలగించి బీసీ, ఎస్సీ, ఎస్టీలకు వర్తింపచేస్తామన్నారు. ఈ ఎన్నికలు మోడీ సుపరిపాలన, కేసీఆర్ అహంకార పాలనకు మధ్య జరుగుతున్నాయన్నారు. కాళేశ్వరం కుంభకోణం, మద్యం, సారా కుంభకోణాలతో పాటు మియాపూర్ భూముల కుంభకోణం బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిందని ఆరోపించారు. రాష్ట్రంలో ఓవైసీతో కలిసి కేసీఆర్ మత రాజకీయాలు చేస్తున్నారన్నారు.

జనవరి 22న అయోధ్యలో రామ మందిరం ప్రారంభిస్తామని తెలిపారు. రామ మందిరాన్ని అడ్డుకున్న కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. నల్లగొండ నియోజకవర్గ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి మాధగోని శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. డబ్బు సంచులతో వచ్చిన కోమటిరెడ్డి వెంకటరెడ్డి సంతలో పశువుల మాదిరిగా ప్రజాప్రతినిధులను కొనుగోలు చేస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుత ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి అభివృద్ధిని విస్మరించి భూ కబ్జాలకు తెరలేపారని ఆరోపించారు. కాగా, సభకు జనాలను రప్పించడం బీజేపీ నేతలకు పెద్ద సవాలుగా మారింది. ఎంతో కష్టపడి కిరాయికి తెచ్చిన వారు కూడా మొరాయించడంతో నేతలు తలలు పట్టుకుంటున్నారు. దాంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి. సభలో కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె. లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు కంకణాల శ్రీధర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జి ఆర్.ప్రదీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సర్కార్ అవినీతికి అడ్డా

వరంగల్ వాకింగ్ గ్రౌండ్‌లో జరిగిన సభలో అమిత్ షా మాట్లాడుతూ.. కేసీఆర్ సర్కార్ రాష్ట్రాన్ని అవినీతికి అడ్డాగా మార్చేసిందని అన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు మిగులు సంపదతో ఉన్న రాష్ట్రం ప్రస్తుతం అప్పుల కుప్పగా మారిందన్నారు. బీఆర్‌ఎస్ పూర్తిగా అవినీతిమయమైందని ఆరోపించారు. గతంలో నిజాంరాజు నియంత పాలనను కేసీఆర్ కొనసాగిస్తున్నారన్నారు. టీఎస్‌పీఎస్‌సీ పేపర్ లీకేజీ వల్ల అనేక మంది యువత ఆత్మహత్యలకు పాల్పడ్డారన్నారు. సమ్మక్క-సారక్క గిరిజన విశ్వవిద్యాలయం, నేషనల్ హైవే వందేమాతరం రైళ్లను మోడీ ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. రాష్ట్రంలో రెండవ పెద్ద ఆస్పత్రి ఎంజీఎంకు కేసీఆర్ సర్కార్ ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదన్నారు.

ఆ పదాలు తొలగించండి

- పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ సూచన

న్యూఢిల్లీ : భారతీయ ఎవిడెన్స్ చట్టం స్థానంలో తీసుకొచ్చిన బిల్లులో 'ఏ సమాచారాన్ని అయినా' అనే పదాలను తొలగించాలని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (హోం వ్యవహారాలు) ప్రభుత్వానికి సూచించింది. ఎవిడెన్స్ చట్టం స్థానంలో మోడీ ప్రభుత్వం భారతీయ సాక్ష్య బిల్లును ప్రతిపాదించిన విషయం తెలిసిందే. ఈ బిల్లును పరిశీలించి, తగిన సూచనలు చేసేందుకు ప్రభుత్వం స్టాండింగ్ కమిటీని ఏర్పాటు చేసింది. 'ఏ సమాచారాన్ని అయినా' అనే పదాలను అన్వయించుకోవడంలో అనేక తీవ్రమైన సంక్లిష్టతలు తలెత్తే అవకాశం ఉన్నదని కమిటీ అభిప్రాయపడింది. ఆధారాలను తారుమారు చేసే ప్రమాదం కూడా ఉన్నదని హెచ్చరించింది. దర్యాప్తు సందర్భంగా సంపాదించే ఎలక్ట్రానిక్, డిజిటల్ రికార్డుల ప్రామాణికతను, సమగ్రతను పరిరక్షించాల్సిన అవసరం ఉన్నదని సిఫార్సు చేసింది.

ఐపీసీ, సీఆర్‌పీసీ సెక్షన్లతో పాటు ఎవిడెన్స్ చట్టాన్ని రద్దు చేస్తూ ప్రభుత్వం ప్రతిపాదించిన మూడు బిల్లుల్ని ఆగస్ట్ 11న కేంద్ర హోం మంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రవేశపెట్టారు. ఆ తర్వాత వాటిని 31 మంది సభ్యులతో కూడిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీకి నివేదించారు. ఈ కమిటీ గత వారం తన నివేదికను ఆమోదించింది. ఈ మూడు బిల్లులపై ప్రతిపక్షాలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ తమ అసమ్మతిని తెలియజేశాయి. ఇవి కాపీ-పేస్ట్ బిల్లులని, వీటి రూపకల్పనలో తప్పులు ఉన్నాయని, బిల్లుల్ని తొందరపాటుతో ప్రవేశపెట్టారని విమర్శించాయి.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆగమైపోతాం

- అభివృద్ధిని చూసి ఓటెయ్యండి : రోడ్ షోల్లో మంత్రి హరీశ్‌రావు



నవతెలంగాణ- రెంజల్/మాక్లూర్/కంఠేశ్వర్

గ్యారంటీ పథకాలతో ముందుకు వచ్చిన కాంగ్రెస్.. అధికారంలోకి వస్తే ప్రజలందరూ ఆగమైపోతారని మంత్రి తన్నీరు హరీశ్ రావు స్పష్టం చేశారు. శనివారం నిజామాబాద్ జిల్లా రెంజల్ మండలం సాటాపూర్, మాక్లూర్ మండలం మానిక్ బండార్, నిజామాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన రోడ్ షోల్లో పాల్గొని ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షకీల్ అమీర్ ప్రజల పక్షపాతి అని, సాగునీటి కాలువల ఆధునీకీకరణ కోసం సెంట్రల్ లైనింగ్ పనులు పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు సాగునీటి అందించారన్నారు.

బోధన్, నిజామాబాద్ ఫోర్‌లైన్స్ రోడ్డు మరమ్మతులను రూ.30 కోట్ల వ్యయంతో పూర్తి చేశారని తెలిపారు. జానకంపేట్ నుంచి బాసర వరకు రూ.55 కోట్లతో ఫోర్ లైన్స్ రోడ్డు వేయించారన్నారు. కాంగ్రెస్ నూతన మేనిఫెస్టో తీసుకొచ్చి తెలంగాణ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి ఒక్కరికి రెండు పడకల గదుల నిర్మాణం చేపడతామన్నారు. కర్నాటకలో కాంగ్రెస్ పార్టీకి ఓటువేసి అరిగోస పడుతున్నారన్నారు. కరోనా వచ్చినప్పుడు జీవన్‌రెడ్డి ఇంట్లో లేడని, నా దగ్గరకు వచ్చి వసతులు కల్పించాలని కోరారన్నారు. మంచిగా పనిచేసే జీవన్ రెడ్డిని గెలిపించాలని కోరారు. ప్రలోభాలకు లోబడి ఓటు వేయకూడదని, అభ్యర్థి, పార్టీ చరిత్ర, వారు చేసిన అభివృద్ధిని చూసి ఓటు చేయాలని సూచించారు. నిజామాబాద్ దవాఖానకు సీటీ స్కాన్, క్యాథ్ ల్యాబ్ మందులు వసతులు అన్ని తెచ్చామని, ఆరోగ్య శ్రీ ద్వారా ప్రభుత్వ ఆస్పత్రిలో మోకాలు ఆపరేషన్లు కూడా ఉచితంగా చేస్తున్నామని వివరించారు.

33 రోజులు.. 60 సభలు

- అక్టోబర్ 15 నుంచి నవంబర్ 18 వరకు
- ప్రచారంలో కేసీఆర్ దూకుడు

నవతెలంగాణబ్యూరో- హైదరాబాద్

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి తనదైన శైలిలో ప్రచారం సాగిస్తున్నారు. తెలంగాణలోని దాదాపు సగం నియోజక వర్గాలను ఆయన చుట్టి వచ్చారు. ఎన్నికలకు ముందు ప్రారంభించినట్టే ఈ సారి ఎన్నికల్లో కూడా హుస్నాబాద్ నుంచే ప్రజాఆశీర్వాద సభలకు సీఎం శ్రీకారం చుట్టారు. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 18 వరకు 60 ప్రజాశీర్వాద సభల్లో పాల్గొన్నారు. 33 రోజుల పాటు అప్రతిహతంగా కొనసాగుతున్న సభలు పార్టీలో నూతన ఉత్సాహాన్ని నింపాయని భావిస్తున్నారు ప్రత్యర్థి పార్టీలకు సవాళ్లు విసురుతూ అయన తన దైన శైలిలో ఓటర్లను ఆకర్శించేందుకు ప్రయత్నిస్తున్నారు. 60 ఏండ్లుగా జరగని అభివృద్ధిని పదేండ్లలో చేసి చూపించా మని సీఎం కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు వివరిస్తున్నారు. గత ప్రభుత్వాలకు, బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనకు తేడాలు గుర్తించాలని ప్రతి సభలో ప్రజలకు పిలుపునిస్తున్నారు.

కత్తితో యువతిపై ఉన్మాది దాడి

- తీవ్ర గాయాలపాలైన యువతి
- షాద్‌నగర్‌లో ఘటన



బాధితురాలు



నిందితుడు

నవతెలంగాణ-షాద్‌నగర్

యువతిపై ప్రేమోన్మాది కత్తితో దాడి చేశాడు. తీవ్ర గాయాలపాలైన యువతి ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పరిధిలోని కేశంపేట రోడ్డులో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువతి ఓ దుకాణంలో పనిచేస్తూ జీవనం సాగిస్తోంది. అయితే చాలాకాలం నుంచి తన స్కూల్ స్నేహితుడు తిరుపతి అనే యువకుడితో చనువుగా ఉండేది. ఇద్దరూ తరచుగా ఫోన్లలో మాట్లాడుకునే వారు. అయితే యువతి పనిచేసే షాపు యజమానితో ఎక్కువగా మాట్లాడుతున్నావని, ఎందుకు మాట్లాడతావని ప్రశ్నించాడు. ఈ విషయమై యువతిపై అనుమానం పెంచుకొని సదరు యజమానితో తిరుపతి పలుమార్లు ఆగ్రహంతో మాట్లాడారు. షాప్ యజమాని సైతం ఈ విషయంపై తీవ్రంగా స్పందిస్తూ యువకుడిని హెచ్చరించాడు. ఈ క్రమంలో 15రోజులుగా యువతి పనికి రావడం లేదు. అలాగే తిరుపతితో ఫోన్ మాట్లాడటం మానేసింది. దాంతో ఆగ్రహానికి గురైన తిరుపతి యువతి ఇంటికి వెళ్లి ఆమె బట్టలు ఆరేస్తున్న సమయంలో కత్తితో దాడికి పాల్పడ్డాడు. యువతి ఎడమ చేతిపై నాలుగు చోట్ల కత్తి గాయాలయ్యాయి. తీవ్ర రక్తస్రావంతో విలపిస్తున్న యువతిని స్థానికులు గుర్తించి రావడంతో యువకుడు అక్కడి నుంచి పరారయ్యాడు. తీవ్ర గాయా లతో ఉన్న ఆమెను షాద్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్టు వైద్యులు తెలిపారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

జగిత్యాల ప్రచారంలో ఎమ్మెల్సీ కవితకు అస్వస్థత



నవతెలంగాణ- రాయికల్

జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని ఇటిక్యాలలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ సంజయ్‌కుమార్‌కు మద్దతుగా శనివారం ఉదయం రోడ్ షో నిర్వహిస్తుండగా ప్రచార వాహనంపై నిజామాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ కవిత స్పృహ తప్పి పడిపోయారు. వెంటనే స్పందించిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆమెకు సపర్యలు చేశారు. అక్కడే ఉన్న గ్రంథాలయ సంస్థ చైర్మెన్ డాక్టర్ చంద్రశేఖర్‌గౌడ్ కవితకు ప్రాథమిక చికిత్స అందించారు. అస్వస్థతకు గురైనా వెంటనే తిరిగి ఆమె కోలుకుని ప్రచారంలో పాల్గొన్నారు.

నగరంలో ఆకస్మిక తనిఖీలు

- రూ.14,75,715 నగదు సీజ్ చేసిన పోలీసులు

నవతెలంగాణ-సిటీబ్యూరో


అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రత్యేక చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో హవాలా డబ్బులు, ఎన్నికల్లో ప్రజలను ప్రలోభాలకు గురి చేసేందుకు తీసుకెళ్తున్న నగదు, విలువైన వస్తువులతోపాటు లెక్కకు లేని నల్లడబ్బులు పెద్దఎత్తున పోలీసులకు చిక్కింది. గ్రేటర్ హైదరాబాద్‌లో శనివారం నిర్వహించిన ప్రత్యేక తనిఖీల్లో రూ. 14,75,715లను పోలీసులు సీజ్ చేశారు. ఇప్పటివరకు రూ. 51,54,43,673 నగదును సీజ్ చేశారు. ఎఫ్.ఐ.ఆర్‌లు 9 నమోదు కాగా ఇప్పటి వరకు 764 కేసులు నమోదు చేశారు. ఇప్పటి వరకు లైసెన్స్ ఆయుధాలు 4605 డిపాజిట్ చేశారు. 3439 బైండోవర్ చేయగా, 2343 నాన్ బెయిలబుల్ వారంట్ కేసులు నమోదు చేశారు. 6,254 వాల్ రైటింగ్, 30119 బ్యానర్, 21,616 పోస్టర్లను తొలగించారు. అనుమతి లేకుండా సమావేశాలు నిర్వహించగా 55కేసులను నమోదు చేయగా, 203 లీటర్స్ అక్రమ మద్యం సీజ్ చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కింద సనత్ నగర్‌లో ఒక కేసు నమోదయ్యాయి. స్టాటస్టిక్ సర్విలన్స్ టీం ద్వారా అంబర్‌పేట్ నియోజక వర్గంలో రూ. 21,00,000 విలువైన నగదును సీజ్ చేశారు.

2025 నాటికి

రూ. 40 వేల కోట్ల ఎగుమతులు లక్ష్యం

రూ.1.50 లక్షల కోట్ల సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి

- గరిష్ట స్థాయి నుంచి దిగొస్తున్న ధరలు
- వాల్డ్ స్పైసీ ఆర్గనైజేషన్ చైర్మెన్ రామ్ కుమార్ వెల్లడి



న్యూఢిల్లీ : భారత్‌లో సుగంధ ద్రవ్యాలను విరివిగా వాడటంతో పాటు ఎగుమతులతో భారీ ఆదాయం నమోదవుతుందని వాల్డ్ స్పైసీ ఆర్గనైజేషన్ ఛైర్మన్ రామ్‌కుమార్ మీనన్ అన్నారు. శనివారం హైదరాబాద్‌లో జాతీయ సుగంధ ద్రవ్యాల కాన్ఫరెన్స్ ప్రారంభమైంది. "ఆహార భద్రతా సుగంధ ద్రవ్యాలు - స్థిరమైన ఆదాయానికి ముందుకు వెళ్ళే మార్గం" అను నేపథ్యంలో ఈ సదస్సు జరిగింది. ఈ రంగానికి సంబంధించిన కీలకమైన సమస్యలపై చర్చించారు. కాన్ఫరెన్స్ ప్రారంభోత్సవం అనంతరం రామ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. గతేడాది దేశంలో 10.3 మిలియన్ టన్నుల సుగంధ ద్రవ్యాల ఉత్పత్తి జరిగిందన్నారు. వీటి విలువ రూ.1.50 లక్ష కోట్లుగా ఉందని అంచనా వేశారు. కాగా ఇందులో దాదాపుగా రూ.32 వేల కోట్ల (4 బిలియన్ డాలర్ల) విలువ చేసే ఎగుమతులు జరిగాయ న్నారు. మొత్తం ఉత్పత్తిలో 85 శాతం దేశీయంగా వినియోగించగా.. మిగితా 15 శాతం ఎగుమతులు అవుతున్నాయన్నారు. 2025 నాటికి 5 బిలియన్ డాలర్లు, 2030 నాటికి 10 బిలియన్ డాలర్ల విలువ చేసే ఎగుమతులు చేయాలని తాము లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందుకోసం వ్యాల్యూ యాడెడ్ ఉత్పత్తులపై దృష్టి పెట్టామన్నారు. మరిన్ని రెడీ టు ఈట్, రెడీ టు కుక్‌కు వీలుగా ఉత్పత్తులను ఆవిష్కరించాల్సి ఉందన్నారు. ప్రతీ ఏడాది సగటు ఎగుమతుల వృద్ధి 6 శాతంగా చోటు చేసుకుంటుందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ - ఆగస్ట్ ఎగుమతుల్లోనూ ఆరు శాతం పెరుగుదల చోటు చేసుకుందన్నారు. గతేడాది వాతావరణ సమస్యలతో సుగంద ద్రవ్యాల దిగుబడి తగ్గిందన్నారు. దీంతో జీలకర్ర కిలో ధర ఓ దశలో రూ.250 నుంచి రూ.700కు ఎగిసిందన్నారు. క్రమంగా తగ్గుతూ ప్రస్తుతం రూ.400-500 మధ్య పలుకుతుందన్నారు. మిర్చీ, పసుపు ఉత్పత్తి, ఎగుమతుల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలు కీలక వాటా కలిగి ఉన్నాయన్నారు. పరిశ్రమలోని ప్రతి ఒక్కరికీ మరింత స్థిరమైన ఆదాయానికి అవకాశాలు ఉన్నాయన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ మంత్రిత్వ శాఖకు చెందిన డైరెక్టరేట్ అఫ్ అరేకనట్ అండ్ స్పైస్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ డాక్టర్ హోమి చెరియన్, స్పైసెస్ బోర్డు రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ ఎబి రీమాశ్రీ, ఆ పరిశ్రమ నిపుణులు, రైతులు పాల్గొన్నారు.

రాయల్ ఓక్ 164 స్టోర్లకు విస్తరణ

హైదరాబాద్ : ప్రముఖ ఫర్నిచర్ బ్రాండ్ అయిన రాయల్ ఓక్ ఫర్నిచర్ దేశంలో 164 స్టోర్లకు విస్తరించినట్లు ప్రకటించింది. నాచారంలో తమ కొత్త స్టోర్‌ను తెరవడం ద్వారా ఈ మార్క్‌కు చేరినట్లు పేర్కొంది. నూతన స్టోర్ ప్రారంభోత్సవంలో రాయల్ ఓక్ ఫర్నిచర్ ఛైర్మన్ విజయ్ సుబ్రమణ్యం, ఎండి మథన్ సుబ్రమణ్యం, హోమ్ డెకర్ ఇరినా మోసెస్, తెలుగు రాష్ట్రాల హెడ్ నరేష్ పాల్గొన్నారు. దాదాపు 9వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఈ స్టోర్ లివింగ్ రూమ్‌లు, బెడ్‌రూమ్‌లు, డైనింగ్ రూమ్‌లు విస్తృతమైన ఫర్నిచర్ కలెక్షన్‌ను అందుబాటులో ఉంటాయని ఆ సంస్థ తెలిపింది.



ఒరాఫో జ్యుయల్స్ ఇ-స్టోర్ ఆవిష్కరణ



హైదరాబాద్: వెండి ఆభరణాల బ్రాండు ఒరాఫో జ్యుయల్స్ వచ్చే ఏడాది ఏప్రిల్ లేదా అక్షయ తృతీయ నాటికి మరో ఆరు కొత్త స్టోర్లను తెరువనున్నట్లు ప్రకటించింది. శనివారం హైదరాబాద్‌లో ఒరాఫో జ్యుయల్స్ ఆన్‌లైన్ పోర్టల్ ఇ-స్టోర్‌ను బలగం సినిమా నటీ కావ్య కళ్యాణ్ రామ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ డైరెక్టర్ కళ్యాణ్ రామ్ మీడియాతో మాట్లాడుతూ.. నగరంలో తమకు ప్రస్తుతం మూడు స్టోర్లు ఉన్నాయన్నారు. వచ్చే మూడేళ్లలో దక్షిణాదిలో 25 స్టోర్లకు విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో ఫ్రాంచైజీ పద్దతిలో ఔత్సాహికవేత్తలకు అవకాశం కల్పించనున్నామన్నారు. ఫ్రాంచైజీ అవుట్‌లెట్‌కు రూ.1.2 నుంచి రూ.1.5 కోట్ల పెట్టుబడి అవసరం అవుతుందన్నారు. వచ్చే అక్షయ తృతీయ నాటికి హైదరాబాద్‌లో మరో రెండు, వైజాగ్, రాజమండ్రి, తిరుపతి తదితర నగరాల్లో కొత్త స్టోర్లను ఏర్పాటు చేయనున్నామన్నారు.


బిజినెస్

అమెజాన్ అలెక్సాలో ఉద్యోగులపై వేటు

న్యూయార్క్ : గ్లోబల్ ఐటి కంపెనీల్లో ఉద్యోగాలు గాల్లో దీపంలా మారాయి. దిగ్గజ ఇ-కామర్స్ కంపెనీ అమెజాన్ తన వాయిస్ అసిస్టెంట్ అలెక్సాలో వందలాది మంది ఉద్యోగులపై వేటు వేయాలని నిర్ణయించింది. ఎఐపై దృష్టి సారించడంతో పాటుగా పొదుపు చర్యల్లో భాగంగా సిబ్బందిని తొలగిస్తున్నట్లు అలెక్సా, ఫైర్ టివి విభాగాల వైస్ ప్రెసిడెంట్ డేనియల్ రౌశ్ తెలిపారు. ఇదే విషయమై శుక్రవారం ఆయన ఉద్యోగులకు మెయిల్ చేశారు.

ఖచ్చితమైన సంఖ్య చెప్పనప్పటికీ.. వందలాది మందిని ఇంటికి పంపిస్తున్నట్లు వెల్లడించారు. మారుతున్న వ్యాపార ప్రాధాన్యతల్లో భాగంగా మరింత మెరుగ్గా రాణించే ప్రయత్నంలో కొన్నింటిలో మార్పులు చేపడుతున్నామని లేఖలో పేర్కొన్నారు. తాజా నిర్ణయంతో అమెరికా, కెనడా, భారత్‌లోని ఉద్యోగులపై ఈ ప్రభావం పడనుంది. గడిచిన ఏడాది కాలంలో అమెజాన్ తన వివిధ విభాగాల్లోని దాదాపు 27వేల మంది ఉద్యోగులపై వేటు వేసింది.

ఓపెన్ ఎఐ ప్రెసిడెంట్ రాజీనామా



న్యూయార్క్ : చాట్‌జిపిటి సృష్టికర్త, ఓపెన్ ఎఐ కో-ఫౌండర్, ప్రెసిడెంట్ గ్రిగ్ బ్రాక్‌మన్ ఆ సంస్థకు అనూహ్యంగా రాజీనామా చేశారు. ఓపెన్ ఎఐ సిఇఒ 'శామ్ ఆల్ట్‌మన్‌ను తొలగించిన నేపథ్యంలో బ్రాక్‌మన్ ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.

ఆల్ట్‌మన్ బోర్డులో తీసుకునే నిర్ణయాలకు అతడు అడ్డుపడుతున్నాడని.. సంస్థకు సారథ్యం వహించే సామర్థ్యం లేదని ఆయన్ను తొలగించింది. కాగా.. ఆల్ట్‌మన్‌ను కంపెనీ తొలగించిన కొన్ని గంటల వ్యవధిలోనే బ్రాక్‌మాన్ సోషల్ మీడియాలో తన రాజీనామాను ప్రకటించడం గమనార్హం.

రికార్డు స్థాయిలో ఎన్టీఆర్ స్మారక నాణెం అమ్మకాలు

- మింట్ చైర్మెన్ వీఎస్ఆర్ నాయుడు



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

హైదరాబాద్ మింట్‌లో తయారైన ఎన్టీ రామారావు తొలి స్మారక నాణెం రెండున్నర నెలల్లో 25,000 అమ్ముడుపోవడం దేశంలోనే సరికొత్త రికార్డు అని మింట్ చీఫ్ జనరల్ మేనేజర్ వీఎస్ఆర్ నాయుడు చెప్పారు. శనివారం ఎన్టీఆర్ సెంటినరీ కమిటీ చైర్మన్ టీడీ జనార్దన్ ఏర్పాటు చేసిన సమావేశంలో హైదరాబాద్ మింట్ అధికారులు వీఎస్ఆర్ నాయుడుతోపాటు శ్రీనివాస్ గండపనేడు , తానాజీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయుడు మాట్లాడుతూ దేశంలో స్మారక నాణేల విడుదల 1964 నుంచి ప్రారంభమైందన్నారు. మొదట జవహర్ లాల్ నెహ్రూ , ఆ తరువాత మహాత్మాగాంధీ తదితర మహనీయుల నాణేలను కేంద్రం విడుదల చేయడం జరుగుతున్నదన్నారు. అయితే ఇప్పటి వరకు స్మారక నాణేలలో 12,000 నాణేలు రికార్డు అని , ఆ రికార్డును ఎన్టీఆర్ స్మారక నాణెం బ్రేక్ చేసిందని గుర్తు చేశారు. ఆగష్టు 28న భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నాణేన్ని ఢిల్లీలో విడుదల చేశారనీ, మరుసటి రోజు 29 నుంచే ప్రజలకు అందుబాటులోకి తీసుకు వచ్చామని చెప్పారు. కమిటీ చైర్మెన్ టీడీ .జనార్దన్ మాట్లాడుతూ అన్న ఎన్టీఆర్ పేరుతో ఏ కార్యక్రమం మొదలు పెట్టిన నిర్విఘ్నంగా కొనసాగుతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కంఠంనేని రవిశంకర్ , భగీరథ , విక్రమ్ పూల , దొప్పలపూడి రామ్మోహన్, మండవ సతీష్ పాల్గొన్నారు.

కృష్ణా జలాలతో ప్రజల గొంతు తడిపింది కమ్యూనిస్టులే

ఇబ్రహీంపట్నం పై ఫోకస్

- సీపీఐ(ఎం) మాజీ ఎమ్మెల్యేలు చేసిన అభివృద్ధితోనే ముందుకు..
- రాష్ట్రంలో అత్యధికంగా పేదల భూ పంపిణీ చేసిన చరిత్ర సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్యకు విశేష స్పందన

నవతెలంగాణ రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రజా పోరాటాలకు కంచుకోట ఇబ్రహీంపట్నం. ఎన్నో పోరాటాలు చేపట్టిన ఉద్యమ నేల. సాయుధ పోరాటంలోనైనా.. స్వాతంత్ర్య భారతంలోనైనా ఈ గడ్డపై కమ్యూనిస్టులు చెరగని ముద్ర వేశారు. పేదలకు భూములు పంపిణీ చేశారు. తాగునీటి గోసను తీర్చారు. బీడు భూములకు సాగునీరూ అందించారు. ఇక్కడ ప్రజలు ఎర్రజెండాను గుండెల్లో దాచుకున్నారు. పలు పర్యాయాలు సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించి అసెంబ్లీకి పంపించారు. ఈ సారి కూడా పోరుగడ్డపై సీపీఐ(ఎం) ఫోకస్ పెట్టింది. మళ్లీ గత వైభవాన్ని పునరావృతం చేయడానికి ప్రస్తుత ఎన్నికల బరిలో నిలిచింది. ఇక్కడి నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య పోటీ చేస్తున్నారు. నాడు కమ్యూనిస్టు ఎమ్మెల్యేలు చేసిన పోరాటాలు.. అభివృద్ధే ఎజెండాగా ప్రజల్లోకి వెళ్తున్నారు. ఆయనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది. నిజాం సర్కారు చేతిలో బంధీగా ఉన్న ప్రజలను రక్షించడంలో ఎర్రజెండా అండగా నిలిచింది. 1952లో జరిగి మొదటి ఎన్నికల్లో పీపుల్ డెమొక్రటిక్ పార్టీ బలపర్చిన అభ్యర్థి కే. పాపిరెడ్డి ఘనవిజయం సాధించారు. అనంతరం 1989, 1994లో సీపీఐ(ఎం) అభ్యర్థి కొండిగారి రాములు విజయం సాధించారు. 1999లో టీడీపీ ప్రాతినిధ్యం వహించగా.. 2004లో మరోసారి సీపీఐ(ఎం) అభ్యర్థి మస్కు నర్సింహ గెలుపొందారు. ఈ ప్రాంతంలో కమ్యూనిస్టులు ప్రజలకు చేసిన సేవ మరువలేనిది. రాష్ట్రంలో అత్యధికంగా ప్రభుత్వ భూమి పంపిణీ చేసింది ఈ ప్రాంతంలోనే. ప్రస్తుతం కాంగ్రెస్ నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, బీఆర్ఎస్ నుంచి మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, సీపీఐ(ఎం) నుంచి పగడాల యాదయ్య పోటీలో ఉన్నారు.



అవకాశవాదులను ఓడిద్దాం... ఇబ్రహీంపట్నం ముద్దు బిడ్డ

కమ్యూనిస్టులు ఎమ్మెల్యేలుగా చేసిన అభివృద్ధితోనే ముందుకు..

కమ్యూనిస్టులు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో ఈ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేశారు. కొండిగారి రాములు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన సమయంలో ఈ ప్రాంతంలో భూమిలేని నిరుపేదలకు భూములు పంపిణీ చేసి వ్యవసాయ కూలీలకు రైతులయ్యే అవకాశం కల్పించారు. మస్కు నర్సింహ సమయంలో.. తాగునీటి సమస్యకు స్వస్తి చెప్పడంతో పాటు నాగార్జునసాగర్ రోడ్డు విస్తరించడంలోనూ కీలక భూమిక పోషించారు. నాటి కమ్యూనిస్టులు చేసిన అభివృద్ధే తప్పా తర్వాత గెలిచిన కాంగ్రెస్, టీడీపీ ఎమ్మెల్యేలు చేసిందేమీ లేదని ఇప్పటికీ జనం చర్చించుకుంటున్నారు. ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ సంక్షేమ పథకాల పేరుతో ప్రజల ముందుకు వెళుతున్నారు.

బీడు భూములకు సాగునీరు అందిస్తాం : సీపీఐ(ఎం) అభ్యర్థి పగడాల యాదయ్య

ఇబ్రహీంపట్నంలో ఎర్రజెండాను గెలిపిస్తే కృష్ణా జలాలతో ఈ ప్రాంత బీడు భూములకు సాగు నీరు అందిస్తాం. అసైన్డ్ భూములపై పేదలకు హక్కు కల్పించేందుకు, పీఓటీ భూములు పేదలకు దక్కే విధంగా చేస్తాం. మంచాల, యాచారం ప్రభుత్వ ఆస్పత్రులను అభివృద్ధి చేస్తాం. పరిశ్రమల్లో స్థానికులకు ఉపాధి కల్పించి.. నిరుద్యోగ సమస్యలు పరిష్కరిస్తాం. గ్రామాల్లో ప్రచారం నిర్వహిస్తుంటే ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది.

అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్ల గౌరవ వేతనాల పెంపు

కేరళ ప్రభుత్వ నిర్ణయం...

డిసెంబర్ నుంచి అమలులోకి

తిరువనంతపురం : కేరళలోని అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్ల గౌరవ వేతనాలను డిసెంబర్ నుంచి పెంచాలని వామపక్ష ప్రభుత్వం నిర్ణయించింది. ఈ నిర్ణయంతో 89 వేల మంది లబ్ధిపొందనున్నారు. కేరళ ఆర్థిక శాఖ మంత్రి కెఎన్ బాలగోపాల్ మీడియాతో మాట్లాడుతూ పదేళ్లకుపైగా సర్వీసు ఉన్న అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లకు వెయ్యి రూపాయల చొప్పున వేతనం పెరుగుతుంది. పదేళ్లలోపు అనుభవం ఉన్న వారికి రూ.500 పెరుగుతుంది. ఈ నిర్ణయంతో 62,852 మంది ఉద్యోగులకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి బాలగోపాల్ తెలిపారు. ఆశావర్కర్ల గౌరవ వేతనం రూ.వెయ్యి చొప్పున పెరుగుతుంది. ఈ నిర్ణయంతో 26,125 మంది లబ్ధిపొందనున్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులు, ఆశావర్కర్లకు గౌరవ వేతనాలు పెంచుతామని ఇచ్చిన హామీని కేరళలోని వామపక్ష ప్రభుత్వం డిసెంబర్ నుంచి అమలు చేయాలని నిర్ణయించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

'రెరా' ప్రాజెక్టులే కొనండి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ (టీఎస్‌రెరా) అనుమతి ఉన్న ప్రాజెక్టుల్లోనే వినియోగదారులు పెట్టుబడులు పెట్టాలని ఆ సంస్థ సభ్యులు కే శ్రీనివాసరావు చెప్పారు. కొనుగోలు దారులకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మధ్య పారదర్శకత, జవాబుదారీతనం నెలకొల్పేందుకు 'రెరా' కృషి చేస్తుందన్నారు. హైదరాబాద్ కొండాపూర్ హైటెక్స్ మైదాన్ ఎక్స్‌పో సెంటర్లో 'ది హిందూ' లివింగ్ స్పేసెస్ ఆధ్వర్యంలో రెండ్రోజులు జరిగే ప్రాపర్టీ షోను ఆయన ప్రారంభించారు. రెరా అనుమతి లేకుండా ఎవరూ మార్కెటింగ్, ప్రచారం చేయరాదని తెలిపారు. ప్రాపర్టీ షోల వల్ల ప్రజలకు మెరుగైన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టే అవకాశం లభిస్తుందన్నారు. రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు, ఏజెంట్లు విధిగా 'రెరా'లో రిజిష్టర్ కావాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రాపర్టీ షోలోని స్టాల్స్‌ను ఆయన సందర్శించి, నిర్వాహకుల్ని అభినందించారు. కొనుగోలుదారుల అవగాహన కోసం ఇక్కడ 'రెరా' స్టాల్‌ను కూడా ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు పీ శ్రీకాంత్, రమణారెడ్డి, వినాయక్ శైలేంద్ర తదితరులు పాల్గొన్నారు.

లోక్‌సభలో పెండింగ్‌లో 713 ప్రైవేట్ బిల్లులు

న్యూఢిల్లీ : లోక్‌సభలో 713 ప్రయివేటు మెంబర్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటిలో చాలా వరకు శిక్షాపరమైన నిబంధనలు, ఎన్నికల చట్టాలను సవరించాలని కోరుతున్న బిల్లులే. ఈ బిల్లుల్లో చాలా వరకు ప్రస్తుత లోక్‌సభ ఏర్పడిన జూన్ 2019లో ప్రవేశపెట్టగా, కొన్నింటిని ఈ ఏడాది ఆగస్టులో పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ప్రవేశపెట్టారు. ప్రయివేటు మెంబర్ బిల్లులు ఎంపీలు వారి వ్యక్తిగత హోదాలో ప్రవేశపెట్టినవి. ఒక ప్రయివేట్ బిల్లును తీసుకురావడం లక్ష్యం వారు కొత్త చట్టాలను ప్రవేశపెట్టాలని, ప్రస్తుత చట్టాలలో మార్పులు అవసరమని ప్రదానంగా పేర్కొన్నారు. శుక్రవారం విడుదల చేసిన లోక్‌సభ బులెటిన్ ప్రకారం, లోక్‌సభలో 713 బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎంప్లాయీస్ యూనియన్ నుంచి రాజిరెడ్డి తొలగింపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

టీఎస్ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ (ఈయూ) ప్రధాన కార్యదర్శి కే రాజిరెడ్డిని ఆ పదవి నుంచి తొలగించారు. ఆయన స్థానంలో యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీగా పనిచేస్తున్న ఈదురు వెంకన్నను ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు యూనియన్ అత్యవసర రాష్ట్ర కార్యావర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్టు అధ్యక్షులు ఎస్ బాబు తెలిపారు. శనివారం యూనియన్ కేంద్ర కార్యాలయంలో జరిగిన ఈ సమావేశానికి ఏఐటీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలరాజు, యూసుఫ్, వీఎస్ బోస్, నర్సింహం తదితరులు మాట్లాడారు. జనరల్ సెక్రటరీగా ఉన్న కే రాజిరెడ్డి యూనియన్ నియమ నిబంధనలు పాటించకుండా, ఏ ఫోరంలోనూ చర్చించకుండా ఎల్బీ నగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఎమ్మెల్యేగా నామినేషన్ వేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని చెప్పారు. ఏఐటీయూసీ ప్రాథమిక సభ్యత్వానికి రాజిరెడ్డి స్వచ్ఛందంగా రాజీనామా చేశారనీ, దాన్ని ఆమోదించామని తెలిపారు. యూనియన్ నూతన జనరల్ సెక్రటరీగా ప్రస్తుత డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఈదురు వెంకన్నను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

చెల్లదు - రాజిరెడ్డి

తనను ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పదవి నుంచి తప్పించడం చెల్లదని రాజిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం జరిగిన ఎలాంటి చట్ట బద్ధత లేదన్నారు. 90 మంది రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఉంటే కేవలం 12 మంది మాత్రమే హాజరయ్యారని అభ్యంతరం వ్యక్తం చేశారు. యూనియన్ అధ్యక్షులు ఎస్ బాబు, ఉపాధ్యక్షులు వెంకన్న గౌడ్, డిప్యూటీ జనరల్ సెక్రటరీ ఈదురు వెంకన్నను తానే యూనియన్ నుంచి బహిష్కరిస్తున్నానని చెప్పుకొచ్చారు.

హరితహారం అద్భుతం

- మహారాష్ట్ర ఉన్నతాధికారుల బృందం కితాబు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణకు హరితహారం అద్భుత ఫలితాలు రాబట్టిందని మహారాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ (రెవెన్యూ అండ్ అటవీశాఖ) బీ వేణుగోపాల్ రెడ్డి అన్నారు. ఈ ఫలితాలను అధ్యయనం చేసేందుకు వచ్చిన మహారాష్ట్ర ఉన్నతాధికారుల బృందం హైదరాబాద్ అరణ్య భవన్‌లో రాష్ట్ర అటవీశాఖ అధికారులతో భేటీ అయ్యింది. అటవీ సంరక్షణ ప్రధానాధికారి (పీసీసీఎఫ్, హెచ్ఓఎఫ్ఎఫ్) ఆర్.ఎం.డోబ్రియాల్ మహారాష్ట్ర అధికారులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా హరితహారం ఫలితాలను వివరించారు. రాజకీయ సంకల్పానికి అధికారుల కృషి తోడై ఈ ఫలితాలు సాధించారని మహారాష్ట్ర అధికారులు ప్రశంసించారు. సమావేశంలో మహారాష్ట్ర అదనపు పీసీసీఎఫ్ (ప్లానింగ్, డెవలప్ మెంట్) పీ కళ్యాణ్‌కుమార్, అదనపు పీసీసీఎఫ్ (సోషల్ ఫారెస్ట్రీ) వివేక్ కందేఖర్, తెలంగాణ పీసీసీఎఫ్‌లు ఏలూసింగ్ మేరు, సువర్ణ, ఎం.సీ.పర్గెయిన్, అదనపు పీసీసీఎఫ్ సునీతా భగవత్, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ప్రదీప్ కుమార్ శెట్టి, హరితనిధి ప్రత్యేక అధికారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

దాదాపు రెండేళ్ళ తర్వాత కాశ్మీరీ జర్నలిస్ట్‌కు బెయిల్

న్యూఢిల్లీ : అరెస్టు చేసిన దాదాపు రెండేళ్ల తర్వాత కాశ్మీరీ జర్నలిస్టు ఫహద్ షాకు శుక్రవారం జమ్మూ కాశ్మీర్ హైకోర్టు బెయిల్ మంజూరు చేసింది. తన డిజిటల్ మేగజైన్‌లో 'దేశద్రోహ' వ్యాసాన్ని ప్రచురించడమే అరెస్టుకు కారణం. 2011లో ఈ వ్యాసాన్ని ప్రచురించినందుకు షాపై తీవ్రవాద అభియోగాలు మోపారు. 'బానిస సంకెళ్లు ఛేదించాలి' అనే శీర్షికతో ఆ వ్యాసం ప్రచురితమైంది. ఆ మేగజైన్ ఇప్పుడు మూతపడింది కూడా. కాశ్మీరీ యూనివర్శిటీకి చెందిన ఆలా ఫాజిలి అనే స్కాలర్ ఈ వ్యాసాన్ని రాశారు. ఆయన్ని ఈ కేసులో అరెస్టు చేశారు. 2022 ఏప్రిల్ 4న జమ్మూలోని సిఐజె పోలీసు స్టేషన్‌లో జమ్మూ కాశ్మీర్ దర్యాప్తు సంస్థ ఈ కేసు నమోదు చేసింది. మేగజైన్‌లో వ్యాసం ప్రచురితమైన 11 సంవత్సరాల తర్వాత ఈ కేసు నమోదు చేశారు. గతేడాది మార్చిలో చార్జిషీట్ దాఖలు చేశారు. షాపై నమోదైన ప్రజా భద్రతా చట్టం (పిఎస్ఎ)ను ఈ ఏడాది ఏప్రిల్‌లో హైకోర్టు కొట్టివేసింది. జమ్మూ కాశ్మీర్ యంత్రాంగం ఆయనపై చేసిన ఆరోపణలు కేవలం ఊహాజనితంగా వున్నాయని, పైగా అస్పష్టంగా, అరకొరగా వున్నాయని వ్యాఖ్యానించింది.

శాంతి చర్చలకు చొరవ చూపండి

- గవర్నర్‌కు పది ప్రతిపక్ష పార్టీల వినతి

న్యూఢిల్లీ : మణిపూర్‌లో శాంతి చర్చలకు చొరవ తీసుకోవాలని ఆ రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉయ్‌కేను రాష్ట్రానికి చెందిన పది ప్రతిపక్ష పార్టీలు విజ్ఞప్తి చేశాయి. మణిపూర్‌లో మైతీలు, కుకీల మధ్య నెలకొన్న వివాదాన్ని పరిష్కరించి, శాంతిని నెలకొల్పడానికి ఇరు గ్రూపులతో చర్చలు జరపాలని డిమాండ్ చేశాయి. రాష్ట్రంలోని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని ప్రధానిని కోరాయి. శాంతిభద్రతల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు తీసుకుంటామని గవర్నర్ హామీ ఇచ్చినట్లు రాజ్‌భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. మాజీ ముఖ్యమంత్రి ఇబోబిసింగ్ నేతృత్వంలోని ఈ బృందంలో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆప్, జెడియు, ఎన్‌సిపి, ఫార్వార్డ్ బ్లాక్, శివసేన (ఉద్ధవ్), ఆర్ఎస్‌పి, టిఎంసి పార్టీల నాయకులు ఉన్నారు. ఆరు నెలలుగా అల్లర్లతో అతలాకుతలమవుతున్నా మణిపూర్‌లో కేంద్రం జోక్యం చేసుకోని సంగతి తెలిసిందే.

స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

- ఘనంగా వర్క్‌షాపు ప్రారంభం



హైదరాబాద్ : స్టాన్లీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆధ్వర్యంలో జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజులపాటు (శనివారం వరకు) నిర్వహించబోయే ఈ వర్క్ షాప్‌కు కళాశాల లైబ్రేరియన్ ఎం మాధవి కన్వీనర్‌గా వ్యవహరిస్తున్నారు. గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా వివిధ అంశాలపై ఈ మూడు రోజులపాటు నిపుణులతో ప్రజెంటేషన్లు ఉంటాయని చెప్పారు. శనివారం జరిగిన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథి, వక్తగా ప్రొఫెసర్ ఎస్ సుదర్శన్ రావు (పూర్వ విభాగాధిపతి లైబ్రరీ మరియు సమాచార విభాగము ఉస్మానియా యూనివర్సిటీ) హాజరయ్యారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ ఏ వినయ్ బాబు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సత్యప్రసాద్ లంక గారు, డాక్టర్ కనకదుర్గ (డైరెక్టర్ అకాడమిక్స్ అండ్ ఆడిట్) గారు, డాక్టర్ వి అనురాధ (డైరెక్టర్ స్టూడెంట్స్ సపోర్ట్ సిస్టం), శ్రీ ఏ రమేష్ గారు (అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్) మరియు లైబ్రరీ కమిటీ సభ్యులు హాజరయ్యారు. కళాశాల డీన్ ప్రొఫెసర్ ఏ వినయ్ బాబు గారు మాట్లాడుతూ లైబ్రరీలు జ్ఞాన సముపార్జనకు ఎంతో ఆవశ్యకమని చెప్పారు. గ్రంథాల యోధ్యమం సమాజ అభివృద్ధికి ఎంతో దోహద పడిందని గుర్తుచేశారు. నేడు పుస్తకాలు చదివే అలవాటు దాదాపుగా తగ్గిపోయిందని వాపోయారు. సెల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం వలన పుస్తకాలు చదివే విద్యార్థుల సంఖ్య తగ్గిపోయిందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మధ్యాహ్న భోజనానంతరం రెండు గంటల నుంచి నాలుగు గంటల వరకు రెండవ సెషన్ జరిగింది. ఈ సెషన్‌లో ముఖ్య వక్తగా డాక్టర్ అక్తర్ పర్వేజ్ (లైబ్రేరియన్, మను యూనివర్సిటీ హైదరాబాద్) హాజరయ్యారు. ఈ వర్క్ షాప్ నకు నగరంలోని వివిధ కళాశాలల నుండి లైబ్రరీ స్టాప్ మరియు ఇతర అధ్యాపకులు చురుగ్గా పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిపై ఇజ్రాయిల్ దాడి

- 'ఐసీయూలో ఉన్నవారంతా చనిపోయారు'



గాజాసిటీ: గాజా నగరంలోని అతి పెద్దదయిన అల్ షిఫా ఆసుపత్రిపై ఇజ్రాయిల్ దళాలు శుక్రవారం రాత్రి జరిపిన క్రూరమైన దాడిలో ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో ఉన్న వారంతా చనిపోయారని ఆసుపత్రి డైరెక్టర్ ముహమ్మద్ అబు సల్మియా తెలిపారు. శుక్రవారం నాడు అల్ జజీరాకు సాల్మియా దిగ్భ్రాంతికరమైన వెల్లడి. ఒక్క రాత్రిలో ఆస్పత్రిలో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆసుపత్రి పెద్ద కాన్సంట్రేషన్ క్యాంపుగా, సామూహిక సమాధిగా మారపోయిందని అన్నారు. శుక్రవారం మూడో రోజు కూడా ఇజ్రాయిల్ సైన్యం ఆసుపత్రిలోనే మకాం వేసింది. ఇంధనం, మందులు, ఆహారం లేదా నీరు లేవు. రోగులు, ఆరోగ్య అధికారులు, శరణార్థులు సహా 7,000 మందికి పైగా చిక్కుకున్నారు. ప్రతి నిమిషానికి ఒకరు చనిపోతున్నారు. ఇజ్రాయిల్ చేస్తున్నది యుద్ధ నేరం, అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘించడమే నని అల్-షిఫా డైరెక్టర్ అన్నారు.జబాలియా శరణార్థుల శిబిరంపై ఇజ్రాయిల్ వైమానిక దాడిలో 18 మంది చనిపోయారు. రఫాలోని భవనాలు కూడా బాంబులు వేసి ధ్వంసం చేశారు. నుసైరాత్ శరణార్థుల శిబిరంపై కూడా దాడి జరిగింది. వెస్ట్ బ్యాంక్‌లోని జెనిన్ శరణార్థి శిబిరంపై జరిగిన బాంబు దాడిలో నలుగురు వ్యక్తులు మరణించారు. దక్షిణ గాజాలోని అల్-ఫాలా పాఠశాలపై ఇజ్రాయిల్ బాంబు దాడి చేయడంతో పలువురు మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. 42 రోజుల యుద్ధంలో ఇప్పటివరకు 11,470 మంది గాజన్లు మరణించినట్లు అంచనా.

గాజాలో కాల్పుల విరమణ ప్రకటించాలని ఇజ్రాయిల్‌పై అంతర్జాతీయ ఒత్తిడి పెరగడంతో రోజుకు రెండు ట్రక్కులకు ఇంధనాన్ని అనుమతిస్తామని ప్రకటించారు. హమాస్‌కు అందుబాటులో లేకుండా చూసుకోవాలని మంత్రివర్గం కోరింది. అక్టోబరు 7న యుద్ధం మొదలైన తర్వాత గాజా స్ట్రిప్‌లోకి ఇంధనం చేరడం ఇదే తొలిసారి. నీటి సరఫరా మరియు వ్యర్థ పైపులైన్‌లను నిర్వహించడానికి అవసరమైన ఇంధనం మాత్రమే రఫా సరిహద్దు ద్వారా గాజా స్ట్రిప్‌లోకి రవాణా చేయబడుతుందని ఇజ్రాయిల్ ప్రకటన. గాజాలో కమ్యూనికేషన్ వ్యవస్థ కూడా పూర్తిగా మూతపడింది. గాజాలో ఫీల్డ్ హాస్పిటల్ ప్రారంభించడానికి ఐక్యరాజ్యసమితి సుముఖత వ్యక్తం చేసింది. ఇదిలావుండగా అల్-షిఫా హాస్పిటల్ నుండి స్వాధీనం చేసుకున్న ఆయుధాలుగా చిత్రీకరిస్తూ ఇజ్రాయిల్ సైన్యం విడుదల చేసిన వీడియో నకిలీదని తేలడంతో, మరుసటి రోజు దానిని ఉపసంహరించుకోవాల్సి వచ్చింది. ఇజ్రాయిల్‌లోని బెంజమిన్ నెతన్యాహు ప్రభుత్వం అల్-షిఫా హమాస్ కార్యకలాపాలకు కేంద్రంగా ఉందని చేస్తున్న ప్రచారం ఎంత బూటకమో దీంతో స్పష్టమయింది.

దళితులపై దాడి కేసులో 10 మందికి జైలు శిక్ష

బెంగళూరు : షెడ్యూల్డ్ కులాలకు చెందిన వారిని అవమానించి, వారిపై దాడి చేసి గాయపరచిన ఘటనలో పది మందికి కర్నాటక హైకోర్టు జైలు శిక్ష విధించింది. రెండు నెలల నుండి సంవత్సరం వరకూ నిందితులకు జైలు శిక్షలు పడ్డాయి. అగ్ర కులాలకు చెందిన వారిపై ఫిర్యాదు చేశారన్న ఒకే ఒక కారణంతో తుముకూరు జిల్లా దుండా గ్రామానికి చెందిన వ్యక్తులు దళితులపై దాడికి తెగబడ్డారు. నిందితులందరినీ 2011లో విచారణ కోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టింది. దిగువ కోర్టు తీర్పును తాజాగా హైకోర్టు కొట్టివేసింది. 'నిందితుల విషయంలో ఉదారంగా వ్యవహరించాల్సిన అవసరం లేదు. వారు ఉద్దేశపూర్వకంగానే హరిజన కాలనీలోకి ప్రవేశించారు. ఎస్సీలను విచక్షణారహితంగా వేధించి, వారిపై దాడి చేశారు. ఓ ఘటనలో దళితులు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి నిందితుల్లో ఒకరి పైన ఫిర్యాదు చేయడమే దీనికి కారణం' అని వ్యాఖ్యానించింది. ఆధారాలను సరిగా పరిశీలించకుండానే నిందితులను దిగువ కోర్టు నిర్దోషులుగా విడిచిపెట్టిందని హైకోర్టు తప్పుపట్టింది. అదీకాక తన వద్ద ఉన్న ఆధారాలను సైతం విచారణ కోర్టు తప్పుగా అన్వయించుకుందని వ్యాఖ్యానించింది. అగ్ర కులాలకు చెందిన వారు దళితులు నివసించే కాలనీలో ప్రవేశించి వారిని కులం పేరుతో దూషించారని, వారిపై రాళ్లతో దాడి చేసి గాయపరిచారని పేర్కొంటూ వివిధ సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. శివమూర్తి అనే వ్యక్తికి సంబంధించిన భూమి విషయంలో దళితులు, అగ్ర వర్ణాల మధ్య వివాదం చెలరేగింది. దీనికి సంబంధించి డీఆర్ సందీప్ అనే వ్యక్తిపై దళితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దళితులైనప్పటికీ ధైర్యంతో పోలీసులకు ఫిర్యాదు చేశారని న్యాయమూర్తి జేఎం ఖాజీ ప్రశంసించారు. మొత్తం 11 మందిపై కేసు నమోదు కాగా వారిలో ఓ వ్యక్తి విచారణ మధ్యలో చనిపోయాడు.

ఆర్‌బీఐ మాజీ గవర్నర్

వెంకట రమణన్ కన్నుమూత



చెన్నై: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ ఎస్ వెంకటరమణన్ (92) కన్నుమూశారు. చెన్నైలోని ఆయన నివాసంలో శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమార్తెలు. భార్య గిరిజా వైద్యనాథన్. గతంలో తమిళనాడు చీఫ్ సెక్రటరీగా పనిచేశారు. పూర్వ ట్రావెన్‌కోర్ స్టేట్‌లోని నాగర్‌కోయల్‌లో 1931లో జన్మించిన రమణన్.. 1990 నుంచి 1992 మధ్య ఆర్‌బీఐ గవర్నర్‌గా వ్యవహరించారు. దేశం తీవ్ర ఆర్థిక సవాళ్లు ఎదుర్కొన్న కాలంలో ఆయన గవర్నర్‌గా ఉన్నారు. ఆర్‌బీఐకి గవర్నర్ కాక ముందు 1985 నుంచి 1989 వరకు భారత ప్రభుత్వ ఆర్థిక శాఖ కార్యదర్శిగా పనిచేశారు. భారత్ క్లిష్ట సమయం ఎదుర్కొన్న సమయంలో ఆయన ఆర్‌బీఐకి గవర్నర్‌గా వ్యవహరించారని, ఆయన కాలంలోనే సరళీకరణ ఆర్థిక విధానాలను భారత్ అవలంబించడం ప్రారంభించిందని ఆర్‌బీఐ తన వెబ్‌సైట్‌లో పేర్కొంది.

రాజస్థాన్‌లో పోటా పోటీ ప్రచారం

కాంగ్రెస్, బీజేపీలకు అసమ్మతి నేతల దెబ్బ

- ఇండిపెండెంట్లుగా పలువురు రంగంలోనే!

అత్యంత కీలక రాష్ట్రమైన రాజస్థాన్ శాసనసభా స్థానానికి ఎన్నికలు మరో వారం రోజుల్లో జరగనున్నాయి. ఇక ప్రచారానికి ఐదారు రోజులు మాత్రమే ఉండడంతో ప్రధాన పార్టీల ప్రచారం ఊపందుకుంది. ఇప్పటికే కాంగ్రెస్ తరపున సోనియా, రాహుల్, ఖర్గే, ప్రియాంక, బిజెపి తరపున మోడీ, నడ్డా, అమిత్‌షా వంటి నేతలు విడతల వారీగా ప్రచారం నిర్వహించి రాజకీయ వేడిని పెంచారు. ప్రస్తుతం ఇక్కడ ...అశోక్ గెహ్లాట్ నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుండగా, ఈసారి ఎలాగైనా పాగా వేయాలని బిజెపి ఉవ్విళ్లూరుతోంది. రాజస్థాన్‌లో మొత్తం 200 శాసనసభా స్థానాలకు ఈనెల 25న ఒకే విడతలో పోలింగ్ జరగనున్నది. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 1875 మంది బరిలో ఉన్నారు. వీరిలో 183 మంది మహిళలు. జోత్వారాలో అత్యధికంగా 18 మంది, దౌసా జిల్లా లాల్‌సోట్‌లో ..అత్యల్పంగా.. ముగ్గురు మాత్రమే పోటీలో ఉన్నారు.

సామాజిక తరగతుల ప్రాబల్యం ఎక్కువే !

సామాజిక తరగతుల ప్రాబల్యం ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో రాజస్థాన్ కీలక రాష్ట్రంగా చెప్పవచ్చు. జాట్‌లు, గుజ్జర్లు, రాజ్‌పుత్‌లు, ఎస్సీలు రాష్ట్ర జనాభాలో కీలకంగా ఉన్నారు. ఒకవైపు మోడీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాల ప్రభావం ఈసారి గణనీయంగా ఉండొచ్చని రాజకీయ పరిశీలకులు చెపుతున్నారు. ఏ పార్టీ అయినా వరుసగా రెండోసారి అధికారంలోకి రాదన్న ఆనవాయితీని బ్రేక్ చేయాలని కాంగ్రెస్ భావిస్తుండగా, ఆనవాయితీ కొనసాగి ప్రజలు తమకే పట్టం కడతారని బిజెపి భావిస్తోంది. ప్రత్యేకించి ఫలానా సామాజిక తరగతి వారు తమకే ఎప్పుడూ మద్దతుగా ఉన్నారని పాలక పార్టీలు చెప్పుకుంటున్నా.. అది వాస్తవం కాదు..ఏ సామాజిక తరగతికి చెందిన వారైనా గుంపగుత్తగా బిజెపిని గానీ, కాంగ్రెస్‌ను గానీ ఏకపక్షంగా గెలిపించిన సందర్భాలు లేవు. జాట్‌లు, గుజ్జర్లు, రాజ్‌పుత్‌లు....ప్రధానంగా ..వీరు తమ సామాజిక తరగతికి చెందిన వారే సిఎంగా ఉండాలని, శాసనసభలో అత్యధిక మంది సభ్యులుగా ఉండాలని కోరుకుంటున్నారు. దీనికి అనుగుణంగా ఆయా సామాజిక తరగతులకు చెందిన వారు గత కొన్ని నెలల కాలంలో సభలు నిర్వహించి రాజకీయంగా వత్తిడి తేవడం ప్రారంభించారు. ఉదాహరణకు ...మార్వాడ్, శెఖావట్ ప్రాంతాల్లో ప్రాబల్యం ఎక్కువగా ఉన్న జాట్‌కు చెందిన వారు రాష్ట్ర అసెంబ్లీకి గత ఎన్నికల్లో 42 మంది ఎన్నికయ్యారు. ప్రస్తుతం ఆ సంఖ్యను 50కి పెంచుకోవాలని వారి సభల్లోనే బహిరంగంగానే పిలుపునిచ్చారు.జాట్‌ల కోడలైన వసుంధరారాజేకు ప్రాధాన్యత తగ్గించడం, ఆ సామాజిక తరగతికే చెంది, బిజెపి సిఎం అభ్యర్థిగా ప్రచారంలో ఉన్న సతీష్ పునియాను బిజెపి రాష్ట్ర అధ్యక్షుడి బాధ్యతల నుండి తప్పించడం పట్ల బిజెపి పట్ల ఈ సామాజిక తరగతి వారు వ్యతిరేకంగా ఉన్నారన్న ప్రచారమూ జరుగుతోంది. అలాగే కొంత కాలం ఎన్‌డిఎతో సంబంధాలు నెరపి ...ఆ తరువాత బయటకొచ్చిన రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పి), జననాయక్ జనతాపార్టీ (జేజేపి) ...ఈ సామాజిక ఓట్లను కొంత వరకు బిజెపికి పడకుండా చీల్చవచ్చని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. అలాగే తూర్పు రాజస్థాన్‌ప్రాంతంలోని కరోలి, టోంక్, దౌసా, హిండౌన్ ప్రాంతాల్లో గుజ్జర్ల ప్రభావం గణనీయంగా ఉంది.2018లో సచిన్‌పైలెట్‌ను సిఎం చేస్తారనే ఉద్దేశ్యంతో వారు కాంగ్రెస్ వైపు మొగ్గుచూపారనీ,అయితే ఆ తరువాత డిప్యూటీ సిఎంకే పరిమితం చేసి...ఆ తరువాత దానినీ వెనక్కితీసుకున్నందున....కాంగ్రెస్ పట్ల ఈ సామాజిక తరగతి వారు గుర్రుగా ఉన్నారని చెపుతున్నారు.

రెండు పార్టీలకూ అసమ్మతి బెడద

బిజెపిలోనూ, కాంగ్రెస్‌లోనూ అసమ్మతినేతల ప్రభావం ఈసారి ఆయా పార్టీలపై గణనీయంగా ఉండొచ్చని చెపుతున్నారు. బిజెపి తరపున గత ఎన్నికల్లో ఒకే ఒక ముస్లిం అభ్యర్థికి మాత్రమే పోటీకి అవకాశం కల్పించారు. ఇప్పుడాయనకూ మొండిచేయే చూపించింది. దీంతో....వసుంధర రాజేకు ముఖ్యఅనుచరుడిగా ఉన్న ఆయన ఇండిపెండెంట్‌గా ఈసారి బరిలో ఉన్నారు. అలాగే మాజీ స్పీకర్, బిల్వారా జిల్లాలోని షాపూరా నియోజకవర్గం నుండి ఆరుసార్లు గెలిచిన కైలాష్ మేఘవాల్‌కు సీటు ఇవ్వలేదు. దీంతో ఆయన ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నారు. కేంద్ర మంత్రి అర్జున్‌రామ్ మేఘవాల్‌పై అవినీతి ఆరోపణలు చేసినందుకు ఆయనకు సీటు ఇవ్వలేదనే ప్రచారం జరుగుతోంది.

అశోక్‌గెహ్లాట్‌కు సచిన్‌పైలెట్, ఆయన అనుయాయుల నుండే ఇబ్బంది ఎదురయ్యే పరిస్థితి కన్పిస్తోంది. సిఎం పదవికి సంబంధించి కాంగ్రెస్ అధిష్టానం....నిర్దిష్టమైన హామీ ఇస్తే తప్ప గెహ్లాట్‌కు సచిన్ పూర్తిస్థాయిలో సహకరించే పరిస్థితి లేదు. అలాగే...ఇండిపెండెంట్లుగా రంగంలో ఉండడం లేదా అధికార పార్టీ అభ్యర్థులకు సహకరించని దాదాపు 49 మందిని ఆ పార్టీ ఆరేళ్లపాటు బహిష్కరించింది. తాజా ఎన్నికల్లో రాష్ట్రీయ లోక్ తాంత్రిక్ పార్టీ (ఆర్ఎల్‌పి), జననాయక్ జనతాపార్టీ (జేజేపి)ల ప్రభావం కూడా కొంతవరకు ఉంటుందని రాజకీయ పరిశీలకులు చెపుతున్నారు. 17 స్థానాల్లో . సిపిఎం అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరి తరపున ఇప్పటికే బృందాకరత్, సీతారాం ఏచూరి...వంటి నేతలు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఈ పార్టీకి అసెంబ్లీలో రెండు స్థానాలున్నాయి.

తగ్గుతున్న బిజెపి గ్రాఫ్

బిజెపి గ్రాఫ్ కూడా గత కొన్నేళ్లుగా ఈ రాష్ట్రంలో తగ్గుతోంది. గత సాధారణ ఎన్నికల తరువాత జరిగిన కొన్ని ఉప ఎన్నికల్లో సైతం బిజెపిని ప్రజలు ఓడించారు. నిత్యావసర సరుకుల ధరలు పెరగడం, వ్యవసాయ చట్టాలు తేవడం, మతోన్మాద చర్యలు, మోడీ-అమిత్‌షా ఒంటెద్దు పోకడలు, వసుంధరరాజే మినహా .... బిజెపిని గట్టెక్కించగల రాష్ట్రస్థాయి నేతలు లేకపోవడం ఆ పార్టీని దెబ్బతీయవచ్చని రాజకీయ పరిశీలకులు చెపుతున్నారు.

కాంగ్రెస్‌ను వెంటాడుతున్న అవినీతి

కాంగ్రెస్‌లో సచిన్‌పైలెట్ ...అసమ్మతి నేతగా ఉండి పలుమార్లు బహిరంగంగానే రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై రోడ్డెక్కారు. ఒక దశలో కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెహ్లాట్‌గా నియమించి పరిస్థితులను చక్కదిద్దాలని ఆ పార్టీ అధిష్టానం భావించింది. అయితే అధ్యక్ష పదవితో పాటు ..సిఎంగానూ కొనసాగించాలని గెహ్లాట్ మొండికేయడంతో ఎన్నికల ఏడాదిలో నష్టం జరుగుతుందేమోనని భావించి ...ఆ పార్టీ ..అప్పటికి ఆ అంకాన్ని ముగించింది.

ఇటీవలి కాలంలో మధ్యాహ్న బోజన పథకంలో అవకతవకలు జరిగాయని మంత్రి రాజేంద్రయాదవ్ సహా 9 మంది నేతలు, గెహ్లాట్ కుమారుడు, సోదరుని ఇళ్లపై, కార్యాలయాలపైన ఇడి దాడులు నిర్వహించింది. జలజీవన్ మిషన్‌కు చెందిన 25 ప్రదేశాలపై ఇటీవల దాడులు నిర్వహించింది.

కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతి ప్రధానాంశంగా బిజెపి ప్రచారాస్త్రాన్ని ఉపయోగిస్తోంది. ఏదైమైనా ఈ రాష్ట్రంలో ప్రధాన పార్టీలుగా ఉన్న ఈ రెండింటిలో దేనికి విజయావకాశాలున్నాయో తెలియాలంటే డిసెంబర్ 3 వరకు వేచి చూడాల్సిందే. మిగతా పార్టీలు ఉనికిలో ఉన్నా రాష్ట్రమంతటా ప్రభావం చూపే పరిస్థితి లేదు.



నవతెలంగాణ మారో తీన్‌మార్



వదలొద్దు ఈ కప్పు

- ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్ నేడు
- మూడో టైటిల్‌పై ఆతిథ్య భారత్ గురి
- ఆరో ట్రోఫీ రేసులో ఆస్ట్రేలియా
- మధ్యాహ్నం 2 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

అహ్మదాబాద్ మొతెరా మైదానం. 1.30 లక్షల మంది అభిమానులు. బరిలో 21వ శతాబ్దపు అత్యుత్తమ జట్లు. లక్ష్యం ఐసీసీ ప్రపంచకప్ టైటిల్. ఆతిథ్య భారత్ మూడోసారి ఈ కప్పు కొట్టాలని తలపిస్తుండగా, ఆసీస్ ఏకంగా సిక్సర్ కొట్టేందుకు ఉవ్విళ్లూరుతోంది. ఓటమెరుగని జైత్రయాత్రతో ఫైనల్లో ఫేవరేట్‌గా భారత్ నిలువగా.. ఈ టోర్నీల్లో విజయం సాధించటం తెలిసిన ఆసీస్ మరోవైపు. భారత్, ఆస్ట్రేలియా ఐసీసీ 2023 ప్రపంచకప్ ఫైనల్ నేడు.

అంతిమ సమరానికి రంగం సిద్ధమైంది. అజేయ జట్టు ఆతిథ్య భారత్ సొంత అభిమానుల నడుమ దేశం గర్వపడే ప్రదర్శన చేయాలని చూస్తోంది. 120 కోట్ల భారతీయుల గుండె చప్పుడు నేడు మొతెరాలో వినిపిండనుండగా.. ముచ్చటగా మూడోసారి కప్పు కొట్టాలని రోహిత్‌సేన తహతహ లాడుతోంది. ప్రపంచకప్‌లో పది మ్యాచుల్లో ఎదురులేని విజయాలు సాధించిన టీమ్ ఇండియా నేడు 11వ గెలుపుతో ప్రపంచకప్ ట్రోఫీకి చేరువయ్యేందుకు ఎదురు చూస్తోంది.

ఐసీసీ ట్రోఫీలు నెగ్గటం ఎరిగిన జట్టు ఆస్ట్రేలియా. ఐదుసార్లు ప్రపంచకప్ సాధించిన ఆసీస్ ఇటీవల టీ20 ప్రపంచకప్‌ను సైతం సొంతం చేసుకుంది. కంగారూల స్థాయికి తగ్గ ప్రదర్శనతో ఫైనల్‌కు చేరకపోయినా.. టైటిల్ పోరులో బరిలో నిలిచింది అరివీర భయంకర ఆస్ట్రేలియా. ఆఖరు బంతి వరకు పోరాడటం తెలిసిన పాట్ కమిన్స్ నేడు టీమ్ ఇండియా అత్యంత కఠిన ప్రత్యర్థి.

నవతెలంగాణ-అహ్మదాబాద్

అదే జోరు.. రెట్టించిన ప్రేరణ : ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా ప్రశాంతత బాగా కలసొచ్చింది. నేడు టైటిల్ పోరు భావన అదనపు ఒత్తిడి దరిచేరకుంటే రోహిత్‌సేన ఓ మెట్టు ఎక్కినట్టే. బ్యాటింగ్ లైనప్‌లో అందరూ మంచి ఫామ్‌లో ఉన్నారు. కెప్టెన్ రోహిత్ శర్మ నిస్వార్థ ఆటతీరుతో ఆకట్టుకుంటున్నాడు. శుభ్‌మన్ గిల్ కీలక సమయంలో తనదైన ధాటి చూపిస్తున్నాడు. విరాట్ కోహ్లి పది ఇన్నింగ్స్‌లో ఏకంగా ఎనిమిది 50 ప్లస్ స్కోర్లు సాధించాడు. వాంఖడేలో చారిత్రక 50వ వన్డే సెంచరీతో భీకర ఫామ్‌లో ఉన్నాడు. టాప్-3 దండయాత్రకు శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ తోడయ్యారు. అయ్యర్ సిక్సర్ల మోత మోగిస్తుండగా, రాహుల్ సరికొత్త పంథాలో చెలరేగుతున్నాడు. టాప్-5 బ్యాటర్ల మెరుపులతో అదనపు బ్యాటర్ సూర్యకుమార్ యాదవ్ అవసరం ఇప్పటివరకు రాలేదు. నేడు ఆ అవసరం ఏర్పడినా.. సూర్య కుమార్ సిద్ధంగానే ఉన్నాడు. మహ్మద్ షమి ఆరు మ్యాచుల్లోనే 23 వికెట్లు పడగొట్టి ఔరా అనిపించాడు. బుమ్రా, సిరాజ్ తోడుగా షమి నిప్పులు చెరుగుతున్నాడు. ఈ పేస్ త్రయాన్ని ఎదురించి ఏ టాప్ ఆర్డర్ నిలువలేదు. కుల్దీప్, జడేజా మాయజాలం సైతం మ్యాజిక్ షో తరహాలో నడుస్తోంది. సమిష్టిగా రాణిస్తున్న టీమ్ ఇండియాకు ప్రపంచకప్ ట్రోఫీ ప్రేరణ తోడైతే నేడు ప్రత్యర్థి నిలువగలదా?!

చరిత్ర తోడుగా..ఆసీస్: కంగారూలకు ప్రపంచకప్ ఆరంభం కలిసి రాలేదు. తొలి రెండు మ్యాచుల్లో ఓటములు. కానీ ఆ తర్వాత ఆ జట్టు పుంజుకుంది. వరుసగా ఎనిమిది విజయాలు సాధించింది. ఓటమి తథ్యమనుకున్న మ్యాచుల్లోనూ అసమాన విజయాలు సాధించి ఆశ్చర్యపరిచింది. తాజాగా ఫైనల్లోనూ ఆ జట్టును తక్కువ అంచనా వేస్తుండగా.. అందరికీ షాక్ ఇచ్చేందుకు సమాయత్తం అవుతోంది. స్మిత్, లబుషేన్ అంచనాలను అందుకోలేదు. వార్నర్, హెడ్ దూకుడులో నిలకడ లేదు. మాక్స్‌వెల్ మెరుపులు పరిమితమే. బంతితోనూ కమిన్స్, స్టార్క్, హాజిల్‌వుడ్ స్లో పిచ్‌పై ఏమాత్రం ప్రభావం చూపిస్తారో తెలియని అనిశ్చితి. అయినా, ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్స్‌లో ఒత్తిడిని ఎదుర్కొనే అలవాటు ఆసీస్ సొంతం. గత చరిత్ర తోడుగా నేడు టైటిల్ పోరులో ఆస్ట్రేలియా విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.

ఎక్స్ ఫ్యాక్టర్ 'పవర్‌ప్లే'

ప్రపంచకప్ ఫైనల్ ఫలితాన్ని పవర్‌ప్లే (తొలి పది ఓవర్లు) శాసించనుంది. 2023 ప్రపంచకప్‌లో పవర్‌ప్లేలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన రెండు జట్లు టైటిల్ పోరుకు చేరుకున్నాయి. తొలి పది ఓవర్ల దూకుడులో టీమ్ ఇండియా ముందుండగా.. ఆస్ట్రేలియా రెండో స్థానంలో ఉంది. బ్యాట్‌తో, బంతితో భారత్ తొలి పది ఓవర్లు అదరగొట్టింది. పవర్‌ప్లేలో భారత బ్యాటర్లు 6.78 రన్‌రేట్‌తో పరుగులు సాధించగా, బౌలర్లు 4.34 ఎకానమీతో కట్టడి చేశారు. ఆస్ట్రేలియా బ్యాటర్లు 6.55 రన్‌రేట్‌తో మెరువగా.. బౌలర్లు 4.75 ఎకానమీ సాధించారు. భారత కెప్టెన్ రోహిత్ శర్మ పవర్‌ప్లేలో అత్యంత విధ్వంసక బ్యాటర్‌గా నిలువగా.. ఆ తర్వాతి స్థానంలో ఆసీస్ ఓపెనర్ ట్రావిశ్ హెడ్ నిలిచాడు. ఇటు భారత్‌కు, అటు ఆసీస్‌కు ఈ ఇద్దరిని పవర్‌ప్లేలోనే నిలువరించటం ప్రధానం కానుంది. ఈ ఇద్దరిలో ఎవరైనా పవర్‌ప్లేలో దాటేసి వచ్చారంటే.. అప్పటికే ఆ జట్టు మానసికంగా పైచేయి సాధించినట్టే లెక్క.



గుజరాత్‌లోని చారిత్రక మెట్లబావి వద్ద ఐసీసీ ప్రపంచకప్ ట్రోఫీతో రోహిత్ శర్మ, పాట్ కమిన్స్



గ్రూప్ దశ ఐదో మ్యాచ్ నుంచి భారత జట్టులో మార్పులు లేవు. నేడు ఫైనల్లోనూ అదే ట్రెండ్ కొనసాగే వీలుంది. ప్రత్యర్థి ఆసీస్ కావటంతో రవిచంద్రన్ అశ్విన్‌ను తీసుకునే యోచన ఉన్నప్పటికీ.. ఇద్దరు సీమర్లతో బరిలో దిగటం సైతం ప్రమాదకరమే. ఆస్ట్రేలియా సైతం తుది జట్టులో మార్పులపై ఆలోచన చేస్తోంది. మార్నస్ లబుషేన్ స్థానంలో మార్కస్ స్టోయినిస్‌ను ఎంచుకునేందుకు మొగ్గు చూపుతోంది. కానీ స్లో పిచ్‌పై లబుషేన్ బ్యాటింగ్ నైపుణ్యం ఆసీస్‌కు అవసరం. దీంతో సెమీస్‌లో ఆడిన జట్లతోనే ఇరు జట్లు టైటిల్ పోరుకు సిద్ధం కానున్నాయి.

తుది జట్లు (అంచనా)

భారత్ : రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లి, శ్రేయస్ అయ్యర్, కెఎల్ రాహుల్ (వికెట్ కీపర్), సూర్యకుమార్ యాదవ్, రవీంద్ర జడేజా, మహ్మద్ షమి, జశ్‌ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్.

ఆస్ట్రేలియా : డెవిడ్ వార్నర్, ట్రావిశ్ హెడ్, మిచెల్ మార్ష్, స్టీవ్ స్మిత్, మార్నస్ లబుషేన్, గ్లెన్ మాక్స్‌వెల్, జోశ్ ఇంగ్లిశ్ (వికెట్ కీపర్), మిచెల్ స్టార్క్, పాట్ కమిన్స్ (కెప్టెన్), ఆడం జంపా, జోశ్ హాజిల్‌వుడ్.

టాస్ నెగ్గు.. 'ట్రోఫీ' ఛేదించు!

స్లో వికెట్, ప్రపంచకప్ ఫైనల్ ఒత్తిడి. అదుపు చేయలేని భావోద్వేగాలు. ఈ పరిస్థితుల్లో ఊరించే లక్ష్యాన్ని సైతం ఛేదించటం కష్టం అని చెబుతుంటారు. కానీ ప్రపంచకప్ విజేతగా నిలవాలంటే టైటిల్ పోరులో లక్ష్యాన్ని ఛేదించాల్సిందే!. గత మూడు ప్రపంచకప్ ఫైనల్స్ చెబుతున్న గెలుపు రహస్యం ఇదే. 2011, 2015, 2019 ప్రపంచకప్ ఫైనల్స్‌లో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన జట్లే విజయాలు సాధించాయి. ఈ మూడు ప్రపంచకప్‌లను ఆతిథ్య జట్లే నెగ్గటం మరో విశేషం. నేడు అహ్మదాబాద్‌లోనూ టాస్ నెగ్గి తొలుత బౌలింగ్ ఎంచుకోవటమే విజయానికి దగ్గరి దారి అవనుంది.

గత ప్రపంచకప్ ఫైనల్స్ గణాంకాలే కాదు అహ్మదాబాద్ గ్రౌండ్ రికార్డులు సైతం ఛేదనకే ఓటేస్తున్నాయి. ఇక్కడ జరిగిన ప్రపంచకప్ గ్రూప్ దశలో నాలుగు మ్యాచులు జరుగగా.. మూడింట రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేసిన జట్టు గెలుపొందింది. ఇక్కడ జరిగిన రెండు ఐపీఎల్ ఫైనల్స్‌లోనూ తొలుత బ్యాటింగ్ జట్టుకు ఓటమి తప్పలేదు. ఎండ బాగా కాసిన సమయంలో బ్యాటింగ్ కాస్త కఠినం. అదే రెండో ఇన్నింగ్స్‌లో బంతి మెత్తబడి పరుగులు సులువుగా వస్తాయి. ఆసీస్ తొలుత బ్యాటింగ్ చేయాల్సి వస్తే ఆ జట్టు ఓటమి ఖారారైనట్టే. కానీ టీమ్ ఇండియా తొలుత బ్యాటింగ్ చేసినా తక్కువ అంచనా వేయలేని పరిస్థితి. ప్రపంచకప్‌లో సెమీస్ సహా పది మ్యాచులు ఆడిన ఆతిథ్య భారత్ ఛేదనను సగటు 64.4 బంతులు మిగిలి ఉండగానే పూర్తి చేయగా.. తొలుత బ్యాటింగ్ చేస్తే సగటున 175 పరుగుల తేడాతో విజయాలు సాధించింది.

పిచ్, వాతావరణం

భారత్, పాకిస్థాన్ గ్రూప్ దశ మ్యాచ్ జరిగిన పిచ్‌నే ఫైనల్‌కు సిద్ధం చేశారు. పాకిస్థాన్ 191 పరుగులకే కుప్పకూలగా, 30.3 ఓవర్లలోనే భారత్ లాంఛనం ముగించింది. ఫైనల్లో మరీ స్వల్ప స్కోర్లు నమోదు కాకపోయినా.. 320 పైచిలుకు స్కోరు గెలుపు దీమా ఇవ్వగలదు. భారత్, ఆసీస్ టైటిల్ పోరుకు ఎటువంటి వర్షం సూచనలు లేవు. కానీ రెండో ఇన్నింగ్స్‌కు మంచు ప్రభావం ఉండనుంది. మంచు ప్రభావాన్ని తగ్గించేందుకు గ్రౌండ్ పచ్చికపై రసాయనాలు సైతం వాడారు.

ఇది గేమ్ ప్లాన్!

మహ్మద్ షమి భారత బౌలింగ్ దాడి మొదలుపెట్టనున్నాడు. ఆసీస్ ఓపెనర్లు హెడ్, వార్నర్ ఇద్దరూ ఎడమ చేతి బ్యాటర్లు. లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్లపై ప్రతి ఏడు బంతులకు ఓ వికెట్ కూల్చిన రికార్డు షమి సొంతం. ఈ ప్రపంచకప్‌లో ఎడమ చేతి వాటం బ్యాటర్లకు 52 బంతులు సంధించిన షమి 32 పరుగులకే ఎనిమిది వికెట్లు పడగొట్టాడు. జశ్‌ప్రీత్ బుమ్రాకు వార్నర్, హెడ్‌పై మంచి రికార్డు లేదు. దీంతో షమి, సిరాజ్ రెండు కొత్త బంతులతో వికెట్‌కు ఇరువైపులా ఎదురుదాడి చేయనున్నారు. మిడిల్ ఓవర్లలో రవీంద్ర జడేజా, కుల్దీప్ యాదవ్ కీలకం. జడేజా ఈ ఓవర్లలో 4.25 ఎకానమీ సాధించగా, అందులో కుడి చేతి బ్యాటర్లపై 4.18తో మరింత మెరుగు. ఆసీస్‌లో నం.3 నుంచి నం.7 వరకు అందరూ రైట్ హ్యాండ్ బ్యాటర్లే. కుల్దీప్ యాదవ్ ఎకానమీ 4.32 కాగా సగటు 24.53. ఆసీస్ ఓపెనర్లలో ఎవరు పవర్‌ప్లే దాటి వికెట్ నిలుపుకున్నా.. తొలుత బంతి అందుకునేది కుల్దీప్ యాదవే. మిడిల్ ఓవర్లతో పాటు డెత్ ఓవర్లలో జశ్‌ప్రీత్ బుమ్రా బ్రహ్మాస్త్రం ఉండనే ఉంది. స్టీవ్ స్మిత్ వర్సెస్ జడేజా.. గ్లెన్ మాక్స్‌వెల్ వర్సెస్ కుల్దీప్ ఆసక్తికరం.

రోహిత్ శర్మకు లెఫ్ట్ ఆర్మ్ సీమర్లను ఎదుర్కొవటంలో కాస్త బలహీనత. వన్డే కెరీర్‌లో 22 సార్లు వారికే వికెట్ కోల్పోయాడు. ఆ బలహీనత సొమ్ముచేసుకునేందుకు మిచెల్ స్టార్క్ ఎదురు చూస్తున్నాడు. బంతి స్వింగ్ అయితే స్టార్క్‌కు అనుకూలత, లేదంటే రోహిత్ శర్మ పవర్‌ప్లేలోనే పవర్‌ఫుల్‌గా దండయాత్ర చేయటం ఖాయం. విరాట్ కోహ్లికి హాజిల్‌వుడ్ సవాల్ విసురుతున్నాడు. గతంలో షార్ట్ బాల్స్‌తో కోహ్లిని ఇరకాటంలో పెట్టిన రికార్డు అతడికి ఉంది. అయితే, హాజిల్‌వుడ్‌పై పరుగులు పిండుకోకుండా కోహ్లి ఎప్పుడూ వికెట్ పారేసుకోలేదు. మిడిల్ ఆర్డర్‌లో శ్రేయస్ అయ్యర్‌ది ఆసీస్ స్పిన్నర్ ఆడం జంపాపై తిరుగులేని పైచేయి. ఇన్నింగ్స్ ప్రతి దశలో ఓ ఎండ్‌లో స్ట్రయిక్ రొటేషన్ చేస్తుండగా.. మరో ఎండ్‌లో విధ్వంస రచన ఉండనుంది. రోహిత్, శ్రేయస్, రాహుల్, సూర్య కుమార్‌ల బాధ్యత ధనాధన్ కాగా.. శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లిలది ఇన్నింగ్స్ ఆఖరు వరకూ ఓ ఎండ్‌లో నిలిచి ఇన్నింగ్స్‌ను నడిపించటం. ప్రపంచకప్ పది మ్యాచుల్లో విజయవంతమైన ఈ వ్యూహం ఇంకొక్క సారి క్లిక్ అయితే.. కప్పు భారత్ సొంతమవనుంది.

నవచిత్రం

స్పార్క్‌కి పాటిజివ్ టాక్



విక్రాంత్, రుక్సర్ ఢిల్లాన్

విక్రాంత్, మెహరీన్, రుక్సర్ ఢిల్లాన్ హీరో, హీరోయిన్లుగా రూపొందిన చిత్రం 'స్పార్క్ లైఫ్'. విక్రాంత్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించటమే కాకుండా ఈ చిత్రానికి కథ, స్క్రీన్ ప్లే కూడా అందించారు.

డెఫ్ ఫ్రాగ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై నిర్మితమైన ఈ సినిమా శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది.

మంచి టాక్‌తో సినిమా రన్ అవుతున్న సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హీరోయిన్ రుక్సర్ ఢిల్లాన్ మాట్లాడుతూ, 'మా 'స్పార్క్' మూవీ సక్సెస్‌లో భాగమైన ప్రతీ ఒక్కరికీ థ్యాంక్స్. హీరో విక్రాంత్‌కి అభినందనలు ఎక్కువగా వస్తున్నాయి. ఎందుకంటే ఇదొక ఎక్స్‌పెరిమెంట్ మూవీ. నేను సంధ్య థియేటర్‌లో ఆడియెన్స్‌తో కలిసి సినిమా చూశాను. అందరికీ ఓ డిఫరెంట్ ఫీలింగ్ కలిగింది. కొత్త కంటెంట్‌ను ప్రేక్షకులు ఆదరిస్తారని మరోసారి ప్రూవ్ అయ్యింది' అని తెలిపారు.

హీరో విక్రాంత్ మాట్లాడుతూ, "మా స్పార్క్ మూవీ థియేటర్స్‌లో విడుదలైంది. మంచి రెస్పాన్స్ వస్తుంది. సంధ్య థియేటర్‌లో ఆడియెన్స్‌తో కలిసి సినిమా చూశాను. సినిమాలో సాంగ్స్, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్, పెర్ఫామెన్స్‌లు, యాక్షన్ సీక్వెన్సులు అన్నీ నచ్చుతున్నాయి. సినిమా చూసిన వారందరూ పాజిటివ్‌గా స్పందిస్తున్నారు. యూనిట్‌ను అభినందిస్తున్నారు. ముఖ్యంగా సెకండాఫ్‌లోని చివరి 20 నిమిషాలకు సూపర్బ్ రెస్పాన్స్ వస్తుంది. సుహాసిని, గురు సోమసుందరం క్యారెక్టర్స్‌లో ఉండే ట్విస్టులను ఊహించలేకపోతున్నారు. కంప్లీట్ ఎంటర్‌టైనర్. అన్నీ ఎలిమెంట్స్‌తో కంప్లీట్ మూవీగా ఈ సినిమా అందర్నీ మెప్పిండం ఆనందంగా ఉంది. హేషమ్ వండర్‌ఫుల్ మ్యూజిక్, బీజీఎం ఇచ్చారు. వీటిపై ఆడియెన్స్ పాజిటివ్‌గా రియాక్ట్ అవుతున్నారు' అని అన్నారు.

కార్తీక్ రాజు నయా సినిమా హస్తినాపురం



నిషా, కార్తీక్‌రాజు, భీమనేని శ్రీనివాసరావు

హీరో కార్తీక్ రాజు నటించిన 'అథర్వ' రిలీజ్‌కు సిద్ధంగా ఉండగానే.. మరో చిత్రాన్ని పట్టాలెక్కించారు. కాసు క్రియేషన్స్ బ్యానర్ పై కాసు రమేష్ నిర్మిస్తున్న చిత్రం 'హస్తినాపురం'.

కార్తీక్ రాజు హీరోగా రాజా గంధ్రోతు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమా తాజాగా ఫిల్మ్ నగర్ దైవసన్నిధానంలో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. తొలి సన్నివేశానికి భీమనేని శ్రీనివాసరావు క్లాప్ కొట్టగా, నిర్మాత వంశీ నందిపాటి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. దర్శకుడు వి.ఎన్.ఆదిత్య స్క్రిప్ట్ అంద జేశారు.

ఈ సందర్భంగా నిర్మాత కాసు రమేష్ మాట్లాడుతూ, 'కార్తీక్ రాజు వద్ద మేకప్ మెన్, మేనేజర్‌గా ఉండేవాడ్ని. ఆయన నన్ను నిర్మాతను చేశారు. మా డైరెక్టర్ రాజా వివి వినాయక్ వద్ద అసిస్టెంట్‌గా పని చేశారు. కథలో దమ్ముంది కాబట్టే నిర్మిస్తున్నాం. మా చిత్రాన్ని ఆదిరించండి' అని అన్నారు. 'హస్తినాపురం కొత్త పాయింట్‌తో రాబోతోంది. రెగ్యులర్ చిత్రంలా ఉండదు. మా డైరెక్టర్ అద్భుతంగా కథ రాసుకున్నారు. మా మ్యూజిక్ డైరెక్టర్ అనుదీప్ ఆల్రెడీ హనుమాన్ సాంగ్‌తో ట్రెండింగ్‌లో ఉన్నారు' అని హీరో కార్తీక్ రాజు చెప్పారు. మ్యూజిక్ డైరెక్టర్ అనుదీప్ మాట్లాడుతూ, 'రాజా ఓ మంచి కథతో రాబోతున్నారు. కార్తీక్ రాజుతో నాకు ఇది రెండో చిత్రం. ఈ చిత్రానికి పని చేయడం ఆనందంగా ఉంది. నాకు అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు థ్యాంక్స్' అని అన్నారు.

'హస్తినాపురం అనే టైటిల్ వినగానే ఎంత పాజిటివిటీ ఉందో.. సినిమా కూడా అంతే ఉంటుంది. నా గురువు వినాయక్ గారి దగ్గర పని చేశాను. మంచి కథ, మంచి టీంతో రాబోతున్నాం. మా అందరినీ ఆదరిస్తారనే నమ్మకంతో ఉన్నాను' అని దర్శకుడు రాజా గంధ్రోతు చెప్పారు.

హీరోయిన్ నిషా మాట్లాడుతూ, తెలుగులో మళ్లీ సినిమాను చేస్తుండటం ఆనందంగా ఉంది. ఇలాంటి డిఫరెంట్ మూవీలో భాగస్వామి అయినందుకు సంతోషంగా ఉంది' అని తెలిపారు.

భిన్న పాత్రలతో అగ్లీ స్టోరీ



బెక్కెం వేణుగోపాల్



అవికాగోర్, నందు, ప్రణవ స్వరూప్

'సినిమా చూపిస్త మామ, మేము వయసుకు వచ్చాం, హుషారు' లాంటి యూత్ ఫుల్ ఎంటర్‌టైనర్స్‌ని నిర్మించిన లక్కీ మీడియా అధినేత బెక్కెం వేణుగోపాల్ తాజాగా నూతన దర్శకుడు ప్రణవ స్వరూప్‌తో ఓ రొమాంటిక్ థ్రిల్లర్ చేయబోతున్నారు. రియా జియా ప్రొడక్షన్స్ అనే కొత్త బ్యానర్‌తో కలిసి ఆయన చేస్తున్న ఈ చిత్రంలో నందు హీరోగా నటిస్తుండగా, అవికా గోర్ ప్రధాన పాత్రలో కనిపించబోతున్నారు.

బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ, 'ఈ కథ విభిన్నమైన పాత్రలతో ఆద్యంతం ప్రేక్షకులని కట్టిపడేసేలా ఉంటుంది. కథానుగుణంగా ఈ చిత్రానికి 'అగ్లీ స్టోరీ' అని టైటిల్‌ని ఫిక్స్ చేశాం. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో సినిమాని రిలీజ్ చేస్తాం' అని తెలిపారు. ఈ చిత్రానికి నిర్మాతలు: బెక్కెం వేణుగోపాల్, సి హెచ్. సుభాషిణి, కొండా లక్ష్మణ్, కథ, సహ నిర్మాతలు : రాజ్, అశ్వనీ శ్రీకృష్ణ.

సీట్ ఎడ్జ్ థ్రిల్లర్



రాహుల్ విజయ్

రాహుల్ విజయ్, శివాని రాజశేఖర్ లీడ్ రోల్స్‌లో దర్శకుడు తేజ మార్ని తెరకెక్కించిన చిత్రం 'కోట బొమ్మాళి పీఎస్'. శ్రీకాంత్, వరలక్ష్మీ శరత్ కుమార్ కీలకపాత్రలు పోషించారు. గీతా ఆర్ట్స్ 2 బ్యానర్‌పై బన్నీ వాస్, విద్యా కొప్పినీడి నిర్మించారు.

ఈనెల 24న సినిమా విడుదలవుతున్న సందర్భంగా రాహుల్ విజయ్ మీడియాతో మాట్లాడుతూ, 'మంచి కథ కోసం చూస్తున్న సమయంలో గీతా ఆర్ట్స్ నుంచి కాల్ రావడం ఆశ్చర్యపోయాను. 'నాయట్టు' చిత్రంలో నుంచి పాయింట్ మాత్రమే తీసుకొని మిగతాదంతా తెలుగు నేటివిటీకి తగ్గట్టుగా మార్పులు చేశారు. శ్రీకాకుళంలో ఉన్న కోటబొమ్మాళి ఊరిలో ఉన్న పోలీస్ స్టేషన్లో ఏం జరిగిందనేది మెయిన్ కాన్సెప్ట్. కానిస్టేబుల్ రవి పాత్రలో నటించాను. ఎస్‌ఐ రామకృష్ణగా శ్రీకాంత్ కనిపిస్తారు. దేశంలో ఉన్న రాజకీయ పరిస్థితులను ఇందులో చూడొచ్చు. తేజ మార్ని క్లారిటీ ఉన్న దర్శకుడు. స్క్రీన్ ప్లే రేసీగా, సీట్ ఎడ్జ్ థ్రిల్లర్‌గా ఉంటుంది. చివరి అరగంట చాలా ఎమోషనల్‌గా కూడా ఉంటుంది. వరలక్ష్మి శరత్ కుమార్ సెట్‌లో చాలా చిల్‌గా ఉంటారు. ఆమె చాలా ఇంటెన్స్ పెర్ఫార్మర్. 'లింగిడి లింగిడి..' సాంగ్‌కు ఇంత హ్యూజ్ రెస్పాన్స్ వస్తుందని ఊహించలేదు. ఈ పాట వల్లే సినిమాకు మరింత బజ్ వచ్చింది. యూనిక్ పాయింట్‌తో బ్యూటిఫుల్ ఎమోషన్స్‌తో రాబోతున్న ఈ చిత్రం ప్రతి ఒక్కరికీ నచ్చుతుంది. గీతా ఆర్ట్స్ సంస్థలో నాన్న (విజయ్) అసిస్టెంట్ ఫైటర్‌గా, ఫైట్ మాస్టర్‌గా వర్క్ చేశారు. అదే సంస్థలో నేను హీరోగా చేయడాన్ని ఆయన హ్యాపీగా ఫీలయ్యారు. నాకు కూడా ఇది గ్రేట్ ఎక్స్పీరియన్స్. ఈ సినిమా నా కెరియర్‌కు చాలా ప్లస్ అవుతుంది. లీడ్ గానే కాకుండా మంచి పాత్ర దొరికితే ఎలాంటి క్యారెక్టర్ చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నా. ప్రస్తుతం ఆర్కా సంస్థలో ఒక రియాల్టీ షో చేస్తున్నా' అని చెప్పారు.



మంగళవారం హిట్టే సాక్ష్యం : దిల్‌రాజు

దర్శకుడు అజయ్ భూపతి తెరకెక్కించిన సినిమా 'మంగళవారం'. పాయల్ రాజ్ పుత్ ప్రధాన పాత్రలో నటించారు. ఈ చిత్రానికి అజయ్ భూపతి ఎ క్రియేటివ్ వర్క్స్ నిర్మాణ భాగస్వామి. ముద్ర మీడియా వర్క్స్ పతాకంపై స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మతో కలిసి నిర్మించారు. శుక్రవారం తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదలైంది. విశేష ప్రేక్షకాదరణతో సినిమాకు బ్లాక్ బస్టర్ టాక్ లభించింది. మంచి వసూళ్లు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో శనివారం సక్సెస్ మీట్ నిర్వహించారు.

ఈ చిత్రాన్ని నైజాంలో పంపిణీ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ, 'ఈ కథ విన్నప్పుడు వంశీ 'అన్వేషణ' గుర్తుకు వచ్చింది. కథ నచ్చడంతో నైజాం తీసుకున్నా. కథ నాకు తెలిసినా సాధారణ ప్రేక్షకుడిలా ప్రీమియర్ చూశా. 'అరుంధతి' సినిమా చూసినప్పుడు ఏదైతే ఫీల్ కలిగిందో... అలా అనిపించింది. ఈ రోజు ప్రేక్షకులు సినిమా బావుందని అనడానికి కారణం క్లైమాక్స్, ఆ ట్విస్టులు. తొలి సినిమాతో సక్సెస్ అందుకున్న నిర్మాత స్వాతికి కంగ్రాట్స్. మౌత్ టాక్ ఉంటే ప్రేక్షకులు ఆదరిస్తారని చెప్పడానికి ఇదే సాక్ష్యం' అని తెలిపారు. 'పెయిడ్ ప్రీమియర్ బుకింగ్స్ స్టార్ట్ చేసిన తర్వాత సాయంత్రానికి ఆల్మోస్ట్ హౌస్ ఫుల్స్ అయ్యాయి. తర్వాత పెయిడ్ ప్రీమియర్ షోలు పెంచాం. సినిమా చూసిన వాళ్ళు ఎంతో బాగా చూపించారు. 'ఆర్ఎక్స్ 100' కంటే బెస్ట్ సినిమా అంటున్నారు. టేకింగ్, అజనీష్ మ్యూజిక్ గురించి మాట్లాడుతున్నారు. ప్రీ రిలీజ్ ఫంక్షన్‌లో చెప్పా... 'ఇది టెక్నీషియన్స్ మూవీ' అని! ఈ రోజు అందరూ టెక్నికల్ వర్క్, ట్విస్ట్స్ గురించి మాట్లాడుతుంటే సంతోషంగా ఉంది. ఈ సినిమాతో ప్రేక్షకుల నుంచి నాకు రెస్పెక్ట్ లభించింది. అవుటాఫ్ బాక్స్ స్టోరీ తీసుకుని హిట్ అందుకున్నందుకు సంతోషంగా ఉంది. పాయల్ కూడా చక్కగా నటించింది' అని దర్శకుడు అజయ్ భూపతి చెప్పారు. పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ 'ఈ సినిమా హిట్ అవుతుందని నేను ముందే అనుకున్నా. కానీ, ఇంత పెద్ద హిట్ అవుతుందని అనుకోలేదు. నాకు చాలా సంతోషంగా ఉంది. నా జీవితంలో మోస్ట్ ఛాలెంజింగ్ రోల్ అజయ్ భూపతి ఇచ్చారు. 'ఆర్ఎక్స్ 100', ఇప్పుడు 'మంగళవారం' ఇచ్చారు. ఒక్క సినిమాతో నా పని అయిపోతుందని అనుకున్నారు. 'మంగళవారం'తో అది తప్పు అని నిరూపించా' అని అన్నారు.

మా సినిమాకు ఇంత రెస్పాన్స్ ఇచ్చి, మాకు ఇంత పెద్ద విజయం అందించిన ప్రేక్షకులకు థ్యాంక్యూ. ఈ రోజు సక్సెస్ మీట్‌లో కూర్చుంటానని అసలు అనుకోలేదు. నా కలను నిజం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు.

- నిర్మాత స్వాతి రెడ్డి గునుపాటి

ప్రేక్షకుల స్పందన చూస్తుంటే మాటలు రావడం లేదు. కథపై నమ్మకంతో నేను, మా తమ్ముడు అజయ్, స్వాతి రెడ్డి గునుపాటి సినిమా చేశాం. కొత్త నిర్మాతలు, కొత్త కథతో తీసిన సినిమాను ఇంత ఎంకరేజ్ చేసినందుకు థ్యాంక్స్.

- నిర్మాత ఎం. సురేష్ వర్మ

చే.. సెన్సార్ పూర్తి



బి.ఆర్.సభావత్ నాయక్

క్యూబా పోరాటయోధుడు చేగువేరా జీవిత చరిత్ర ఆధారంగా తెలుగులో రూపొందుతున్న చిత్రం 'చే'. లాంగ్ లైవ్ అనేది ట్యాగ్ లైన్. నవ ఉదయం సమర్పణలో నేచర్ ఆర్ట్స్ బ్యానర్‌పై బీఆర్ సభావత్ నాయక్ టైటిల్ రోల్ పోషిస్తూ, దర్శకత్వం వహిస్తున్నారు.

తాజాగా ఈ సినిమా సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రాన్ని వీక్షించిన సెన్సార్ సభ్యులు యు/ ఎ సర్టిఫికెట్ జారీ చేశారు. క్యూబా తరువాత ప్రపంచంలోనే తొలిసారి భారతీయ చిత్ర పరిశ్రమలో రూపొందుతున్న చేగువేరా బయోపిక్ ఇది.సూర్య, బాబు, దేవేంద్ర సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ మూవీలో లావణ్య సమీరా, పూల సిద్దేశ్వర్, కార్తీక్ నూనె, వినోద్, పసల ఉమా మహేశ్వర్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. రవిశంకర్ సంగీతం అందిస్తున్నారు.

దర్శకుడు బి.ఆర్ సభావత్ నాయక్ మాట్లాడుతూ, 'చేగువేరా బయోపిక్ తీయాలన్నది నా ఇరవై ఏళ్ల కల. విప్లవ వీరుడు చేగువేరా లైఫ్‌లో జరిగిన ఎన్నో అరుదైన విషయాలు ఈ సినిమాలో చూపిస్తున్నాం. అనాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్టు తెరకెక్కిం చాం. క్వాలిటీ విషయంలో ఎక్కడ కాంప్రమైజ్ కాలేదు. ఇటీవలే చేగువేరా కూతురు డాక్టర్ అలైదా గువేరా రిలీజ్ చేసిన ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌కు, లేటేస్ట్‌గా రిలీజైన టీజర్, ట్రైలర్స్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. మా చిత్రాన్ని డిసెంబర్ మొదటి వారంలో థియేటర్‌లలో రిలీజ్ చేయబోతున్నాం' అని తెలిపారు.





పిల్లలతో ఎలా మాట్లాడుతున్నారు?

తల్లిదండ్రులు తమ పిల్లలు విజయవంతం కావాలని కోరుకోవడం సహజం. అయితే తల్లిదండ్రులకు, పిల్లలకు మధ్య ఉండే సంబంధం పిల్లల అభివృద్ధిని ఎంతగానో ప్రభావితం చేస్తుంది. ఆ సంబంధం బలంగా ఉంటే పిల్లలు మానసికంగా చక్కగా ఎదుగుతారు. అన్ని విధాలా ఉత్సాహంగా ఉంటారు. సహజంగా పిల్లలు తల్లిదండ్రుల నుండి కొన్నింటిని ఆశిస్తారు. అవేంటో మనం తెలుసుకుని వారిని ప్రోత్సహిస్తే విజయం సాధిస్తారు. మరి పిల్లలు మన నుండి ఏం కోరుకుంటారో.. వారికి ఎలాంటి సహకారం ఇవ్వాలో చూద్దాం...

చాలామంది తల్లిదండ్రులు పిల్లల పట్ల తమ ప్రేమను మొత్తం లోలోపలే దాచుకుంటారు. పైకి మాత్రం కోపం ప్రదర్శిస్తారు. దీని వల్ల మీరు వాళ్ళను ఎంతగా ప్రేమిస్తున్నారో అర్థం కాదు. ఎప్పుడూ కోప్పడుతూ ఉండడం వల్ల తమ పట్ల మీకు అసలు ప్రేమలేదని భావించే అవకాశం ఉంది. అందుకే మీరు మీ పిల్లలలో "నేను నిన్ను ప్రేమిస్తున్నాను" అని చెప్పాలి. మీరు వారిని ప్రేమిస్తున్నారని పిల్లలు తెలుసుకోవాలి. పిల్లలతో ఇలా చెప్పడం చాలా మందికి వింతగా అనిపించవచ్చు. కానీ మీ పిల్లలతో ఈ మాటలను వారానికి ఒకసారి లేదా రోజుకు ఒకసారి చెప్పి చూడండి. వారిలో మార్పు మీరే గమనిస్తారు.



నిరుత్సాహ పరచొద్దు..

సాధారణంగా పిల్లలు ఏదైనా కొత్త పని చేయాలని కోరుకుంటారు. దాని వల్ల వారు ఏమైనా ప్రమాదంలో పడతారేమోననే ఉద్దేశంతో తల్లిదండ్రులు ముందు అంగీకరించరు. పైగా వారిని నిరుత్సాహ పరుస్తారు. "వెళ్ళు!" వాస్తవానికి పిల్లలు నిజంగానే ప్రమాద కరమైన, అనైతికమైన పనులు చేస్తున్నట్టుగా భావిస్తే తల్లిదండ్రులు కచ్చితంగా వద్దని చెప్పాలి. ఇటువంటి సమయాల్లో తల్లిదండ్రులు తెలివిగా వ్యవహరించాలి. అదే వారు మంచి దారిని ఎంచుకున్నపుడు మీరు ప్రోత్సహిస్తే ఎదుగుతారు. పిల్లల్లో ఆత్మ విశ్వాసాన్ని పెంచడం కన్నవారి బాధ్యత. తల్లిదండ్రుల లక్ష్యం పిల్లలకు కేవలం ఆశ్రయం కల్పించడం, వారికి సౌకర్యవంతమైన జీవితాన్ని అందించడం మాత్రమే కాదు. యుక్త వయసును వారు ఎదుర్కోవలసి ఉంటుంది. టీనేజ్ అనేక సవాళ్లతో నిండి ఉంటుంది. అందుకే బాల్యం నుంచే మీ పిల్లలను వాటిని అధిగమించే విధంగా సిద్ధం చేయాలి. దీని కోసం వారికి మీ సహకారం చాలా అవసరం. కాబట్టి వారు ఏదైనా మంచి పని చేయాలనుకున్నప్పుడు "ముందుకు సాగండి" అని మీరు వారికి చెప్పాలి.

ప్రోత్సాహం...

ఈ మాటలు మీ పిల్లలకు మీరు చాలా తరచుగా చెప్పాలి. అయితే వారు విజయాలు సాధించినప్పుడు మాత్రమే కాదు ఎప్పుడూ చెబుతుండాలి. మీ పిల్లలు చేసిన దాని గురించి మీరు గర్వపడటం వారికి ఎంతో సంతోషాన్ని ఇస్తుంది. మీ పిల్లలు సాధించిన దాని గురించి మీరు గర్వపడటంలో తప్పు లేదు. మరీ చెప్పుకోదగిన విషయం కాకపోయినా మీరు వారి గురించి గర్వపడుతున్నారని వారు తెలుసుకోవాలి. అప్పుడే వారికి నమ్మకం వస్తుంది. పిల్లలు దయ, ఔదార్యం, వినయం, ధైర్యం... ఇలా మరేదైనా సానుకూల ప్రవర్తనను ప్రదర్శిస్తున్నారని మీరు గమనించినప్పుడు "నేను నిన్ను చూసి గర్వపడుతున్నాను" అని చెప్పండి. ఈ చిన్న మాట వారిలో విపరీతమైన శక్తిని నింపుతుంది.

నిన్ను నమ్ముతున్నాను

బాల్యం, కౌమారదశ అనేది సందేహాల సమాహారం. నేను విఫలమైతే అందరూ నా గురించి ఏమనుకుంటున్నారు? నేను అనుకున్నది సాధించగలనా? నేను స్లిమ్‌గా, స్మార్ట్‌గా ఎందుకు ప్రాచుర్యం పొందలేను? పిల్లలు తరచూ తమను తాము అడిగే ప్రశ్నలు ఇవి. వారి సందేహాలకు మీరు ఓపిగ్గా సమాధానాలు చెప్పాలి. సరైన సూచనలు ఇవ్వాలి. ఇటువంటి పరిస్థితుల్లో వారిని సరిగ్గా గైడ్ చేయాలి. తల్లిదండ్రులు తమని తక్కువగా చూస్తున్నారని భావిస్తే పిల్లలు భరించలేరు. ఆత్మన్యూనతకు గురవుతారు. కొంతమంది తల్లిదండ్రులు పిల్లలు చిన్న పొరపాటు చేసినా భరించలేరు. "నువ్వు దేనికీ పనికి రావు" అంటూ ఓ నిర్ణయానికి వచ్చేస్తారు. ఇది చేయడం సరైనది కాదు. ముందు మీరు మీ పిల్లల్ని నమ్మండి. వారిలో ధైర్యాన్ని నింపండి. "నేను నిన్ను నమ్ముతున్నాను" అని చెప్పండి. అదే వారికి కొండంత బలం.

సారీ చెప్పండి


మీ పిల్లలకు మీరు ఎప్పుడైనా సారీ చెప్పారా? తల్లిదండ్రులు సాధారణంగా పిల్లలకు మేము క్షమాపణ చేప్పేదేంటి అనుకుంటారు. అయితే కొన్ని విషయాల్లో పెద్ద వాళ్ళమనే అహంకారం ప్రదర్శిస్తే అది మీ పిల్లలను ప్రమాదంలో పడేస్తుంది. మీ పిల్లలతో వాగ్వాదం చేసేటప్పుడు మీరు నిర్దాక్షిణ్యంగా ఏదైనా పదం వాడితే "నన్ను క్షమించండి, నేను అలా చెప్పక తప్పదు" అనండి. మిమ్మల్ని చూసి మీ పిల్లలు కూడా నేర్చుకుంటారు.

ఎలా చేశావో నాకు చూపిస్తావా?

ఏదో ఒక సమయంలో, మీ పిల్లలు మీ కంటే కొన్ని విషయాల గురించి మరింతగా నేర్చుకుంటారు. సోషల్ మీడియా, ఇంటర్నెట్, మార్కెటింగ్ గురించి మీకన్నా వారు ఇప్పటికే ఎక్కువ తెలుసుకొని ఉంటారు. అయినప్పటికీ కొంత మంది తల్లిదండ్రులు పిల్లల్ని 'మీరు చిన్నవాళ్ళు మీకేం తెలుసు' అంటుంటారు. దాంతో పిల్లలు తాము నేర్చుకున్న కొత్త విషయాలను తల్లిదండ్రులకు చెప్పేందుకు వెనకాడతారు. ఇక ఏ విషయాన్నీ మీతో పంచుకోరు. కాబట్టి మీ పిల్లలకు మీకన్నా ఎక్కువ తెలిస్తే దాన్ని అంగీకరించండి. "నువ్వు దీన్ని ఎలా చేశావో నాకు చూపిస్తావా?" అని అడిగి చూడండి. వారికి ఎక్కడి లేని ఉత్సాహం వస్తుంది. మరిన్ని కొత్త విషయాలు నేర్చుకునేందుకు ఆసక్తి చూపుతారు. మీకూ పిల్లలకు మధ్య ఆరోగ్యకరమైన సంబంధానికి ఇది చాలా అవసరం.

నేను నీతోనే వున్నాను

పిల్లలు పెద్దయ్యాక మరింత స్వాతంత్ర్యం కోరుకుంటారు. చదువు, కెరీర్ ఎంపికలో వారి కంటూ కొన్ని సొంత నిర్ణయాలు ఉంటాయి. సాధారణంగా తల్లిదండ్రులు తమ పిల్లలు తమకు తెలియకుండా ఏమీ చేయకూడదని అనుకుంటారు. కానీ పెద్దల ఆలోచన ఇలా ఉండకూడదు. మీ పిల్లలు యుక్తవయసులో ఉంటే వారు సొంత నిర్ణయాలు తీసుకోడానికి అనుమతించండి. మరికొంత కాలంలో వారు పెద్దవారు అవుతారు. తుది నిర్ణయం తమదేనని మీరు స్పష్టం చేసేవరకు వారు మీ సలహాలు, సంప్రదింపులను అభినందిస్తారు. వాళ్ళ నిర్ణయాలు వారు తీసుకునేటపుడు కొన్ని సమస్యలు ఎదురుకావచ్చు. అందుకే "నేను మీతోనే వున్నాను" అని మీ పిల్లలు ధైర్యం చెప్పండి. అప్పుడు వారు బాహ్య అనుబంధంలోకి అడుగుపెట్టినప్పుడు మరింత ఆత్మవిశ్వాసం పొందుతారు



సండే ప్లానింగ్ ఏంటి?

సాధారణంగా ఉద్యోగం చేసే మహిళలకు ఆదివారం మాత్రమే సెలవు ఉంటుంది. ఒక్కోసారి అది కూడా ఉండదు. ఒకవేళ సెలవు ఉంటే మాత్రం ఏం చేస్తారు.. బోలెడు పనులు అంటూ అన్నింటినీ ఏకరవు పెట్టేస్తుంటారు. అసలు విజేతలైన మహిళలు ఆదివారం పాటించే నియమాలేంటో ఓసారి పరిశీలిద్దాం..

- సాధారణ రోజుల్లో ఏ పనులు ఎప్పుడు చేయాలో ఓ ప్రణాళిక వేసు కుంటాం. అదే విధంగా ఆదివారం రోజున కూడా పాటించాలి. ఉదాహరణకు ఓ గంట దుస్తుల కోసం కేటాయించుకోవాలి. వారం మొత్తానికి ఏమేమి వేసుకోవాలనేది సిద్ధంగా పెట్టుకుంటే మిగిలిన రోజుల్లో ఎంతో సమయం కలిసొస్తుంది.



- ఆదివారం రోజున కనీసం ఓ అరగంట అయినా.. రాబోయే వారం రోజులు ఏయే పనులు చేయాలో ఆలోచించుకోవాలి. అవసరమైతే కొన్నింటిని రాసుకుంటే సరిపోతుంది. ఇలా చేయడం వల్ల మనకు ఏం చేయాలో తెలుస్తుంది. మర్చిపోయే పరిస్థితి ఎదురవదు. ముఖ్యంగా ఒత్తిడి సమస్య అసలు ఉండదు.
- ఇంటిని సర్దుకునే పనులు మాత్రం పెట్టుకోరట చాలామంది. అందుకు బదులుగా విశ్రాంతి తీసుకునేందుకు సమయం కేటాయించుకుంటారట. అలానే వారంలో ఎంత సమయం కుటుంబానికి కేటాయించాలి.. వ్యక్తిగత సమయానికి ఎంత ప్రాధాన్యమివ్వాలనేది ఆలోచిస్తారు.
- విజేతలైన స్త్రీలు చేసే మరో పని ఏంటో తెలుసా.. డిజిటల్ డిటాక్స్ పాటించడం. అంటే సెల్‌ఫోన్లకు, కంప్యూటర్లకు దూరంగా ఉండడం. రోజంతా కాకపోయినా.. వీలైనన్ని ఎక్కువ గంటలు అలా గడిపేందుకు ప్రయత్నిస్తే చాలు.

క్వింటా వరికి రూ.3,100 ఇస్తాం

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికల మ్యానిఫెస్టో-2023ను ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర ఎన్నికల ఇన్‌చార్జులు ప్రకాశ్ జవదేకర్, తరుణ్‌చుగ్, కేంద్ర అధికార ప్రతినిధి జాఫర్ ఇస్లాం, నేతలు ప్రకాశ్‌రెడ్డి, సుభాష్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమిత్‌షా మాట్లాడుతూ.. చేసేదే చెప్పటం, చెప్పిందే చేయటం బీజేపీ నైజం అన్నారు. తమను గెలిపిస్తే తెలంగాణ అభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి పనిచేస్తామని చెప్పారు. బీజేపీ మ్యానిఫెస్టో అంశాలు ప్రధాని మోడీ ఇస్తున్న హామీలు అన్నారు. ఓడిపోయే వాళ్ళు ఓడిపోతామని ఒప్పుకోరు కదా.. అందుకే మేమే గెలుస్తామని చెప్పుకుంటున్నారు అని కేసీఆర్ ప్రభుత్వానుద్దేశించి వ్యాఖ్యానించారు. ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, జార్ఖండ్ రాష్ట్రాలను చుక్క రక్తపాతం లేకుండా నాటి వాజ్‌పేయి ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. కానీ, తెలంగాణ ఏర్పాటుకు కాంగ్రెస్ ఎంతో మంది యువకులను బలితీసుకున్నదని విమర్శించారు. 2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల కోట్ల నిధులను ఇస్తే..బీజేపీ తొమ్మిదున్నరేండ్లలో ఒక్క తెలంగాణకే రూ.2.5 లక్షల కోట్లను కేటాయించిందని వివరించారు. తెలంగాణకు గిరిజన యూనివర్సిటీ, పసుపుబోర్డు, ఎయిమ్స్, తదితరాలను ఇచ్చామనీ, నేషనల్‌హైవేలు, గ్రీన్‌ఫీల్డ్ హైవే వేశామని చెప్పారు. హైదరాబాద్ మెట్రోకు రూ.1200 కోట్ల కంటే ఎక్కువ నిధులు ఇచ్చామనీ, అంతర్జాతీయ విమానాశ్రయం వరకు దాన్ని విస్తరణ పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఓవైసీకి భయపడి విమోచన దినోత్సవాన్ని కేసీఆర్ నిర్వహించలేదన్నారు. కేసీఆర్ లోక్‌తంత్రాన్ని వదిలి..దోపిడీ తంత్రాన్ని నమ్ముకుని పనిచేస్తున్నారని విమర్శించారు. కేటీఆర్‌ను సీఎం చేయడమే లక్ష్యంగా ఆయన ముందుకెళ్తున్నారని చెప్పారు. నీళ్ల, నిధులు, నియామకాల హామీల్లో ఒక్కటీ నెరవేరలేదని విమర్శించారు. మిగులు బడ్జెట్ ఉన్న రాష్ట్రాన్ని అప్పుల్లోకి నెట్టారన్నారు. తెలంగాణలో ప్రతి ప్రాజెక్టులోనూ కమీషన్లు ఇవ్వాల్సిందేనని ఆరోపించారు. టీఎస్‌పీఎస్‌పీ పరీక్ష పేపర్లను లీక్ చేసి యువత భవిష్యత్తుతోని రాష్ట్ర సర్కారు ఆడుకున్నదని విమర్శించారు. కేజీ టూ పీజీ విద్య, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రుల నిర్మాణం ఇలా ఏ ఒక్కటీ ఆచరణలో చేసి చూపెట్టలేదన్నారు. లిక్కర్, గ్రానైట్, మిషన్ కాకతీయ.. ఇలా ప్రతి పథకంలో అవినీతికి పాల్పడ్డారని ఆరోపించారు. తాంత్రికులు చెప్పారని.. కేసీఆర్ పార్టీ పేరు మార్చారన్నారు. గ్యాస్ సిలిండర్ల తగ్గింపు అంశంపై రాష్ట్ర, కేంద్ర సర్కార్ రెండు కలిసి తగ్గిస్తే.. పేదలపై భారం పడదనీ, కేసీఆర్ ఎందుకు తగ్గించడం లేదని ప్రశ్నించారు. బీసీ సీఎం నినాదం నచ్చకనే రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి, వివేక్ పార్టీని వీడారని విమర్శించారు. వాళ్ల కోసం తమ పార్టీ విధానాలను మార్చుకోబోమన్నారు. కేసీఆర్ తమ పార్టీలో కోవర్టులు ఉన్నారంటున్నారనీ, మరి కేసీఆర్ కూడా టీడీపీ వ్యక్తే కదా అని అన్నారు. డిసెంబర్ 3 తర్వాత తెలంగాణలో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.

బీజేపీ మ్యానిఫెస్టోలోని కీలకాంశాలు ఇవే

- హైదరాబాద్ విమోచన దినోత్సవంగా సెప్టెంబర్ 17ని అధికారికంగా ప్రకటిస్తాం.
- బైరాన్‌పల్లి, పరకాలలో రజాకార్ల ఆకృత్యాల్లో మరణించిన వారిని స్మరించుకుంటూ ఆగస్టు 27న రజాకార్ల దుష్కృత్యాల సంస్మరణ దినంగా గుర్తిస్తాం.
- నిజాంకు వ్యతిరేకంగా పోరాడిన వారిని స్మరించుకుంటూ హైదరాబాద్‌లో స్మారక స్థూపం, మ్యూజియం ఏర్పాటు చేస్తాం.
- అవినీతిరహిత పాలన అందిస్తాం. కేసీఆర్ ప్రభుత్వ అవినీతిపై సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జితో విచారణ కమిటీ వేస్తాం.
- బీసీని సీఎంగా చేస్తాం.
- ఎస్సీ వర్గీకరణను వేగం చేసేందుకు సహకరిస్తాం.
- మతపర రిజర్వేషన్లను తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు వాటిని వర్తింపజేస్తాం.
- ద్రవ్యోల్బణం తగ్గిస్తాం. సామాన్యులకు ఊరట కలిగించేలా పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్ ఎత్తేస్తాం.
- ఇప్పుడిస్తున్న ఎరువుల సబ్సిడీ(రూ.18వేలు)తో విత్తనాలు కొనుగోలు చేసేందుకు రూ.2,500 ఇన్‌పుట్ అసిస్టెన్స్ అందిస్తాం.
- పసుపు బోర్డు ఏర్పాటు నేపథ్యంలో ప్రాసెసింగ్ యూనిట్లను కూడా ఏర్పాటు చేసి ఉపాధి కల్పనకు బాటలు వేస్తాం.
- వరికి మద్దతు ధర క్వింటాకు రూ.3,100 ఇస్తాం.

ఓటే వజ్రాయుధం...

నవతెలంగాణ-చేర్యాల

ఓటే వజ్రాయుధమని,అభ్యర్థి గుణగణాలు, పార్టీ చరిత్ర చూసి ఓటు వేయాలని సీఎం కేసీఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన బీఆర్ఎస్ జనగామ అభ్యర్థి పల్లా రాజేశ్వర్‌రెడ్డి ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ పుట్టింది తెలంగాణ రాష్ట్రం కోసం అని అన్నారు. ఓటు వేయడం ద్వారా ఐదేండ్ల మన తలరాతను మనమే నిర్ణయించుకుంటామని, అందుకే వజ్రాయుధాన్ని ప్రజలు సరైన రీతిలో వినియోగించుకోవాలని కోరారు. రాష్ట్రాన్ని సాధించి అభివృద్ధి చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు ఇప్పుడు వచ్చి ఎన్నికల్లో గెలిపిస్తే రాష్ట్రాన్ని ఇంకా ఏదో చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. రాష్ట్రాన్ని సాధించిన బీఆర్ఎస్‌కు రాష్ట్ర అభివృద్ధి చేయడం తెలుసని అన్నారు. రాష్ట్రాన్ని ముంచింది కాంగ్రెస్ పార్టీయే అని, హైదరాబాద్ రాష్ట్రాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేసి తెలంగాణలో వేల మంది ప్రాణాలు బలిగొన్న పార్టీ కాంగ్రెస్ అని అన్నారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా సంక్షేమ పథకాల అమలు చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని, తెలంగాణలో కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, కెసిఆర్ కిట్, రైతుబంధు, రైతు బీమా వంటి అద్భుతమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని తెలిపారు.

పద్ధతి పాడు లేని కాంగ్రెస్, బీజేపీ నాయకులు రైతుబంధు, 24 గంటల ఉచిత విద్యుత్ వద్దని, బోర్లకు మీటార్లు పెట్టాలని పిచ్చికూతలు కూస్తున్నారన్నారు. రైతులు బాగుంటే రాష్ట్రం బాగుంటుందన్నారు. హెలికాప్టర్‌లో సభలకు వెళ్తుంటే ఎక్కడ చూసినా బంగారు వర్ణంలో వరి ధాన్యమే కనిపిస్తోందని, మరో పదేండ్లలో రైతులే రాజులవుతారని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ధరణిని తీసేస్తామని అంటున్నారని, అది లేకుంటే రైతుబంధు ఎలా ఇస్తారని ప్రశ్నించారు. పల్లా రాజేశ్వర్‌రెడ్డిని గెలిపిస్తే చేర్యాలను రెవెన్యూ డివిజన్‌గా చేస్తానని, చేర్యాలకు ఇంజనీరింగ్ కళాశాల కూడా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చేర్యాల ప్రాంతం కోసం పల్లా రాజేశ్వర్‌రెడ్డి అడిగిన మినిస్టేడియం, పెద్ద చెరువు సుందరీకరణ తోపాటు ప్రతి ఒక్కటి మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. చేర్యాలకు దేవాదుల, తలాపున ఉన్న మల్లన్న సాగర్సాగర్ ద్వారా తపస్పల్లి రిజర్వాయర్ నింపి శాశ్వతంగా కరువు లేకుండా చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య, మాజీ డిప్యూటీ సీఎం రాజయ్య, జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ రఘోత్తం రెడ్డి, మాజీ ప్రభుత్వం విప్ బోడకుంట వెంకటేశ్వర్లు, జనగామ జడ్పీ చైర్మన్ సంపత్ రెడ్డి, చేర్యాల, జనగామ మున్సిపల్ చైర్ పర్సన్లు, స్వరూప రాణి, జమున, చేర్యాల మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ నిమ్మ రాజీవ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గాజాలో పొంచివున్న ఆకలిచావులు !

(మొదటిపేజీ తరువాయి)

తాజాగా జాబాలియా శరణార్థ శిబిరంలో గల స్కూలుపై దాడిచేశాయి. శనివారం ఉదయం అల్-ఫకూరా పాఠశాలపై జరిగిన దాడిలో 50మంది చనిపోయారని గాజా ఆరోగ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. స్కూలుపై బాంబు దాడిని హమస్ తీవ్రంగా ఖండించింది. అభం శుభం తెలియని చిన్నారులను, అమాయకులను బలితీసుకుంటున్న ఇజ్రాయిల్‌ను ఈ దాడులకు, నేరాలకు జవాబుదారీ చేస్తామని పేర్కొంది. మొత్తంగా ఉత్తర గాజా ప్రాంతంలో పాలస్తీనియన్లు ఎవరూ లేకుండా చేయాలన్నది ఇజ్రాయిల్ ఆలోచనగా వుందని, అందుకే ఇలా స్కూలుపై దాడి చేసిందని పాలస్తీనా ఆరోగ్యమంత్రిత్వ శాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ఐక్యరాజ్య సమితి నిర్వహించే పాఠశాలపై ఈ దాడి జరిగిందని తెలిపింది. ఈ పాఠశాలలో వేలాదిమంది నిర్వాసితులు తలదాచుకున్నారు.

అంతర్జాతీయ సంస్థలు జోక్యం చేసుకుని, అల్ షిఫా అస్పత్రిలో ఇంక్యుబేటర్లలో వున్న శిశువులను, గాయపడిన చిన్నారులను వెస్ట్ బ్యాంక్ లేదా ఈజిప్ట్‌లోని ఆస్పత్రులకు తరలించి,వారికి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని పాలస్తీనా ఆరోగ్యమంత్రి మయి అల్-కైలా కోరారు. అల్ షిఫా ఆస్పత్రిని మిలటరీ బ్యారక్స్‌గా మార్చేస్తున్నారని, తుపాకీలు చూపి బెదిరిస్తూ లోపల వున్నవారిని ఖాళీ చేయిస్తున్నారని మంత్రి తెలిపారు. ప్రస్తుతం గాజాలో ఏ ఆస్పత్రిలో కూడా గాయపడినవారికి చికిత్సనందించే సదుపాయాలు లేవన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో తాను, సిబ్బంది, రోగులతో సహా కొద్దిమంది మాత్రమే వున్నామని, అక్కడ నుండి వెళ్లడానికి ఇజ్రాయిల్ బలగాలు అనుమతించడం లేదని అల్‌షిఫా ఆస్పత్రి డైరెక్టర్ మహ్మద్ అబూ సాల్మియా తెలిపారు. ఇప్పటివరకు గాజా దాడుల్లో 12వేల మందికి పైగా మరణించారు. జాబాలియా శరణార్థ శిబిరంపై శుక్రవారం జరిగిన దాడిలో 19మంది చిన్నారులతో సహా ఒకే కుటుంబానికిచెందిన 32మంది మరణించారని గాజా ఆరోగ్య శాఖ తెలిపింది.

కాల్పుల విరమణ జరిగితే గాజాలో ఆస్పత్రులను తాము పునర్నిర్మిస్తామని టర్కీ అధ్యక్షుడు ఎర్డోగన్ ప్రకటించారు. ఇజ్రాయిల్ జరిపిన విధ్వంసాన్ని భర్తీ చేసేలా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. మొత్తంగా అన్ని సదుపాయాలను పునర్నిర్మాణం చేపడతామన్నారు.

గాజాలో సురక్షితమైన ప్రదేశం అంటూ ఏమీ లేకుండా పోయిందని ఐక్యరాజ్య సమితి ప్రతినిధి తమారా అల్ రిఫాయ్ ఆందోళన వ్యక్తం చేశారు.

ఒక గంట సమయమిచ్చి అల్‌షిఫా ఆస్పత్రి నుండి వెళ్ళిపోవాల్సిందిగా ఆదేశించారని, అలా వెళ్ళేవారినిముఖ్యంగా మహిళలను అమానవీయమైన రీతిలో సోదాచేస్తున్నారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. బట్టలూడదీయించి మరీ వారు సోదాలు చేస్తున్నారని, తలెత్తుకోలేని రీతిలో అనేక సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని వారు చెప్పారు. ఆస్పత్రి పై అంతస్తులో అనేకమందిని బందీలుగా వుంచి వారికి ఆహారం,నీరు ఇవ్వకుండా అమానుషంగా ప్రవర్తిస్తున్నారని చెప్పారు.

గజ్వేల్‌లో ఓటమి భయంతోనే..కామారెడ్డిలో కేసీఆర్ పోటీ

(మొదటిపేజీ తరువాయి)

కూలీలకు సంవత్సరానికి రూ.12,000 చెల్లిస్తుందన్నారు. బీఆర్ఎస్ కచరా పాలనలో వ్యవసాయ బావుల వద్ద ఉచిత కరెంటు అని చెప్పి గృహ నివాసాల నుంచి వేల రూపాయలు వసూలు చేస్తున్నారని అన్నారు. కేసీఆర్‌ను ఓడించి బీఆర్ఎస్ పార్టీని బొందపెట్టి ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందజేయడానికి కేసీఆర్‌పై కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నానని తెలిపారు. కేసీఆర్ గజ్వేల్‌లో ఓడిపోతాననే భయంతోనే కామారెడ్డిలో పోటీ చేస్తున్నాడని విమర్శించారు. కేసీఆర్ 40 ఏండ్ల రాజకీయ జీవితంలో అమ్మమ్మ ఇల్లు గుర్తుకు రాలేదని.. ఎన్నికలు రాగానే కామారెడ్డి నియోజకవర్గంలో ఉన్న అమ్మమ్మ గారి ఇల్లు గుర్తుకు వచ్చిందని ఎద్దేవా చేశారు.

గజ్వేల్‌లో 1000 ఎకరాల భూములు తమ బంధువులకు, స్థానికులకు ఇచ్చేశారని, కామారెడ్డి ప్రాంతం పచ్చగా కనిపించడంతో కామారెడ్డి జిల్లాలో ఉన్న పచ్చని పంట పొలాలను కబ్జా చేయడానికి మాత్రమే కామారెడ్డి నుంచి పోటీ చేస్తున్నారని విమర్శించారు. దళితుడిని ముఖ్యమంత్రిని చేయలేదని, మరోసారి అవకాశం ఇస్తే తన కుమారుడిని ముఖ్యమంత్రిని చేయడానికి ప్రయత్నం చేస్తున్నారన్నారు. పంజాబ్ రాష్ట్రంలో, మహారాష్ట్ర ప్రాంతంలో ఉన్న ప్రజలపై ఉన్న ప్రేమ తెలంగాణ ప్రజలపై లేదని, తెలంగాణ ప్రజల సొమ్మును పక్క రాష్ట్రంలో పంచడానికి వెళ్తున్నాడు కానీ తెలంగాణ ప్రజల గోసను పట్టించుకోవడానికి ఒకనాడు కూడా వాళ్ల ఇంటికి వెళ్లలేదన్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో ఉన్న రెండు లక్షల ఓటర్లకు ఒక్కో ఓటుకు పదివేల రూపాయలు చెల్లించి, గెలిచిన తర్వాత రెండు వేల ఎకరాల భూములను లాక్కోవడం ఖాయమన్నారు. ప్రజలు గమనించి ఈనెల 30వ తేదీన జరిగే అసెంబ్లీ ఎన్నికలలో హస్తం గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు చేరే విధంగా చూస్తానని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, నిజామాబాద్ అర్బన్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మహమ్మద్ షబ్బీర్ అలీ, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఇంద్రకరణ్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు చంద్రకాంత్ రెడ్డి, మండలాధ్యక్షులు భీమ్‌రెడ్డి, రాజంపేట్, భిక్కనూర్ మండలాల ఎన్నికల ప్రచార నిర్వహకురాలు శారద, కామారెడ్డి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఇన్చార్జ్ నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీయేతర రాష్ట్రాల్లో గవర్నర్లతో కక్ష సాధింపు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకొచ్చింది. తమిళనాడు విశ్వవిద్యాలయాల చట్టంలో సవరణలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొచ్చింది.

బిల్లులపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి స్టాలిన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం, గవర్నర్‌పై విమర్శలు గుప్పించారు. ఎలాంటి కారణం చూపకుండా బిల్లులను నిలిపివేయడం ఆమోదయోగ్యం కాదని అన్నారు. కేవలం ఆయన వ్యక్తిగత కారణాలతోనే బిల్లులకు ఆమోదం తెలపకుండా వెనక్కి పంపారని విమర్శించారు. ఇది అప్రజాస్వామికమని, ప్రజా వ్యతిరేకమని స్టాలిన్ అన్నారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో గవర్నర్లను అడ్డం పెట్టుకొని కేంద్రం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. అసెంబ్లీ తీర్మానించిన బిల్లులను పెండింగ్‌లో ఉంచటంతో తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. దీనిపై నవంబర్ 10న విచారణ చేపట్టిన అత్యున్నత న్యాయస్థానం గవర్నర్ తీరుపై అసహనం వ్యక్తం చేసింది. 12 బిల్లుల పెండింగ్‌కు సంబంధించి తమిళనాడు ప్రభుత్వం చేస్తున్న ఆరోపణలపై ప్రతిస్పందన తెలపాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీని ప్రత్యేకంగా సమావేశపరిచి గత బిల్లులను ఆమోదించి, గవర్నర్‌కు తిరిగి పంపడం ప్రాధాన్యత సంతరించుకుంది.

బీజేపీ,బీఆర్ఎస్ ఒక్కటే

(మొదటిపేజీ తరువాయి)

చేరిన ఆమె... శనివారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌కు వచ్చారు. అనంతరం ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. కాంగ్రెస్‌లో చేరిన తర్వాత పాత మిత్రులను కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. బీజేపీ పెద్ద తప్పు చేయడంతోనే తాను కాంగ్రెస్‌లోకి వచ్చానన్నారు. అవినీతిపరుడైన కేసీఆర్‌ను జైల్లో వేస్తామంటూ ఆనాడు బీజేపీ మాట ఇచ్చిందనీ, అందుకు నేను కాంగ్రెస్ నుంచి ఆ పార్టీలో చేరినట్టు తెలిపారు.నెలలు, సంవత్సరాలు గడిచిన కేసీఆర్‌పై చర్యలు తీసుకోలేదన్నారు. కేంద్రంలో బీజేపీకి మెజార్టీ ఉన్నప్పటికీ కేసీఆర్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. అందుకే ఆ పార్టీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరానన్నారు. ఇప్పటికే నాలుగు నెలలుగా మౌనంగా ఉన్నట్టు తెలిపారు. 'సంజయ్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు ఆయనను ఎందుకు తీసేస్తున్నారు. ఎన్నికలకు ముందు ఆయన్ను మారిస్తే బీజేపీకి ప్రమాదం అవుతుంది' అని చెప్పినప్పటికీ మార్చారని గుర్తు చేశారు. ఇప్పటి బీజేపీ నేతలకు విలువలు లేవని విమర్శించారు. ఉత్తమ్ మాట్లాడుతూ విజయశాంతి కాంగ్రెస్‌లోకి రావడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఆమె చేరికతో పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు.

ప్రభుత్వ వాహనాలు వాడొద్దు :ఈసీ హుకుం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎన్నికల ప్రచారంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజా ప్రతినిధులు ఎవరూ ప్రభుత్వ అధికారిక వాహనాలను వినియోగించరాదని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. కేంద్ర మంత్రులు, ప్రజాప్రతినిధులకు కూడా ఇవి వర్తిస్తాయని స్పష్టం చేశారు. అలాంటి ఫిర్యాదులు ఏవైనా తమ దృష్టికి వస్తే, ఎన్నికల ప్రవర్తనా నియమావళి కింద కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. తాము అనుమతించిన వాహనాలకంటే ఎక్కువ వినియోగిస్తే వాటిని సీజ్ చేస్తామని చెప్పారు. ఎన్నికల ఏర్పాట్లన్నీ వేగంగా జరుగుతున్నాయనీ, 74 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఓటింగ్ యంత్రాలను రాండమ్‌గా తనిఖీలు చేస్తున్నామన్నారు. సువిధ పోర్టల్ ద్వారా ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులకు 22,254 అనుమతులు ఇచ్చామనీ, సీ-విజిల్ ద్వారా 5,183 ఫిర్యాదుల అందాయని తెలిపారు. తనిఖీల్లో రూ.214 కోట్ల నగదు పట్టుబడిందన్నారు. ఆయా పార్టీల స్టార్ క్యాంపెయినర్ల జాబితాకు అనుమతులు ఇచ్చినట్టు చెప్పారు. బీఎస్పీ, బీజేపీ, కాంగ్రెస్‌ల్లో ఒక్కో పార్టీకి 40 మంది, బీఆర్ఎస్ 39, సీపీఐ(ఎం) 36 మందికి చొప్పున స్టార్ క్యాంపెయినర్లకు అనుమతి ఇచ్చామన్నారు. జనసేన పార్టీ స్టార్ క్యాంపెయినర్లుగా 8 మందికి అనుమతి ఇచ్చారు. మరికొన్ని పార్టీలకు కూడా ఈ అనుమతులు ఇచ్చినట్టు తెలిపారు.

కాలుష్య కుంపటి ఊపిరాడని దుస్థితి



- పేరుకే మినీ ఇండియా.. అభివృద్ధి శూన్యం
- పటాన్‌చెరులో 900 భారీ, మధ్య తరహా పరిశ్రమలు
- పర్మినెంట్‌కు నోచని 60 శాతం కాంట్రాక్టు కార్మికులు
- కనీస వేతనాలు.. బోనస్, ఈఎస్ఐ దక్కని వైనం
- ప్రమాదాల్లో ప్రాణాలు పోయినా దిక్కేలేదు.. రోజంతా ట్రాఫిక్ తిప్పలు
- 3.80 లక్షల ఓటర్లలో లక్షన్నర మంది కార్మికులే..

కార్మికుల మెడపై వేలాడుతున్న కేంద్రం తెచ్చిన లేబర్‌కోడ్లు

గ్రేటర్‌కు అనుకుని ఉన్నా ఎన్నెన్నో సమస్యలు

పట్టించుకోని పాలకులు..

సీపీఐ(ఎం) పోటీతో తెరపైకి జనం డిమాండ్లు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

పటాన్‌చెరు.. ఇదొక మినీ ఇండియా. పారిశ్రామిక ప్రాంతం. కానీ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. 'కంపెనీలు వెదజల్లే కాలుష్యపు కుంపటి. అధ్వానమైన గుంతల రోడ్లు. సరైన రవాణా సదుపాయల్లేక ట్రాఫిక్ తిప్పలు. అందని ద్రాక్షలా విద్య, వైద్య సదుపాయాలు. పచ్చదనం లేక.. పార్కుల్లేక దుమ్మూధూళీ. వైద్యమందక గాల్లో కలుస్తున్న ప్రాణాలు. పారిశ్రామిక వాడ ప్రాంతమైనా కనిపించని సాంకేతిక విద్యా సంస్థలు. శ్రమ దోపిడీకి గురవుతున్న కార్మికులు. అమలుకు నోచని 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల జీవోల సవరణ, కార్మిక చట్టాలు.. బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ. పర్మినెంట్‌కు నోచని 60 శాతం పైగా కాంట్రాక్టు కార్మికులు. దుర్భరంగా వలస కార్మికుల బతుకులు. ఇండ్లు, స్థలాల్లేక అద్దె ఇండ్లల్లో మగ్గుతున్న పేదలు. రోడ్డు, అగ్ని ప్రమాదాల్లో బుగ్గవుతున్న కార్మికుల బతుకులు'. ఈ నియోజకవర్గం గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో కొంత భాగం ఉన్నా సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచలేదు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని సమస్యలు చర్చనీయాంశమవుతున్నాయి. ఇక్కడ నుంచి గెలిచన గత నేతలు ప్రజలెదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలను పట్టించుకోలేదన్న ఆరోపణలున్నాయి. సీపీఐ(ఎం) పోటీ చేయడంతో ప్రజా సమస్యలు మరోసారి ఎన్నికల తెరపైకి వచ్చాయి.

నియోజకవర్గ ముఖచిత్రం..

పటాన్‌చెరు నియోజకవర్గం గుమ్మడిదల, జిన్నారం, అమీన్‌పూర్, రామచంద్రాపురం, పటాన్‌చెరు మండలాలతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో మూడు కార్పొరేషన్ డివిజన్లయిన తెల్లాపూర్, అమీన్‌పూర్, ఐడీఏ బొల్లారం మున్సిపాలిటీలతో విస్తరించింది. నియోజకవర్గంలో 3,80,948 మంది ఓటర్లున్నారు. వీరిలో 1,96,357 మంది పురుషులు, 1,84,514 మంది మహిళా ఓటర్లున్నారు.

మొత్తం ఓటర్లలో కార్మికుల కుటుంబాల ఓట్లు 1.50 లక్షల వరకు ఉన్నాయి. హైదరాబాద్ శివారు ప్రాంతమైన పటాన్‌చెరు మీదుగా హైదరాబాద్-ముంబయి, హైదరాబాద్-నాందేడ్ రెండు ప్రధాన జాతీయ రహదారులు వెళ్తాయి. భారీ, మధ్య తరహా, చిన్న పరిశ్రమలకు నిలయంగా ఉంది. ప్రభుత్వ రంగ సంస్థలైన బీహెచ్ఈఎల్, బీడీఎల్‌తో పాటు సుమారు 900 పరిశ్రమలున్నాయి.

పరిశ్రమలకు కేరాఫ్...

పటాన్‌చెరు నియోజకవర్గంలో బొల్లారం, బొంతపల్లి, ఖాజిపల్లి ఏరియాల్లో 400, పటాన్‌చెరు, పాశమైలారంలో 400 వరకు పరిశ్రమలున్నాయి. పెన్నార్, కిర్బీ, తోషిబా, శాండ్విక్, రెడ్డిల్యాబ్, అరవిందో ఫార్మా ఎంఎస్ఎన్, మైలాన్, హెటిరో డ్రగ్స్ వంటి అనేక పరిశ్రమలున్నాయి. నియోజకవర్గంలో రెండు లక్షల వరకు కార్మికులుండగా అందులో లక్ష వరకు కాంట్రాక్టు కార్మికులే ఉన్నారు. కార్మికుల హక్కులు, వేతనాలు, సామాజిక భద్రతకు తూట్లు పొడిచేలా కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ల ప్రభావం పటాన్‌చెరు ప్రాంతంపై తీవ్రంగా ఉంది. పదేండ్లుగా 73 షెడ్యూల్డ్ ఎంప్లాయిమెంట్స్ కనీస వేతనాల సవరణ జీవోలు అమలు కావడం లేదు. దాంతో లక్షలాది మంది కాంట్రాక్టు కార్మికులు పది, పన్నెండు వేల జీతాలకే పనిచేయాల్సి వస్తుంది.

పెరుగుతున్న ధరల భారాలకు వస్తున్న జీతాలు చాలక పస్తులుండాల్సి వస్తుందని కార్మికులు ఆవేదన చెందుతున్నారు. సీఐటీయూ లాంటి ట్రేడ్ యూనియన్లు ఉన్న చోట్ల మినహా 90 శాతం పరిశ్రమల్లో కార్మికుల కనీస హక్కులు వర్తించడంలేదు.

ట్రాఫిక్ చిక్కులు

బీహెచ్ఈఎల్ నుంచి ఇస్నాపూర్ వరకు నిత్యం ట్రాఫిక్ రద్దీ తప్పట్లేదు. స్కూల్స్, డ్యూటీలకు వెళ్లేందుకు రోడ్డెక్కితే చాలు ట్రాఫిక్‌లో చిక్కి.. గంటల తరబడి దుమ్ముధూళిలో ఇబ్బందులు పడుతున్నారు. రెండు జాతీయ రహదారులపై వెళ్లే వాహనాలన్నీ పటాన్‌చెరు పట్టణం మీదుగానే వెళ్లాలి. దీంతో ట్రాఫిక్ సమస్య తీవ్రమైంది.

మియాపూర్-సంగారెడ్డి వరకు మెట్రోలైన్ విస్తరించాలని సీపీఐ(ఎం), ఇతర పార్టీలు ఎప్పటి నుంచో పోరాడుతు న్నాయి. రైల్వే లైన్ ఉన్నా పటాన్‌చెరు వరకు రైలు నడుస్తలేదు.

వలస కార్మికుల నివాసాలు, స్లమ్స్ దుర్భరం

పటాన్‌చెరు అంటేనే వలస కార్మికులకు అడ్డా. చత్తీస్‌ఘడ్, జార్ఖండ్, ఒరిస్సా, మహారాష్ట్ర, యూపీ, బీహార్, బెంగాల్, ఏపీ, కర్నాటక వంటి రాష్ట్రాల నుంచి వలసొచ్చి పనిచేస్తున్నారు.

నిర్మాణ రంగంలోనూ వలస కార్మికులు పెరిగారు. కంపెనీల ప్రాంతాల్లోనే నివాస గుడారాలేసి ఉంచుతున్నారు. కరెంట్, మంచినీళ్లు, డ్రైయినేజీ, వైద్యం, విద్య ఇవేవీ ఉండవు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి బతుకుతున్న కార్మికుల పిల్లలకు మాతృభాషలో చదువుకునేందుకు స్కూల్స్‌లేవు. పదేండ్లకు పైబడి ఉంటున్నా రేషన్‌కార్డులివ్వట్లేదు. ఆర్సీ పురం ముంబయి కాలనీ, ఫెన్సింగ్ ఏరియా, బొల్లారం, అమీన్‌పూర ఏరియాలో ఉన్న స్లమ్స్‌లో మౌలిక సదుపాయాల్లేవు. కొల్లూరులో కట్టిన 17 వేల ఇండ్లను స్థానికులకివ్వలేదన్న ఆరోపణలున్నాయి.

కాలుష్య కుంపటి.. ఊపిరాడని దుస్థితి

కంపెనీలు వెదజల్లే కాలుష్యంతో పాటు గుంతలమయమైన రోడ్ల మీద వచ్చే దుమ్ము ధూళీతో కాలుష్య కుంపటిగా మారింది. గుమ్మడిదల, జిన్నారం ఇతర ప్రాంతాల్లో కార్మికులు, ప్రజలు కాలుష్య కోరల్లో చిక్కి అనారోగ్యాల పాలవుతున్నారు. పొగ కాలుష్యం, భూగర్భాల్లో వెదజల్లే కెమికల్ వ్యర్థాలతో దుర్గంతపు వాసనతో కార్మికులు సహవాసం చేయాల్సి వస్తోంది. కంపెనీల భారీ వాహనాల రాకపోకల వల్ల రోడ్లు ధ్వంసమవుతున్నాయి. సీపీఐ(ఎం), సీఐటీయూ, స్వచ్ఛంద సంస్థలు కాలుష్య వ్యతిరేక ఉద్యమాలు చేశాయి.

అందని ద్రాక్ష విద్య, వైద్యం

ప్రజలకు విద్యా వైద్యం అందని ద్రాక్షలా మారాయి. వందలాది పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలున్నా సాంకేతిక విద్య పొందే అవకాశంలేదు. ఇంజినీరింగ్, పాలిటెక్నిక్ కళాశాలల్లేవు. పాత ఐటీఐల తప్ప ఆధునిక కోర్సులు బోధించే అదనపు ఐటీఐ కళాశాలు లేవు. కెమికల్ ఇంజినీరింగ్, సివిల్ ఇంజినీరింగ్ రంగంలో అవకాశాలున్నా ఆ కోర్సులు చదువుకునేందుకు ప్రభుత్వ విద్యా సంస్థల్లేవు. పీహెచ్‌సీల్లో అరకొర వైద్య సేవలే అందుతున్నాయి. అత్యవసర వైద్యం కోసం హైదరాబాద్ వెళ్లేలోపే ప్రాణాలు పోతున్నాయి. ప్రతి మండల కేంద్రంలో 50 పడకల ఈఎస్ఐ ఆస్పత్రుల్ని నిర్మించాలని సీపీఐ(ఎం) పోరాడుతోంది,

రోడ్డు, అగ్ని ప్రమాదాలు

రోడ్డు, అగ్ని ప్రమాదాలు నిత్యకృత్యమయ్యాయి. కెమికల్, ఫార్మా కంపెనీల్లో బాయిలర్లు పేలి మంటలు చెలరేగుతున్నాయి. పాశమైలారం, బొంతపల్లి, ఖాజీపల్లి, బొల్లారం, గుమ్మడిదల, పటాన్‌చెరు ప్రాంతాల్లో వందల సంఖ్యలో అగ్ని ప్రమాదాలు జరిగాయి. ఈ ఏడాది కాలంలోనే 10 మంది వరకు ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయాలపాలయ్యారు. అనుమతులు ఇచ్చే సమయంలో ప్రభుత్వాలు సరైన చర్యలు తీసుకోకపోవడం, యాజమాన్యాల తప్పిదాలకు కార్మికులు బలవుతున్నారు. సీఐటీయూ జోక్యం చేసుకున్న చోట పరిహారం ఇప్పిస్తున్నారు. నిర్మాణ రంగంలో ఎత్తైన క్రేన్లపై పనిచేస్తూ జారీ పడి ప్రమాదాలకు గురవుతున్నారు.

నేడు బీరంగూడ బహిరంగ సభకు బీవీ రాఘువులు రాక

సీపీఐ(ఎం) అభ్యర్థి జె.మల్లిఖార్జున్ గెలుపు కోసం ఆదివారం అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని బీరంగూడ మండి మార్కెట్‌లో నిర్వహించే బహిరంగ సభకు సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున్ నియోజవకర్గ సమగ్రాభివృద్ధిపై మ్యానిఫెస్టో విడుదల చేసి మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనాల అమలుకు కృషి చేస్తానన్నారు. పారిశ్రామిక వాడల్లో సంక్షేమ భవనం నిర్మాణం, అర్హులైన పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాల కోసం పోరాడుతానని తెలిపారు. పాశమైలారం, జిన్నారం, బొంతపల్లి, ఖాజీపల్లి, ఆర్సీపురం, పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంతాల్లో కార్మికుల కుటుంబాల కోసం ప్రత్యేక గృహ సముదాయం ఏర్పాటుకు కృషి చేస్తామని, కార్మిక వాడల్లో బస్తీల్లో పీహెచ్‌సీలు, ఆర్సీపుర్ ఈఎస్ఐ ఆస్పత్రిని వెయ్యి పడకలకు పెంచి అభివృద్ధి చేస్తానన్నారు. సంగారెడ్డి వరకు మెట్రోలైన్ విస్తరణ, ఎంఎంటీఎస్ పటాన్‌చెరు వరకు పొడిగింపుకు కృషి చేస్తానన్నారు.



ఖమ్మం జిల్లా కామేపల్లి మండల పరిధిలోని పండితాపురం గ్రామంలో పార్టీ ఇల్లందు అభ్యర్థి దుగ్గి కృష్ణ ప్రచార కార్యక్రమంలో పాల్గొన్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర్ రావు



.నకిరేకల్‌లో బార్బర్ షాప్‌లో కటింగ్ చేస్తున్న నకిరేకల్ నియోజకవర్గ అభ్యర్థి బొజ్జ చిన్న వెంకులు




కాంగ్రెస్‌ను నమ్మితే అధోగతే.. : మంత్రి కేటీఆర్

కామారెడ్డి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం

నవతెలంగాణ-భిక్కనూర్/దోమకొండ

ధరణిని బంగాళాఖాతంలో వేస్తామని మేనిఫెస్టోలో పెట్టిన కాంగ్రెస్ పార్టీని నమ్మితే ప్రజల బతుకులు అధోగతి పాలవుతాయని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్ అన్నారు. ధరణిని తీసేస్తే లంచగొండుల, పైరవీకారుల దందా మొదలవుతుందని తెలిపారు. 55 ఏండ్ల కాంగ్రెస్ పాలనలో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడ్డారన్నారు. మళ్ళీ కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే రాష్ట్రం అంధకారంలోకి పోతుందని చెప్పారు. రైతులు, ప్రజల సంక్షేమానికి కృషిచేస్తున్న సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. శనివారం కామారెడ్డి నియోజకవర్గంలోని భిక్కనూర్ మండలం పెద్దమల్లారెడ్డి, కాచాపూర్ గ్రామాలతో పాటు, బీబీపేట్ మండల కేంద్రం, మాందాపూర్ గ్రామంలో రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో మంత్రికి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 42 పేజీలతో 420 అబద్దాల మేనిఫెస్టోను కాంగ్రెస్ ప్రవేశపెట్టిందని ఎద్దేవా చేశారు. ధరణిని రద్దు చేస్తే రైతులకు రైతు బీమా, పంటల పెట్టుబడి ఎలా వస్తుందని ప్రశ్నించారు. ఢిల్లీ దొరలు కావాలో గల్లీ లీడర్ కావాలో మీరే తేల్చుకోవాలని తెలిపారు. రాష్ట్రంలో రైతుల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందజేస్తూ పలు పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గంపగోవర్దన్, ఎంపీ బీబీపాటిల్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తిమ్మాయగారి సుభాష్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మెన్ ప్రేమ్ కుమార్ పాల్గొన్నారు.

పంచ్ తంత్రం!



ప్రతి దంపుకూ పక్క ప్లానొక్క టీవేసి
ఇన్చార్జి నొక్కరిన్ ఉంచవలయు
ఏ దంపు ఇన్చార్జి ఆ దంపుకే గాని
మరియొటి తెలుయొద్దుమచ్చుకైన
పంపు మన్నప్పుడు పకడుబందిగ మూట
మంచినీళ్ల వలనె పంచ వలయు
యేదున్నదీడబ్బు ఎటులొచ్చెనిచటికి
ఎవ్వండు నేమాత్రమెరుగరాదు

అన్న ఎరుకతో అందరినిఎన్నుకొనుచు
నల్ల దబ్బును ఎట్లెట్ల నడుపవలనో
ఎరిగినోడిదే విజయమ్ము ఎన్నికలల్లో
సకల శాస్త్రాల సారమ్ము వికలమాయె

\- ఏనుగు నరసింహారెడ్డి

మేడ్చల్‌లో ఎవరిది "పై" చెయ్యి !

- వజ్రేష్ వర్సెస్ మల్లారెడ్డి పోటా పోటీ ప్రచారం.
- బీఆర్ఎస్ అభ్యర్థి వైఫల్యాలే కాంగ్రెస్‌కు ప్రధానాస్త్రాలు
- తమవైపే జనం పాజిటివ్‌గా ఉన్నారని హస్తం నేత వ్యాఖ్యలు
- నేతలు వీడుతున్నా భయం లేదంటున్న గులాబీ పార్టీ

నవతెలంగాణ-బోడుప్పల్

మేడ్చల్‌లో రాజకీయం వేడెక్కుతోంది. కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేష్ యాదవ్, బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి మల్లారెడ్డి ఒకరిని మించి ఒకరు ఎన్నికల ప్రచారం హోరెత్తిస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఎవరిది "పై" చెయ్యి అనే రీతిలో ఎన్నికల ప్రచారం సాగుతోంది. ప్రభుత్వ వైఫల్యాలతో పాటుగా అధికార పార్టీ అభ్యర్థిపై ఉన్న అవినీతి ఆరోపణలనే కాంగ్రెస్‌పార్టీ ప్రధానాస్త్రాలుగా చేసుకుంది. తమవైపే జనం పాజిటివ్‌గా ఉన్నారని, ఎంతోమంది తమ పార్టీలో చేరుతున్నారని హస్తం నేతలు ధీమాతో ఉన్నారు. ఎంతమంది నేతలు కారును వీడినా భయం లేదని గులాబీ పార్టీ నేతలు తెలిపారు. అధికార పార్టీ వైఫల్యాలు, బీఆర్ఎస్ అభ్యర్థి మల్లారెడ్డిపై ఉన్న అవినీతి ఆరోపణలు, ఆగడాలపైనే కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థి వజ్రేష్ యాదవ్ ఎక్కుపెట్టారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అమలు చేయబోయే "ఆరు గ్యారంటీ"లను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోతున్నారు. గతంలో రెండు సార్లు ఎమ్మెల్యేగా పోటి చేసి ఓటమి చెందిన వజ్రేష్ యాదవ్ కు కొంత సానుభూతి ఉందన్న అభిప్రాయాన్ని విశ్లేషకులు వ్యక్తపరుస్తున్నారు. మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గంలో ఏ ఒక్కరిని కదిలించినా అందరి నోటా కాంగ్రెస్ పార్టీకి పాజిటివ్‌గా ఉందనే మాట వినిపిస్తున్నదని ఆ పార్టీ నేతలు చెబుతున్న మాట.



మల్లారెడ్డి ఏ రోజు పాలనపై దృష్టి పెట్టలేదని కేవలం స్వంత ప్రయోజనాల కోసమే పదవిని ఉపయోగించుకున్నాడనే విమర్శలు ఉన్నాయి. మల్లారెడ్డిపై సొంత పార్టీ నేతలే బహిరంగ విమర్శలు చేయడం కూడా కాంగ్రెస్‌కు అనుకూలంగా మారే అవకాశం లేకపోలేదని అంటున్నారు.

బలహీన పడుతున్న బీఆర్ఎస్.. అదేమీ లేదంటున్న గులాబీ పార్టీ

మల్లారెడ్డి ఏకపక్ష నిర్ణయాలు ఆయన కుటుంబ సభ్యుల పెత్తనంతో విస్తుపోతున్న బీఆర్ఎస్ క్యాడర్ క్రమక్రమంగా పార్టీని వీడుతున్నారు. ఇప్పటికే బోడుప్పల్ కార్పొరేషన్ నుండి బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఐదుగురు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్ళారు. ఘటకేసర్ నుంచి ఆరుగురు కౌన్సిలర్లు మారిపోయారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, మాజీ ప్రజాప్రతినిధులు ఇలా ఎంతోమంది కాంగ్రెస్‌లోకి చేరుతుండడంతో బీఆర్ఎస్ పార్టీ బలహీన పడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. అయితే ఎంతమంది పార్టీని వచ్చే నష్టం ఏమీ లేదని, సంక్షేమ పథకాలు అందుకున్న జనం తమవైపు ఉన్నారని గులాబీ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

'ఆధార్' ఆధారిత చెల్లింపు మోసాలు



ప్రజాస్వామ్యం అంటే "ప్రజల చేత - ప్రజల కొరకు - ప్రజల యొక్క" అర్థం పూర్తిగా మారిపోయి, కరడు కట్టిన నేరస్థులు, ఆర్థిక నేరస్థుల చేతుల్లో "నాయకుల చేత - నాయకుల కొరకు - నాయకుల యొక్క" గా మారిపోయింది. వారు కష్టపడి పన్నులు కట్టిన వారి డబ్బుని అక్రమ పద్ధతుల్లో సంక్షేమం పేరుతో ప్రభుత్వ ఖజానాలను, దేశాన్ని సంక్షోభం లోకి నెట్టి సర్వనాశనం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాలు, ప్రయోజనాలను నేరుగా జన్‌ధన్ బ్యాంకు ఖాతాల్లో వెయ్యటానికి ఆధార్ సంఖ్య చరవాణి సంఖ్యలను అనుసంధానం చేస్తున్నారు. స్థిరాస్థి రిజిస్ట్రేషన్లు, పాన్ నంబర్లను కూడా ఆధార్‌కు అనుసంధానం చేశారు. జీవితమంతా ఆధార్ మీదే ఆధార పడాలనేట్టుగా చేశారు. చివరకు ఆధార్ సంఖ్య "శస్త్రచికిత్స అద్భుతంగా జరిగింది కానీ రోగి మరణిం చాడు" అన్న చందంగా తయారైంది.

140 కోట్లు జనాభా ఉన్న మన దేశంలో 136 కోట్ల మంది ఆధార్ సంఖ్యను తీసుకున్నారు. కాగా ప్రపంచ ఆర్థిక వేదిక 2018 లోనే 110 కోట్ల మంది ఆధార్‌లు హ్యాక్ అయ్యాయని ఎంతగానో మొత్తుకున్నా యూనిక్ ఐడెంటి ఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (యూఐడీఏఐ) భారత ప్రభుత్వాలు మాత్రం అబ్బే అలాంటిదేమీ జరగలేదంటూ తేలిగ్గా కొట్టి పారేశారు. ఆధార్ ధ్రువీకరణ మొదలు, బయో మెట్రిక్ విశ్వసనీయత వరకు అనేక అనుమానాలున్నాయని అంతర్జాతీయ రేటింగ్ సంస్థ "మూడీస్" చెప్పినా పెడచెవిన పెట్టారు. 2023 అక్టోబర్ 9న అమెరికా నిఘా సంస్థ 'రీసెక్యూరిటీ' 81.5 కోట్ల భారతీయుల ఆధార్ పూర్తి సమాచారాన్ని క్లియర్‌అండ్ డార్క్‌వెబ్‌లో 60 లక్షల రూపాయలకు అమ్మకానికి పెట్టారని వెల్లడించింది. కోవిడ్ కాలంలో కరోనా వాక్సిన్లకు ఆధార్, బయోమెట్రిక్‌ల గోప్యత లోపించటంతో కోట్ల మంది సమాచారం తస్కరించబడింది.

ప్రభుత్వం, బ్యాంకులు ఆర్భాటంగా, వేలంవెర్రిగా ఆధార్ ని అందరినెత్తినా బలవంతంగా రుద్దటం మూలంగానే ఆర్థిక లావాదేవీల్లో అనేక మోసాలు జరుగుతున్నాయి. ప్రభుత్వ కార్యాలయాల్లో ఇప్పటికే సిలికాన్, బంకవేలి ముద్రల నకిలీ నకళ్లతో దొంగ హాజరు నిధుల తస్కరణ జరుగుతున్నాయి. ఇదే పద్ధతిలో సైబర్ నేరగాళ్ళు బంక వేలిముద్రలతో బ్యాంకు ఖాతాలోలని డబ్బంతా ఊడ్చేస్తున్నారు. సుప్రీంకోర్టు ఆధార్ వినియోగాన్ని కొన్ని షరతులతో అనుమతించి నప్పటికీ, నానాటికీ ఆర్థిక మోసాలు పెరిగిపోతున్నాయి. పాత పద్ధతిలో ఏటీఎంల నుంచి కార్డుతో సులువుగా డబ్బులు తీసుకునే వాళ్ళం. ఏటీఎం సెంటర్లలో నేరస్తులు మన కార్డుల్ని క్లోనింగ్ చేసి డబ్బంతా కాజేస్తున్నారు.

ప్రస్తుతం ఆధార్ ఎనంబ్లడ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈ పీఎస్) అంటే ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థ కొంప నిలు వునా ముంచుతోంది. ఒక రకంగా కూలీలకు, రైతులకు, గ్రామీణులకు, అత్యవసరమైన వారికి ఈ వ్యవస్థ బాగున్న ప్పటికీ సైబర్ నేరగాళ్ళు నకిలీ వేలిముద్రలతో దఫాకు పది వేల రూపాయలు చొప్పున రోజు మొత్తం మీద 5 దఫాలు అంటే 50 వేల రూపాయలు కొట్టేస్తున్నారు. మన ఖాతాలో, లక్ష రూపాయలుంటే మనకు బ్యాంకు నుండి, ఎస్ఎంఎస్,ఈ మెయిల్ రాకపోయినా, ఈ లావాదేవీలను మనం గమనించక పోయినా రెండు రోజుల్లో ఖాతా మొత్తం ఖాళీ అవుతుంది. ఈ వ్యవస్థ ద్వారా 2010 నుండి బ్యాంకులో ఆధార్ కార్డు ద్వారా డబ్బులు వేయడం, తీయటం, బదిలీ చేయటం సాధ్యపడుతుంది. బ్యాంకు లావాదేవీలకు ఎస్ఎంఎస్ ద్వారా ఓటీపీ వస్తుంది. (ఏఈపీఎస్)లో ముందస్తు సమాచారం ఏదీ ఉండదు. ఈ లావాదేవీలన్నీ రిజర్వ్ బ్యాంకు పర్యవేక్షిస్తుంది. నేషనల్ పేమెంట్ కోపరేషన్ ఆఫ్ ఇండియా(ఎన్‌పీసీఐ)ని బ్యాంకులకు ఉచితంగా ఇచ్చింది.

2019-2023 మధ్య 8,68 లక్షల కోట్ల రూపాయల లావాదేవీలన్నీ (ఏఈపీఎస్) ద్వారా జరిగాయి. మార్చి 2023 నాటికి 34.1 కోట్ల మంది 485.94 కోట్ల (ఏఈపీఎస్) లావాదేవీలను జరిపారని కేంద్రమంత్రి డా॥ భగవత్ కరాడ్ చెప్పారు. అయితే ఎస్‌బీఐ నుండే ఎక్కువ లావాదేవీలు జరగటం వల్ల ఎక్కువ మోసాలు ఇక్కడే జరిగాయి. 2023లో (ఏఈ పీఎస్) లావాదేవీల్లో ఎస్‌బీఐలో రూ.10 లక్షలు, కెనరా బ్యాంకులో రూ.14.29 లక్షలు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాలో రూ.9.91 లక్షలు, పంజాబ్ నేషనల్ బ్యాంకులో రూ.8.79 లక్షలు పోగొట్టుకున్నారని, సైబర్ క్రైమ్ gov.in నమోదు కాని లావాదేవీలు, కోట్లలో ఉండొచ్చు అనే సందేహమూ ఉంది. (యూఐడీఏఐ)లో మోసపూరిత ప్రయత్నాలను గుర్తించేందుకు నకిలీ బంక వేలిముద్రలను పసికట్టేందుకు అంతర్గతంగా భద్రమైన వేలిముద్రలను మేధా అభివృద్ధి యాంత్రిక వ్యవస్థ ఉందని సదరు మంత్రిగారు ఎప్పుడో చెప్పారు.

కానీ 2023 సెప్టెంబరు 16న మా అమ్మ గారి కోసం బీఎస్ఎన్ఎల్, చందానగర్, హైదరాబాద్ కెళ్ళి నా ఆధార్ వివరాలు, బయోమెట్రిక్ ఇచ్చి సిమ్‌కార్డు తీసుకున్న, రెండు రోజులకే నా కొటక్ మహీంద్రా బ్యాంకు ఖాతా నుండి 9999 రూపాయలు, యూనియన్ బ్యాంకు ఖాతా నుండి రూ.మూడు వేలు (ఏఈపీఎస్) ద్వారా సైబర్ నేరగాళ్ల కొట్టేశారు. (ఏఈపీఎస్) లావాదేవీలు సెల్‌ఫోన్లలో సిగ్నల్స్ సరిగ్గా రాక, ఇంటర్ నెట్ కనెక్టివిటీ సరిగా లేక, బ్యాంకు ఖాతాల్లో తగు బ్యాలెన్సులేక, శ్రామికులు, వృద్ధులు, బాలల బయోమెట్రిక్ నిర్ధారణ క్లిష్టంగా ఉండటం వల్ల 34 శాతం విఫలమవుతున్నాయి. లేకుంటే మరిన్ని సైబర్ దాడుల్లో మరిన్ని డబ్బులు పోయేవి. బ్యాంకు ఏజెంట్లు, బిజినెస్ కరస్పాండెంట్ల ద్వారా ఈ రకం లావాదేవీలు జరుపుకోవటానికి 35 బ్యాంకులు అంగీకరించాయి. దేశవ్యాప్తంగా బ్యాంకు ప్రాంగణంలో 1,10,282 ఏటీఎంలు, బ్యాంకు వెలుపల 1,38,579 ఏటీఎంల నిర్వహణ ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో ఉన్నందున వీటి పర్యవేక్షణ, రక్షణ వ్యవస్థ, భద్రత లోపించాయి. (ఏఈపీఎస్) లావాదేవీలు సక్రమంగా జరిగేందుకు యూపీఐ లైట్‌ఆఫ్ వైస్ బయోమెట్రిక్ ధ్రువీకరణ, నాణ్యమైన, నమ్మకమైన 'నోబెల్ సాఫ్ట్‌వేర్'ని వాడాలి.

బ్యాంకు ఖాతాల్లో తమ ప్రమేయం లేకుండా సైబర్ నేరగాళ్ల (ఏఈపీఎస్) ద్వారా డబ్బుని కాజేస్తే 3 పని దినా ల్లోగా బ్యాంకు కి తెలియజేస్తే 90 రోజుల తర్వాత డబ్బు తిరిగి ఇస్తారట. లేదంటే ఇవ్వరని ఆర్‌బీఐ చెబుతుంది. సీరియస్‌గా ఉన్న వారు, హాస్పిటల్ రోగులు, బ్యాంకు నుండి లావాదేవీల ఎస్ఎంఎస్‌లు, మెయిల్స్ రానివారు, ఫోన్లు పాడైనవారు, సెల్‌ఫోన్ సిగ్నల్స్ రానివారు, బిజీగా ఉండే వారు, నిరక్షరాస్యులకు 3 పని దినాల్లో బ్యాంకుకు తెలియ చేయటం సాధ్యమేనా! (ఏఈపీఎస్) బాధితులు ముందుగా బ్యాంకు హెల్ప్ లైన్ లేదా కస్టమర్ కేర్ కి ఫోన్ చేసి జరిగిన మోసం చెప్పి, ఖాతాలో అన్ని బ్యాంకు లావాదేవీలను నిలిపివేయ్యమని చెప్పాలి. తర్వాత సైబర్‌క్రైమ్ gov.in ఫిర్యాదు చేసి, ఆ ఎక్నాలెడ్జిమెంట్ ఉన్న పేపర్‌ను, ఒక లెటర్‌ను బ్యాంకులో ఇవ్వాలి. బ్యాంకు నుండి దీనికి సంబంధించిన ఫిర్యాదు సంఖ్యను, రశీదును తీసుకోవాలి. వెంటనే ఖాతా నుండి ఆధార్ వివరాలను తీసివేయాలి. దీని బదులు డ్రైవింగ్ లైసెన్స్, ఓటరు కార్డు, పాస్‌పోర్టు లాంటి జిరాక్స్ (ఏదో ఒక ప్రూఫ్) ఇవ్వాలి. బ్యాంకు అకౌంట్ తెరిచే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో ఆధార్ ఇవ్వొద్దు మరీ తప్పనిసరి అయితే 12 అంకెల బదులు చివరి 4 అంకెలున్న ముసుగు (మాస్క్) ఆధార్ మాత్రమే ఇవ్వాలి. అనవసరంగా బయోమెట్రిక్ ఇవ్వొద్దు. కొన్ని బ్యాంకులు కావాలని ఖాతాదారుల్ని ఆధార్, బయోమెట్రీలంటూ చంపేస్తున్నారు.

తరచూ బ్యాంకు ఖాతా, డెబిట్ ఏటీఎం కార్డు పిన్, ఇంటర్ నెట్ పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండాలి. సంఘటన జరిగిన 90 రోజుల తర్వాత పోగొట్టుకున్న మొత్తం డబ్బుని ఖాతాలో జమ చెయ్యాలని బ్యాంకుని అడగాలి, స్థిరాస్థుల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లావాదేవీలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. (యూఐడీఏఐ) సైట్ కి వెళ్లి విస్తువల్ ఐడీని సృష్టించుకోవాలి. ఆధార్ సంఖ్యలో 12 అంకెలు కాగా, వీఐడీలో 16 అంకెలు ఉంటాయి. వీఐడీ అంకెలు మనకు తప్ప వేరే ఎవరికీ తెలియవు. ఇదే సంఖ్యతో ఆధార్‌కు తాళం వెయ్యొచ్చు, తాళంతీయ్యొచ్చు, మన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వృద్ధుల ఆధార్‌లన్నింటికీ మన ఫోన్ నంబరు ఇవ్వటం సురక్షితం. (యూఐ డీఏఐ)లోకి వెళ్ళి మన ఆధార్ ధ్రువీకరణ ఎన్నిసార్లు (50 సార్లు జరిగిన) జరిగింది, ఎక్కడైనా దుర్వినియోగమవుతున్నదీ. తెలుసుకొని జాగ్రత్తగా ఉండొచ్చు. మిత్రులు, నెట్ సెంటర్లలో ఆధార్ డౌన్‌లోడ్ చేసుకుంటే, పనయ్యాక దీన్ని తొలగించేసుకోవాలి. సామాజిక మాధ్యమాలున్న వారు వివరాల గోప్యతను పాటించాలి.

బ్యాంకు లావాదేవీ ఆన్‌లైన్‌లో జరిపేటప్పుడు బ్యాంకు సైట్ పేరు సరిగ్గా ఉందా! లేదా! చివర డాట్ కామ్ లేదా ఆర్గ్ డాట్ ఉందాలేదా? సరిచూసుకోవాలి. తెలియని లింకులు వస్తే నొక్కవద్దు ఫోన్లలో మన వివరాలు చెప్పవద్దు. ఇలాంటి మోసాలు అరికట్టాలంటూ సెప్టెంబరు 2023లో "బ్యాంక్ బచావో... దేశ్ బచావో..." అంటూ సామాజిక కార్యకర్తలు రిజర్వు బ్యాంకు గవర్నర్‌ని కలిసి (ఏఈపీఎస్) మోసాలకు బ్యాంకులనే బాధ్యులు చెయ్యాలని లేఖ ఇచ్చారు. ఆధార్ వ్యవస్థ పటిష్ఠత కోసం పార్లమెంట్, సుప్రీంకోర్టుల సమన్వయం, పర్యవేక్షణ, మార్గదర్శకత్వం ఉండితీరాలి. దేశంలో ఏ ఒక్క పౌరుడికి ఆధార్ సంఖ్య ఎలాంటి నష్టాన్ని కలిగించకూడదు.

> **తరచూ బ్యాంకు ఖాతా, డెబిట్ ఏటీఎం కార్డు పిన్, ఇంటర్‌నెట్ పాస్‌వర్డ్‌లను మారుస్తూ ఉండాలి. సంఘటన జరిగిన 90 రోజుల తర్వాత పోగొట్టుకున్న మొత్తం డబ్బుని ఖాతాలో జమచెయ్యాలని బ్యాంకుని అడగాలి, స్థిరాస్థుల రిజిస్ట్రేషన్లు, బ్యాంకు లావాదేవీలు, ప్రభుత్వ పథకాల లబ్ధిదారులు చాలా అప్రమత్తంగా ఉండాలి. (యూఐడీఏఐ) సైట్ కి వెళ్లి విస్తువల్ ఐడీని సృష్టించుకోవాలి. ఆధార్ సంఖ్యలో 12 అంకెలు కాగా, వీఐడీలో 16 అంకెలు ఉంటాయి. వీఐడీ అంకెలు మనకు తప్ప వేరే ఎవరికీ తెలియవు. ఇదే సంఖ్యతో ఆధార్‌కు తాళం వెయ్యొచ్చు, తాళంతీయ్యొచ్చు, మన కుటుంబ సభ్యులు, ముఖ్యంగా వృద్ధుల ఆధార్‌లన్నిం టికీ మన ఫోన్ నంబరు ఇవ్వటం సురక్షితం.**

- ఎ.ఎన్.ఎస్.శంకరరావు, 9848685679

> **బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా, గృహలక్ష్మి పథకాల్లో అర్హులకు లబ్ధి చేకూరక పోవడంతో ఆ పార్టీ పట్ల వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలోనే అత్యంత ప్రతి ష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడి గడ్డ బ్యారేజీ వంతెన పిల్లర్లు కుంగిపోవడం చర్చనీయాంశంగా మారింది. కల్వకుంట్ల చంద్ర శేఖర్‌రావు కుటుంబం అవినీతికి ఇది సాక్షంగా చూపుతూ విపక్షాలు, ప్రతిపక్షాలు విరుచుకు పడుతున్నాయి. దీంతో బీఆర్ఎస్ సంది గ్ధంలో పడింది. దీనికితోడు బీఆర్ఎస్ ముఖ్య నేతలు అందరూ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ కాస్త బలహీన పడుతోంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ 'ఓడిపోతే రెస్ట్ తీసుకుంటా' అనడం... ఓటమికి చేరువైన ట్టేననే అర్థం వస్తోంది.**

'తుమ్మెద'లా వాలిపోతున్నారు!



అసలే చలి చుట్టుముడుతోంది. వాతావరణంలో కూడా చాలా మార్పులు కనిపిస్తున్నాయి. దీంతో పాటే ప్రజలు కాలానిక నుగునంగా మారుతున్నారు. ఇక పట్టణాల్లో అయితే చలి పెరిగితే చాలు చాయ్‌కొట్టు, బజ్జీల కొట్టు వద్దకు తుమ్మెదల్లా వాలిపోతున్నారు. మధ్యలో తుమ్మెద ఎందు కొచ్చిందని అనుకుంటున్నారా...? తుమ్మెదకు ఓ గుణం ఉంది. తేనె ఉండే పువ్వులు కనిపిస్తే చాలు వాలిపోతుంటాయి. ప్రస్తుత రాజకీయ పరిస్థితులు కూడా తుమ్మె దలానే ఉంటున్నాయి. ఎక్కడ మనీ, సీటు ఉంటే అక్కడే నాయకులు తుమ్మెదల్లా వాలిపోతున్నారు. ఎందుకంటే ఇది ఎన్నికల సీజన్-2023 కాబట్టి. ఈ యేడు తెలంగాణ రాష్ట్రంలో జరిగే ఎన్నికల దృష్ట్యా రాజకీయాలు శరవేగంగా మారుతున్నాయి. రాష్ట్రంలోని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ ఇలా అనేక పార్టీల్లోనూ రాజకీయం పుంజుకుంటోంది. పొత్తులు, ఎత్తులు, వ్యూహాలతో రాజకీయ చతురత చూపుతున్నారు. మేనిఫెస్టోలు, వాదోపవా దాలు, చర్చలు, సర్వేలు, సవాళ్లతో రాజకీయం హీటెక్కుతోంది. గెలుపు తమదంటే తమదే నంటూ తేగేసి చెబుతున్నారు. పథకాలు, గ్యారెంటీలు అంటూ మాయ జేసేందుకు కుటిల యత్నాలు చేస్తున్నారు. ఇక బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ మూడోసారి ముచ్చటగా అధికార పగ్గాలు చేపట్టేందుకు సర్వశక్తులు ఒడ్డుతున్నారు. కర్నాటక విజయ దరహాసంతో కాంగ్రెస్ ఎత్తులకు పైఎత్తులు వేస్తూ ఒక్కసారి అవకాశమివ్వండంటూ అధికారం చేజి క్కిచ్చుకునే పనిలో పడింది. బీజేపీ సైతం ఒకపక్క అన్నీ ఊసిపోతున్నా తెలంగాణ రాష్ట్రంలో పాగా వేసేందుకు జిమ్మిక్కులు చేస్తోంది. ఏకంగా బీసీని ముఖ్య మంత్రి చేస్తామంటూ ప్రకటించింది. మొత్తంగా రాష్ట్రంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ నెలకొంది. ఎందుకంటే బీజేపీ కులమత రాజకీయాలు, ప్రజల్లో విద్వేషాలు రెచ్చగొట్టే విధానాలకు పాల్పడడమే కాకుండా కార్మిక, కర్షక, ప్రజా హక్కులు కాలరాస్తోంది. ముఖ్యంగా ఢిల్లీలో రైతులపై చేయించిన దమనకాండ చరిత్రలో మరిచిపోలేనిదిగా మిగిలిపోయింది. ప్రజలు కూడా బీజేపీని నమ్మే పరిస్థితిలో లేరు. అయినా రాష్ట్రంలో అధికారం చేజిక్కి చ్చుకునేందుకు మత విద్వే షాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగానే ఇటీ వల ఓ సభలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీజేపీకి అధికారమిస్తే రాష్ట్రంలో ముస్లింల రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. ఇలాంటి ప్రకటనలు హిందూ, ముస్లింల మధ్య విభేదాలు సృష్టించవా? అధికారంలోకి రావాలంటే ప్రజల కోసం పనిచేయాలి. వామపక్షాల వలే అధికారం ఉన్నా లేకున్నా ప్రజల కోసం పోరా డాలి. వారి యోగక్షేమాల గురించి, వారు పడుతున్న ఇబ్బందుల గురించి ఎప్పటికప్పుడూ తెలుసుకోవాలి. అప్పుడు ప్రజలు గుర్తిస్తారు. కానీ ఇలాంటి విద్వేషాల వల్ల ఆ ఆపార్టీ పలచన కావడమే తప్ప వేరే లేదు.

ఇక బీఆర్ఎస్ ప్రవేశపెట్టిన రైతు బంధు, రైతు బీమా, గృహలక్ష్మి పథకాల్లో అర్హులకు లబ్ధి చేకూరకపోవడంతో ఆ పార్టీ పట్ల వ్యతిరేకత వచ్చింది. ఈ క్రమంలోనే అత్యంత ప్రతి ష్టాత్మకమైన కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన మేడి గడ్డ బ్యారేజీ వంతెన పిల్లర్లు కుంగిపోవడం చర్చ నీయాంశంగా మారింది. కల్వకుంట్ల చంద్ర శేఖర్‌రావు కుటుంబం అవినీతికి ఇది సాక్షం గా చూపుతూ విపక్షాలు, ప్రతిపక్షాలు విరుచుకు పడుతున్నాయి. దీంతో బీఆర్ఎస్ సంది గ్ధంలో పడింది. దీనికితోడు బీఆర్ఎస్ ముఖ్య నేతలు అందరూ పార్టీ వీడి కాంగ్రెస్‌లో చేరడంతో బీఆర్ఎస్ కాస్త బలహీన పడుతోంది. ఈ నేపథ్యంలోనే కేసీఆర్ 'ఓడిపోతే రెస్ట్ తీసుకుంటా' అనడం... ఓటమికి చేరువైన ట్టేననే అర్థం వస్తోంది. వీటన్నింటిని ఓటర్లు గమనిస్తూనే ఉన్నారు. మరోవైపు పోలీసు శాఖ కూడా అప్రమత్తం అయింది. డబ్బు అక్రమ రవాణా, ఓటర్లను లొంగదీసుకునేందుకు మద్యం, విలువైన వస్తువుల సరఫరా కాకుండా నిఘా పెట్టింది. చెక్ పోస్టుల వద్ద ముమ్మర తనిఖీలు చేపడుతున్నారు. ఇప్పటికే చాలా చోట్ల అవినీతి డబ్బు కోట్ల రూపాయల్లో పట్టుబడింది. కాగా ఇప్పటికే ఆయా నియోజక వర్గాల్లో ఆయా పార్టీలు డబ్బులను అక్రమ రవాణా చేసినట్టు ఆరోపణ లొస్తున్నాయి. మొత్తంగా పార్టీలు అన్నీ ఓటును కొనుగోలు చేసే పనిలో పడినట్టు అర్థమవుతోంది. అధికార పగ్గాలు చేజిక్కిచ్చుకు నేందుకు కోట్ల రూపాయలు కుమ్మరించి ఓట్లు కొల్లగొట్టేం దుకు తుమ్మెదల్లా వాలిపోతున్నాయి. ఇప్పటికే విజయభేరీ సభలు, ఆశీర్వాద సభలు అంటూ కోట్ల రూపాయలు ఖర్చు చేశాయి. ఓటుకు నోటు, మద్యం పంచుతూ పార్టీలు బలా బలాలు తేల్చుకుంటున్నాయి. ఇప్పటికైనా ఓటరు మేలుకుని అభివృద్ధి చేసే నాయకులను గుర్తించి ఎన్నుకో వాల్సిన సమ యం ఆసన్నమైంది. ప్రలోభాలకు, మాయమాటలకు లొంగ కుండా ఉత్తమ నాయకులను ఎన్నుకోవాలి. లేదంటే పాత సీసాలో కొత్తసారాయి అన్న చందంగా షరామామూలే అవుతుంది.

- వేముల క్రాంతికుమార్, 9676717377

భారతదేశంలో పర్యావరణ చట్టాలు

- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545





మానవునితో పాటు సమస్త జీవ కోటి మనుగడ పర్యావరణంపైనే ఆధారపడి ఉంటుంది. అలాంటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం పౌరుల ప్రాథమిక బాధ్యత అని భారత రాజ్యాంగం చెబుతుంది. భారతదేశంలోని పర్యావరణ చట్టాలు పర్యావరణాన్ని రక్షించడానికి, సహజ వనరులను పరిరక్షించడానికి మరియు పర్యావరణ సమతుల్యతను ప్రభావితం చేసే కార్యకలాపాలను నియంత్రించడానికి అనుగుణంగా రూపొందించబడ్డాయి. ఈ చట్టాలు స్థిరమైన అభివృద్ధిని నిర్ధారించడానికి మరియు పర్యావరణ క్షీణతను తగ్గించడానికి కృషి చేస్తాయి. భారతదేశంలో పర్యా వరణ చట్టాలను విజయవంతంగా అమలు చేయడం అనేది ప్రభుత్వ సంస్థలు, న్యాయవ్యవస్థ, పౌర సమాజం, భారతీయ పౌరు లతో కూడిన సమిష్టి బాధ్యత. పర్యావరణ పరిరక్షణ కోసం సామూహిక, వ్యక్తిగత బాధ్యత తీసుకోవడం ద్వారా, భారత దేశం మరింత స్థిరమైన, పర్యావరణ సమతుల్య భవిష్యత్తు కోసం ప్రయత్నించవచ్చు. ఆ దిశగా పర్యావరణ చట్టాలపై అందరికి అవగాహన కలిగి ఉండాల్సిన అవసరం ఉంది.

1. భారత పర్యావరణ చట్టం (1986) భారత రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారం ఆమోదించబడింది?
ఎ) ఆర్టికల్ 51　బి) ఆర్టికల్ 235
సి) ఆర్టికల్ 32　డి) ఆర్టికల్ 253

2. పర్యావరణ చట్టాల యొక్క ప్రాథమిక లక్ష్యం ఏమిటి?
ఎ) కార్పొరేషన్ల హక్కులను పరిరక్షించడం
బి) పర్యావరణాన్ని సంరక్షించడం, రక్షించడం
సి) ఏ ధరకైనా ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం
డి) వ్యక్తిగత స్వేచ్ఛను పరిమితం చేయడం

3. భారతదేశ వన్యప్రాణి సంరక్షణ చట్టం ఎప్పుడు ఆమోదించబడింది?
ఎ) 1972　బి) 1986
సి) 1927　డి) 1992

4. అటవీ సంరక్షణ చట్టం (1980) ఏ సంవత్సరంలో సవరించంబడింది?
ఎ) 1982　బి) 1988
సి) 1972　డి) 1992

5. ఆరోగ్యకరమైన, ఆహ్లాదకరామైన పర్యావరణంలో జీవించటం అనేది ప్రజల ప్రాథమిక హక్కులలో అంత ర్భాగమని రాజ్యాంగంలోని ఏ అధికరణం చెబుతుంది?
ఎ) ఆర్టికల్ 51　బి) ఆర్టికల్ 235
సి) ఆర్టికల్ 21　డి) ఆర్టికల్ 253

6. పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖ ఏ సంవత్సరంలో ఏర్పాటు అయ్యింది?
ఎ) 1982　బి) 1988
సి) 1972　డి) 1985

7. రాజ్యాంగంలోని ఆర్టికల్ 51 ఎ (జి) పర్యావరణ పరిరక్షణ ఎవరి బాధ్యతగా పేర్కొంటుంది?
ఎ) ప్రభుత్వం　బి) పౌరులు
సి) రాజ్యాంగం　డి) న్యాయస్థానాలు

8. జీవవైవిధ్య సంరక్షణ చట్టాన్ని భారత పార్లమెంటు ఏ సంవత్సరంలో ఆమోదించబడింది?
ఎ) 1999　బి) 1988
సి) 2002　డి) 2022

9. యునైటెడ్ స్టేట్స్‌లోని ఏ ఫెడరల్ ఏజెన్సీ పర్యావరణ చట్టాలను అమలు చేయడానికి బాధ్యత వహిస్తుంది?
ఎ) ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (EPA)
బి) ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (FBI)
సి) రక్షణ శాఖ (DoD)
డి) ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA)

10. నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ పాలసీ యాక్ట్ (NEPA) ప్రయోజనం ఏమిటి?
ఎ) గాలి నాణ్యత ప్రమాణాలను ఏర్పాటు చేయడం
బి) ప్రమాదకర వ్యర్థాలను పారవేయడాన్ని నియంత్రించడం
సి) ఫెడరల్ ప్రాజెక్ట్‌ల కోసం పర్యావరణ ప్రభావ అంచనాలు అవసరం
డి) వన్యప్రాణుల సంరక్షణను ప్రోత్సహించడం

11. యునైటెడ్ స్టేట్స్‌లోని ఏ చట్టం ప్రమాదకర వ్యర్థాల నిర్వహణ, పారవేయడాన్ని నియంత్రిస్తుంది?
ఎ) క్లీన్ ఎయిర్ యాక్ట్
బి) స్వచ్ఛమైన నీటి చట్టం
సి) వనరుల సంరక్షణ మరియు పునరుద్ధరణ చట్టం (RCRA)
డి) ఆక్యుపేషనల్ సేఫ్టీ అండ్ హెల్త్ యాక్ట్ (OSHA)

12. పర్యావరణ చట్టంలో "స్థిరమైన అభివృద్ధి" భావన యొక్క లక్ష్యం ఏమిటి?
ఎ) ఏ ధరకైనా ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించండి
బి) పర్యావరణ పరిరక్షణతో ఆర్థికాభివృద్ధిని సమతుల్యం చేయండి
సి) భవిష్యత్ తరాల ప్రయోజనాలను ప్రత్యేకంగా పరిరక్షించండి
డి) అన్ని రకాల పారిశ్రామిక అభివృద్ధిని నిషేధించండి

13. పర్యావరణ చట్టంలో "పబ్లిక్ ట్రస్ట్" సిద్ధాంతం ఈ కింది వాటిలో దేనిని సూచిస్తుంది?
ఎ) ప్రభుత్వ వనరులు ప్రైవేట్ కార్పొరేషన్ల ఆధీనంలో ఉంటాయి
బి) సహజ వనరుల రక్షణకు ప్రభుత్వాలు బాధ్యత వహించవు
సి) ప్రభుత్వాలు ప్రజా ప్రయోజనాల కోసం కొన్ని సహజ వనరులను కాపాడాలి
డి) సహజ వనరులను ప్రైవేటీకరించాలి మరియు అత్యధిక బిడ్డర్‌కు విక్రయించాలి

14. సమగ్ర పర్యావరణ ప్రతిస్పందన, పరిహారం మరియు బాధ్యత చట్టం (CERCLA) ఇలా కూడా పిలుస్తారు?
ఎ) క్లీన్ ఎయిర్ యాక్ట్
బి) సూపర్ ఫండ్ చట్టం
సి) స్వచ్ఛమైన నీటి చట్టం
డి) అంతరించిపోతున్న జాతుల చట్టం

15. పర్యావరణ చట్టంలో, "EIA" అనే పదం దేనిని సూచిస్తుంది?
ఎ) పర్యావరణ ప్రభావ అంచనా
బి) ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అలవెన్స్
సి) పర్యావరణ పెట్టుబడి ఒప్పందం
డి) పర్యావరణ సమాచార చట్టం

16. పర్యావరణ చట్టంలో "నో-హామ్ సూత్రం" భావన అంటే:
ఎ) పర్యావరణ హాని ఎల్లప్పుడూ ఆమోద యోగ్యమైనది.
బి) రాష్ట్రాలు తమ సరిహద్దులకు మించి జరిగే హానికి బాధ్యత వహించవు.
సి) రాష్ట్రాలు ఇతర రాష్ట్రాలకు పర్యావరణ హానిని నిరోధించాలి.
డి) పర్యావరణ హాని అనేది కేవలం దేశీయ సమస్య.



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

ప్రధాన భారతీయ పర్యావరణ చట్టాలు		
	పర్యావరణ చట్టాలు	సంవత్సరం
1	భారతీయ అటవీ చట్టం	1927
2	వన్యప్రాణుల రక్షణ చట్టం	1972
3	నీరు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం,	1974
4	నీరు (కాలుష్య నివారణ, నియంత్రణ) సెస్ చట్టం,	1977
5	అటవీ (సంరక్షణ) చట్టం	1980
6	వాయు (కాలుష్య నివారణ నియంత్రణ) చట్టం	1981
7	వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) (కేంద్రపాలిత ప్రాంతాలు) నియమాలు	1983
8	పర్యావరణ పరిరక్షణ చట్టం	1986
9	శక్తి పరిరక్షణ చట్టం	2001
10	జీవ వైవిధ్య చట్టం	2002
11	షెడ్యూల్డ్ తెగలు, ఇతర సాంప్రదాయ అటవీ నివాసులు (అటవీ హక్కుల గుర్తింపు) చట్టం	2006
12	నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ చట్టం	2010

17. యునైటెడ్ స్టేట్స్‌లో, పురుగుమందుల వాడకం, పారవేయడాన్ని నియంత్రించడానికి ఏ ఫెడరల్ ఏజెన్సీ బాధ్యత వహిస్తుంది?
ఎ) ఎన్విరాన్‌మెంటల్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (EPA)
బి) ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (FDA)
సి) వ్యవసాయ శాఖ (USDA)
డి) డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెూమ్‌ల్యాండ్ సెక్యూరిటీ (DHS)

18. పర్యావరణ చట్టం సందర్భంలో " బ్రౌన్‌ఫీల్డ్స్ " అనే పదం దేనిని సూచిస్తుంది?
ఎ) కలుషితమైన పారిశ్రామిక ప్రదేశాలు
బి) రక్షిత అరణ్య ప్రాంతాలు
సి) నేల నాణ్యత తక్కువగా ఉన్న వ్యవసాయ భూములు
డి) ప్రమాదకర వ్యర్థాలను పారవేసే ప్రదేశాలు

19. గృహాల చెత్త వంటి ఘన వ్యర్థాలను పారవేయడాన్ని యునైటెడ్ స్టేట్స్‌లోని ఏ చట్టం నియంత్రిస్తుంది?
ఎ) క్లీన్ ఎయిర్ యాక్ట్
బి) స్వచ్ఛమైన నీటి చట్టం
సి) వనరుల సంరక్షణ మరియు పునరుద్ధరణ చట్టం (RCRA)
డి) అంతరించిపోతున్న జాతుల చట్టం

20. పర్యావరణ చట్టంలో, పర్యావరణ ప్రభావ అంచనా (EIA) ప్రయోజనం ఏమిటి?
ఎ) ప్రాజెక్ట్ ఆర్థిక ప్రభావాన్ని అంచనా వేయడానికి
బి) ప్రాజెక్ట్ రాజకీయ చిక్కులను అంచనా వేయడానికి
సి) ప్రాజెక్ట్ సంభావ్య పర్యావరణ ప్రభావాలను అంచనా వేయడానికి
డి) ప్రాజెక్ట్ సాంస్కృతిక ప్రభావాన్ని అంచనా వేయడానికి

21. ఏ సంవత్సరంలో భారతదేశం జాతీయ అటవీ విధానం రెండవ ఎడిషన్‌ను ప్రారంభించింది?
ఎ) 1986　బి) 1988
సి) 1989　డి) 2002

22. వాయు (కాలుష్య నివారణ మరియు నియంత్రణ) చట్టం, 1981 ప్రకారం, పరిసర గాలి నాణ్యత కోసం ప్రమాణాలను నిర్ణయించే అధికారం ఏ సంస్థకు ఉంది?
ఎ) భారత పర్యావరణ మంత్రిత్వ శాఖ
బి) కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి
సి) రాష్ట్ర గృహ వ్యవహారాలు మంత్రిత్వ శాఖ
డి) కేంద్ర గృహ వ్యవహారాలు మంత్రిత్వ శాఖ

23. ఈ కింది వాటిలో అటవీ నివాస షెడ్యూల్ తెగల అటవీ హక్కులు ఏవి?
ఎ) అటవీ భూములలో జీవించే హక్కు
బి) చిన్నపాటి అటవీ ఉత్పత్తులను సేకరించడం, ఉపయోగించడం
సి) అటవీ భూములపై యాజమాన్య హక్కు కలిగిఉండటం　డి) పైవన్నీ

24. వాయు (కాలుష్య నివారణ, నియంత్రణ) చట్టం, 1981లో ధ్వని కాలుష్య నివారణని ఎప్పుడు చేర్చారు?
ఎ) 1983　బి) 1986
సి) 1987　డి) 1989

25. భారతదేశంలో గ్రీన్ అడ్వకేట్ గా ఎవరిని పిలుస్తారు?
ఎ) ఎం.సి మెహతా　బి) పి.సి మెహతా
సి) కులదీప్ సింగ్　డి) ఎం.సి సింగ్

సమాధానాలు				
1. డి	2. బి	3. ఎ	4. బి	5. సి
6. డి	7. బి	8. సి	9. ఎ	10. సి
11. సి	12. బి	13. సి	14. బి	15. ఎ
16. సి	17. సి	18. ఎ	19. సి	20. సి
21. బి	22. బి	23. డి	24. సి	25. ఎ

శ్రీలంకలో ఎస్‌బిఐ శాఖను ప్రారంభించిన నిర్మలా సీతారామన్

మూడు రోజుల పర్యటన లో భాగంగా శ్రీలంకలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ట్రిం కోమలీలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బిఐ) కొత్త శాఖను ప్రారంభిం చారు. దీని ద్వారా శ్రీలంకకు ఇండియాకు మధ్య ఆర్థిక సంబంధాలు మరింత మెరుగు పడనున్నాయి.

పర్యాటక ప్రోత్సాహం కొరకు భారతీయులకు వీసా రహిత ప్రవేశం కల్పించిన థాయ్‌లాండ్

భారతదేశం, తైవాన్ పౌరులకు వీసా రహిత ప్రవేశాన్ని కల్పించడం ద్వారా థాయ్ లాండ్ తన పర్యాటక రంగాన్ని అభివృద్ధి పర్చ డానికి చర్యలు తీసుకొంది. దీని ద్వారా భారత దేశం, తైవాన్ పౌరులు వీసా లేకుండా థాయిలాండ్‌లో గరిష్టంగా 30 రోజులు ఉండగలరు.




హైదరాబాద్‌లో వాయుకాలుష్యం 18.6శాతం పెరుగుదల



రెస్పిరల్ రిపోర్ట్ ప్రకారం వాయు కాలుష్యం గత ఏడాదితో పోలిస్తే నాలుగు ప్రధాన నగరాలలో పెరిగిందని పేర్కొంది. ప్రధాన రాష్ట్ర రాజధానులలో 2019 మరియు 2023 మధ్య పి.ఎం 2.5 సాంద్రతలను అధ్యయనం విశ్లేషించింది. హైదరాబాద్‌లో పి.ఎం. 2.5 2019 మరియు 2020 మధ్య 59శాతం పెరిగింది. 2021లో 2.97 మరియు 2022లో గణనీయంగా 29.1శాతం పెరిగింది. అయితే 2023లో 18.6 శాతం మళ్ళీ పెరిగింది.

ప్రముఖ రచయిత టి.పద్మనాభన్‌కు ప్రతిష్టాత్మక కేరళ జ్యోతి అవార్డు



కేరళ ప్రభుత్వం ప్రఖ్యాత రచయిత టి.పద్మ నాభన్‌ను ప్రతిష్టాత్మక కేరళ జ్యోతి అవార్డు గ్రహీతగా ఎంపిక చేసింది. మలయాళ సాహిత్యానికి పద్మనాభన్ చేసిన విశేష సేవలకు గుర్తింపుగా రాష్ట్రంలో ఈ అత్యున్నత పౌర పురస్కారం లభించింది. సామాజిక జీవితంలో వివిధ అంశాలకు విశేషమైన కృషి చేసిన వ్యక్తులకు కేరళ పురస్కారాలు' అని పిలిచే అనేక ఇతర ప్రశంసలు కూడా కేరళ ప్రభుత్వం ప్రకటించింది.